# జనబలం

ప్రజలే ప్రభువులు

సెప్టెంబర్ 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




ఆఫ్రికా వారినీ అబ్బురపరిచిన లోక్‌సత్తా భావజాలం

అప్రజాస్వామిక పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కాపాడలేవు

లోక్‌సత్తా 30 YEARS

## జెన్‌జెడ్ నాయకత్వంలో కార్యాచరణ సమాలోచన

## నీలేకన్ కమిటీకి జేపీ సూచనలు






# నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎఫ్‌డీఆర్ సైన్స్ సెంటర్ ప్రారంభం

ఉద్యోగావకాశాలు అంటే ప్రభుత్వోద్యోగాలు కాదని, నిజమైన ఉపాధి, ఆదాయాలు మార్కెట్లో ఉంటాయని.. వీటిని అందుకోవాలంటే నాణ్యమైన పాఠశాల విద్య కీలకమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మార్కెట్‌లో ఉపాధి అవకాశాలున్నా, నైపుణ్యాలున్నవారు అవసరానికి తగినంతమందిలేరని పలు సంస్థలవారు పేర్కొనటం మన విద్యావ్యవస్థ అధ్వాన్న స్థితికి నిదర్శనమన్నారు. డబ్బు ఖర్చు చేస్తున్నా, ఫీజు రీఇంబర్స్‌మెంట్‌లు అమలు చేస్తున్నా.. పనికొచ్చే విద్య ఎందుకు అందటం లేదో లోతుగా ఆలోచించకుండా మీడియా హెడ్‌లైన్స్ డైలాగులతో పాలకులు కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎఫ్‌డీఆర్ 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్'ని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి జేపీ ప్రారంభించారు.

ల్యాబ్‌కి వెళ్లకుండానే ఈవేళ ఇంటర్మీడియెట్‌లో ప్రాక్టికల్స్‌లో నూరు శాతం మార్కులు సంపాదిస్తున్నారని, తమకు 1967 ప్రాంతంలోనే గోపాలరావుగారు అనే టీచర్ స్కూలుకు కప్పను పట్టుకొచ్చి ఎనస్థీషియా ఇచ్చి డిసెక్ట్ చేసి వివరించారని జేపీ తెలిపారు. జీవితంలో సైన్స్ ఒక భాగం కావాలని, అందుకే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్ల'ను వీలైనన్ని చోట స్కూళ్లలో ప్రారంభిస్తోందన్నారు. ఎన్నారైలు, ఇతర వనరులున్నవారిని కూడా తమ స్వస్థలాల్లో అటువంటి సేవకు ప్రోత్సహిస్తోందన్నారు. ప్రజల పన్నుల డబ్బుని ఓట్ల కోసం తాయిలాలుగా పంచటం కాకుండా.. మంచి చదువు అందేలా చూడాలని సభలో పాల్గొన్నమంత్రి వాసంశెట్టిని కోరారు. తాను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉండగా ఇంటర్వ్యూ చేసి టీచర్‌గా ఎంపిక చేసిన ఉప్పలపాటి మాచిరాజు ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులుగా రిటైరైన సందర్భంగా జేపీ సన్మానించారు. రిటైరవటమంటే ఇక చేయాల్సిన పనేమీలేదనుకోవటం పొరపాటని, మాచిరాజు లాంటి అవగాహనగలవారు సమాజానికి చేయవలసింది చాలా ఉందన్నారు. పనికొచ్చే నైపుణ్యాలు పెరిగేలా బోధించటం, ఒత్తిడి లేకుండా నిర్ణీత సిలబస్ కాలవ్యవధిలో అభ్యసన ప్రమాణాల్ని బేరీజు వేసేలా పరీక్షల్ని సంస్కరించటం పాఠశాల విద్యను బాగుచేయటానికి కీలకమని.. ఈ కృషిలో రిటైర్డ్ ఉపాధ్యాయులూ భాగమవ్వాలని జేపీ అన్నారు.

### సరైన ప్రశ్నలతో పరిష్కారంలో భాగమవ్వండి

విద్యార్థులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో స్వతంత్రంగా, విమర్శనాత్మకంగా ఆలోచించాలని, సరైన ప్రశ్నలతో పరిష్కార నైపుణ్యాలను పెంచుకోవాలని జేపీ అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూకే పరిధిలోని యూసీఈకేలో ప్రవేశం పొందిన బీటెక్ విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. తార్కిక ఆలోచన, సృజనాత్మకత, పరిశోధన, అధ్యయన పరిధి విస్తరించుకోవటం, ఆవిష్కరణలు డిగ్రీకే కాక భవిష్యత్తు వృత్తి జీవితంలోనూ కీలకమన్నారు. వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్స్, ఫ్యాకల్టీ, విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సెప్టెంబర్ 2026

సంపుటి 28 సంచిక 09

## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్



జెన్‌జెడ్ నాయకత్వంలో కార్యాచరణ సమాలోచన 06

30+ లోకి లోక్‌సత్తా: నేతల ప్రశ్నలకు జేపీ జవాబులు 17

30 ఏళ్ల లోక్‌సత్తా సాధించిన విజయాలు 20

అప్రజాస్వామిక పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కాపాడలేవు 24

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శ్వేతపత్రం కొన్ని సవాళ్లు 30

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం – భారత్ సవాళ్లు 32

నీలేకని కమిటీ – పరీక్షల్లో సంస్కరణలు 34

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# జిడిపి సరే.. జీవితాలు పెరిగాయా?

ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసిక జిడిపి వృద్ధిరేటు 7.8 శాతం గానూ, రెండో త్రైమాసిక వృద్ధిరేటు 8.2 శాతంగానూ నమోదు అయ్యింది. గత ఆర్థిక సంవత్సరంలో వార్షిక వృద్ధిరేటు 7.6 శాతంగా ఉందని రిజర్వు బ్యాంకు ప్రకటించింది.రానున్న మొత్తం ఆర్థిక సంవత్సరంలో వార్షిక వృద్ధిరేటు 6.8 శాతంగా ఉంటుందని రిజర్వు బ్యాంక్ అంచనా వేసింది.

భారతదేశంలో జిడిపి వృద్ధిరేటు 6.5 శాతంగా ఉంటుందని ప్రపంచబ్యాంక్, 7.3 శాతంగా ఉంటుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, 6.7 శాతంగా ఉంటుందని ఓఈసిడి సంస్థ అంచనా వేశాయి. మూడీస్ , ఎస్ అండ్ పి వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా భారత జిడిపికి సంబంధించిన తమ పూర్వపు అంచనాలను సవరించాయి. వృద్ధిరేటులో స్వల్ప పెరుగుదల ఉంటుందని చెప్పాయి.

దేశీయ డిమాండు, సేవల వినిమయం పెరగడం , తయారీరంగం పుంజుకోవడం వంటి కారణాలవల్ల ముందు వేసిన అంచనాలను మించి జీడీపీ పెరిగిందని భారత ప్రభుత్వ గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఇటీవల ప్రకటించింది. ప్రభుత్వం గతేడాది ప్రకటించిన ఆర్థిక సర్వేలో వృద్ధిరేటు 6.3 శాతం నుండి 6.8 శాతంగా ఉంటుందని పేర్కొన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అది 6.9 శాతం ఉంటుందని రిజర్వు బ్యాంక్ అంచనా వేసింది.

గత పదేళ్ల జిడిపి సగటు వార్షిక వృద్ధిరేటు 6 శాతం నుండి 7 శాతం వరకూ ఉందని గణాంకాలు చూస్తే అవగతం అవుతుంది. పదేళ్ల క్రితం భారత జిడిపి విలువ 2.1 ట్రిలియన్ డాలర్లు ఉండగా 2025 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంకెలు చెబుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, అటవీ, మత్స్య, గనులు వంటి మౌలిక రంగాలలో వృద్ధిరేటు 3.5 శాతం మాత్రమే ఉంది. కానీ తయారీ, నిర్మాణ, విద్యుత్, ఇంధనం, వంటి ద్వితీయ రంగాలలో 8.1 శాతం , సేవల రంగంలో వృద్ధిరేటు 9.2 శాతంగా నమోదు అయ్యింది. పదేళ్ల క్రితం ప్రపంచంలో పదో ఆర్థికశక్తిగా ఉన్న భారత్ నేడు ఐదో ఆర్థికశక్తిగా ఎదిగిందని ఈ గణాంకాలు మనకు వివరిస్తున్నాయి. పాలకులు, ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్పే ఈ జిడిపి వృద్ధిరేటు గణాంకాలు ప్రజల జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయనేది కీలకం.

గత పదేళ్ల జిడిపి వృద్ధిలో మౌలిక సదుపాయాల కల్పనారంగం వాటా చాలా ప్రధానంగా ఉన్నది. అందులో చేపట్టిన ప్రాజెక్టులు మన కంటిముందు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవేలు, భారీ వంతెనలు, కొత్త రైల్వే మార్గాలు, రైల్వే లైన్ల విద్యుదీకరణ, రైలు స్టేషన్ల ఆధునీకరణ వంటివి కనిపిస్తున్నాయి. ఎన్నో వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. కొత్తకొత్త విమానాశ్రయాలు, ఓడరేవులు వస్తున్నాయి! ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. అమరావతిలో మరో విమానాశ్రయాన్ని ప్రతిపాదించారు. అనేక రాష్ట్రాలలో కొత్త కొత్త విమానాశ్రయాలు ఉనికిలోకి వచ్చాయి. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే అలీఘర్, మొరాదాబాద్, చిత్రకూట్, ఆజంగఢ్, శ్రావస్తి, సహారన్‌పూర్ పట్టణాల్లో విమానాశ్రయాలు నిర్మాణమయ్యాయి. అయితే వీటిని వినియోగించుకునే ప్రయాణికులే లేకుండా పోయారు! కొన్ని చోట్ల సాధారణ వాణిజ్య విమానాల రాకపోకలు అతి స్వల్పంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు లేనేలేవు. 2021 అక్టోబర్‌లో కుశీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఎంతో ఆర్భాటంగా ఆరంభమయ్యింది. ఇది బౌద్ధ సర్క్యూట్‌ను ప్రపంచంతో అనుసంధానం చేస్తుందని, పర్యాటకాన్ని పెంచుతుందని, ఉపాధి కల్పిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ఒక నెల తర్వాత దేశీయ విమానాలు ప్రారంభ మయ్యాయి. నేడు కుశీనగర్‌లో సాధారణ షెడ్యూల్డ్ ప్రయాణికుల సేవలు లేనేలేవు. విమానాశ్రయం నిర్మితమైంది, నిధులు ఖర్చయ్యాయి, ఆ నిర్మాణం జిడిపి వృద్ధిలో భాగమైంది. ప్రాజెక్టుల్లో అవినీతి, నాణ్యతా లోపాల విషయం అలా ఉంచుదాం. ప్రయాణికులు అసలు ఈ విమానాశ్రయాలను వినియోగించుకోవడం లేదనేది దిగ్భ్రాంతి

కలిగించే అంశం!

ఎక్స్‌ప్రెస్ హైవేలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ప్రీమియం రైళ్లపై భారతదేశం మున్నెన్నడూ లేనంత భారీగా ఖర్చు చేస్తోంది. వీటికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్న మాట నిజమే. కానీ ఈ అభివృద్ధి ప్రజలకు చేరడం లేదనేది కూడా అంతే నిజం! ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, మౌలిక వసతుల వ్యయం వెంటనే జిడిపిని పెంచుతుంది. భారీ నిర్మాణాల వల్ల ఆర్థిక లావాదేవీలు వేగం పుంజుకుంటాయి. సిమెంట్, ఉక్కు కొనుగోలు జరుగుతుంది. కార్మికులకు ఎంతో కొంత ఉపాధి లభిస్తుంది. వారికి వేతనాలు అందుతాయి. కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరుగుతాయి. ఇదంతా ఆర్థిక కార్యకలాపంగా మారుతుంది.

రెండవది, పాలక పక్షాలకు ఇదో గొప్ప ప్రచార అవకాశాన్ని కల్పిస్తుంది. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, నీటిపారుదల, ప్రజా రవాణా, తాగునీరు, విద్యుత్ నెట్‌వర్క్ ల వంటి ఉత్పాదక మౌలిక సదుపాయాలు సాధారణ పౌరుల ఆరోగ్యం, విద్య, ఉత్పాదకతను మెరుగుపరుస్తాయి. ఆర్థిక ప్రయోజనం అంతగా కనిపించని నిర్మాణాలు కూడా ఉంటాయని మనకు తెలుసు. అత్యంత విలాసవంతంగా చేపట్టిన ఖరీదైన నిర్మాణాలు పర్యాటక లేదా వాణిజ్య విలువను కలిగి ఉంటాయి. కానీ వీటిలో సమాన ప్రజా ప్రయోజనం ఉందని మాత్రం చెప్పలేం. ఈ ప్రాజెక్టుల ప్రభావం రాజకీయంగా ఎక్కువే ఉంటుంది. అవి జిడిపిని, ప్రచార చిత్రాలను, ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందనే భావనను సృష్టిస్తాయి. అయితే సాధారణ ప్రజలకు వీటి ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్న.

ఒక్కో భారతీయునిపై కేంద్రప్రభుత్వ మూలధన వ్యయం 2014-15లో దాదాపు 1,500 రూపాయలు ఉండగా, 2024-25 నాటికి అది సుమారు 7,300 రూపాయలకు పెరిగింది. అదే సమయంలో 2014-15లో ఒక్కొక్కరిపై ఉన్న అప్పు దాదాపు 49,500 రూపాయలు కాగా, 2024-25 నాటికి దాదాపు 1.3 లక్షల రూపాయలకు చేరింది. ఒక్కొక్కరిపై పడే వడ్డీ భారం 3,100 రూపాయల నుంచి సుమారు 7,700 రూపాయలకు పెరిగింది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలను ఎక్కువగానే కల్పించింది. అప్పుల భారం కూడా భారీగా పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 4-5 నెలల్లో కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిన 17.62 లక్షల కోట్ల రూపాయలలో 4.27 లక్షల కోట్ల రూపాయలు కేవలం వడ్డీల చెల్లింపులకే సరిపోయాయి. దీనితో పోలిస్తే ప్రధాన సబ్సిడీలపై ఖర్చు చేసింది కేవలం 1.54 లక్షల కోట్ల రూపాయలు మాత్రమే. అంటే, సబ్సిడీల కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ మొత్తం వడ్డీలకే సరిపోతోంది. ప్రస్తుతం అప్పులు చేసి నిర్మించి ప్రారంభించినప్పటికీ, దాని వడ్డీ భారం ఏళ్ల తరబడి కొనసాగుతుంది.

మోస్తున్న అప్పుకు తగిన ప్రతిఫలం సాధారణ పౌరుడికి అందుతోందా? జిడిపి ఆర్థిక కార్యకలాపాలను మాత్రమే కొలుస్తుంది కానీ వ్యక్తిగత సంపదను కాదు. వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మించినప్పుడు జిడిపీ పెరుగుతుంది, కానీ కూలీల జీతం పెరగదు. వేతన జీవుల ఈ.ఎం.ఐ.లు తగ్గవు. స్కూల్ ఫీజు భారం తగ్గదు. నిత్యావసరాల ఖర్చులు భారంగా ఉంటాయి. 2000 సంవత్సరంలో తలసరి కేంద్ర ప్రభుత్వ అప్పు దాదాపు 12,000 రూపాయలు ఉండగా, 2013-14 నాటికి 46,000 రూపాయలు, 2024-25 నాటికి సుమారు 1.3 లక్షల రూపాయలకు చేరింది.

ఇన్ఫ్రా రంగ వ్యయ పరిమాణం పెరగడంతో అప్పుల భారం భారీగా విస్తరించింది. నేడు ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందే వ్యక్తి కాకుండా, రేపటి పన్ను చెల్లింపుదారులు అప్పులకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. దీని ఒత్తిడి ఇతర రంగాలపై పడుతోంది. జియో పొలిటికల్ పరిణామాలు, ఎడతెగని రీతిలో సాగుతున్న ప్రాంతీయ యుద్ధాలు, అంతర్జాతీయ వ్యాపార ఉద్రిక్తతలు, విచ్చలవిడి సుంకాలు, కరెన్సీ, బాండ్ మార్కెట్ల అస్థిర పరిస్థితులు, ద్రవ్యోల్బణ ధోరణులు, మన ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. గణాంకాల గురించి ఎంత సంకీర్తనం చేసుకున్నా ప్రయోజనం లేదు. ఆర్థికవ్యవస్థ వృద్ధి వల్ల ప్రజా జీవితంలో ముఖ్యంగా గృహ బడ్జెట్‌లో సానుకూల మార్పులు రావడమే వృద్ధి అనే మాటకు అసలు అర్థం.

డి. సోమసుందర్

# వసంతాల లోక్‌సత్తా- ఏళ్లకు జెన్ జడ్ నాయకత్వంలో కార్యాచరణ సమాలోచన

ప్రజలే ప్రభువులు

*"First, no single person can change India. The Scale of Change is that huge. India is very different. India encompasses many different languages, cultures, and regional identities. China is 'a much easier country than India to lead' because over 90 percent of its population shares a common language and a centralized system."*

*- Lee Kuan Yew, Founder of Singapore, when asked if he could replicate his transformation of Singapore in India*



ఆధునిక ప్రజాస్వామ్యంలో రాజ్యవ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యతలేమిటో నిర్వచించకపోవటం స్వతంత్ర భారతదేశంలో పెద్ద సైద్ధాంతిక వైఫల్యమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనివ్వకపోవటం మరో పెద్ద పొరపాటన్నారు. ఈ నేపథ్యంలోనే, రాజ్యాంగానికి-సమాజానికి మధ్య అంతరాన్ని తగ్గించేందుకు రాజకీయ, పాలనా రంగాల్లో ప్రజాస్వామిక సంస్కరణల కోసం లోక్‌సత్తా ఆవిర్భవించిందన్నారు.

*లోక్‌సత్తా 30వ ఆవిర్భావ సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమాలోచన-భవిష్యత్ కార్యాచరణ సమావేశంలో జేపీ పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. సీనియర్ నాయకులు డీవీవీఎస్ వర్మ, డాక్టర్ పర్చ అంజనాదేవి, పద్మారాణి, బండారు రామ్మోహనరావు, కటారి శ్రీనివాసరావు, భీశెట్టి బాబ్జీ, డి.లక్ష్మి, తుమ్మనపల్లి శ్రీనివాస్, దోసపాటి రాము తదితరుల ప్రసంగాల్లో లేవనెత్తిన, హాజరైన ఇతర నేతల ప్రశ్నలకు జవాబులిచ్చారు.* సభా కార్యక్రమాలను ఎఫ్‌డీఆర్ రీసెర్చి మీడియా ఎనలిస్ట్ శరణ్య ప్రారంభించగా.. 30 ఏళ్ల జర్నీపై, జేపీ మార్గదర్శకత్వంలో వచ్చే 30 ఏళ్లు జెన్ జడ్, జెన్ ఆల్ఫా నాయకత్వ బాధ్యతల్లో లక్ష్యసాధనకు రోడ్‌మ్యాప్‌పై రెండు ప్యానల్స్‌గా జరిగిన చర్చలను ఎఫ్‌డీఆర్ ఎనలిస్ట్‌లు లిఖిత, సంతోషిణి సమన్వయం చేశారు. కాన్సెప్ట్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన ఎఫ్‌డీఆర్ మీడియా విభాగం సమన్వయకర్త అంకిత్, రీసెర్చి ఎనలిస్ట్‌లు ప్రితి బన్సల్, వర్షిత్, ఆదిత్య, అక్షత్, అక్షయ్, సంతోష్, నజీర్, ఓయిషీ, శ్రిత, సాత్వి,



నిహారిక, శ్వేత, స్వయంభు, ప్రీతి, ఉదయ్, శ్రీరామ్ తదితరులు సమావేశ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

లోక్‌సత్తా 30 ఏళ్ల సమాలోచనకు ముందు సీనియర్ నేతల మాటల్లో ఎజెండా, సాఫల్యాలు, జాప్యాలు, అవరోధాలపై ఎఫ్‌డీఆర్ బృందం రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అందులో లోక్‌సత్తా ప్రజాస్వామ్య సంస్కరణల్లో కీలకమైన ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేని పౌర సేవలు, జవాబుదారీతనం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాల ద్వారా గ్రామాలు–పట్టణాల మధ్య అంతరం తగ్గించటం, అందుబాటులో వేగంగా న్యాయం మొదలైన అంశాల గురించి.. వాటిల్లో జెన్ జడ్ ఎక్కువ బాధ్యత తీసుకొని ఇక ముందు చేయాల్సిన కృషి మొదలైన అంశాలను జేపీ వివరించారు. దేశ చరిత్రలో మొదటిసారిగా లోక్‌సత్తా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో నేరచరిత్ర గలవారి వివరాల్ని చాలా ప్రామాణికంగా విశ్లేషించి ప్రకటించిందని, శేషన్‌లాంటి అధికారులతో పాటు దేశమంతా దిగ్భ్రాంతి చెందిందని, అంతిమంగా అభ్యర్థులు తమ వివరాలన్నిటినీ అఫిడవిట్‌లో చట్టబద్ధ విధిగా తెలియచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. అప్పటిదాకా మా వివరాలు ప్రజలకు ఎందుకు అని దబాయించిన నేతలు, కమ్యూనిస్టులు సహా ఇతర పార్టీలు చివరికి ఆ వివరాలు ఇవ్వకపోతే అనర్హులయ్యే పరిస్థితి ఏర్పడిందని జేపీ తెలిపారు. ఇంత సంచలనానికి అవకాశంలేని, దేశ భవిష్యత్తుకి ఏఐ యుగంలో సైతం ఎంతో కీలకమైన స్థానిక ప్రభుత్వాల సాధికారత బోరింగ్ విషయమైనా.. లోక్‌సత్తా అద్భుతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగిందన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా 1 కోటీ 8 లక్షలమంది ప్రజలు తమ కంటి ముందు ప్రభుత్వం, ఇంటి ముందు పాలనకి మద్దతు పలికారన్నారు. హైదరాబాద్ లలిత కళాతోరణంలో నిర్వహించిన స్థానిక ప్రభుత్వాల సాధికారత తీర్మాన సభకు సొంతంగా బస్సులు వేసుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నలుమూలల్నుండి స్థానిక ప్రజాప్రతినిధులు, లోక్‌సత్తా సభ్యులు వచ్చారన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీ సహా అన్ని పార్టీల నాయకులూ మద్దతిచ్చారన్నారు. అయితే ఈలోగా ముఖ్యమంత్రిపై అలిపిరిలో నక్సల్స్ దాడి జరగటం, అసెంబ్లీ రద్దు చేయటంతో అవరోధం ఏర్పడిందన్నారు.

నిజమైన ప్రజాసమస్యలతో ప్రధాన పార్టీలకు సంబంధం తెగిపోవటం, స్వతంత్రం వచ్చినప్పటి నుండి మౌలిక సమస్యలు అలాగే అరకొర మార్పులతో కొనసాగుతుండటంతో కనీసం 10% ఓట్లు తెచ్చుకుని వారిని జనరాజకీయం బాట పట్టించేందుకు లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని 2006లో పార్టీగా కూడా విస్తరించామని జేపీ తెలిపారు. ఒక్క సీటే లోక్‌సత్తాకు లభించినా, అసెంబ్లీలో చరిత్రాత్మక బాధ్యత నిర్వర్తించిందన్నారు. కానీ నగరాల్లో పది శాతం ఓట్లు వస్తున్నా, గ్రామాలలో ఒకటి రెండు శాతం మాత్రమే వస్తుండటం, మన ఎన్నికల వ్యవస్థలో మూడో పార్టీగా ఉండటం వల్ల క్రమంగా ఆ శాతం కూడా తగ్గటంతో ఎన్నికలకు విరామం ప్రకటించాల్సి వచ్చిందన్నారు. గ్రామీణ ప్రజలకూ మార్పు రావాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ, వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటానికి రాజకీయ కార్యకర్తల అండ అవసరం కావటం, ఎన్నికల మధ్యకాలంలో దళారీ పాత్రకు కొందరిని చట్టవిరుద్ధ వనరులతో పోషించే ధనరాజకీయం కోసం లోక్‌సత్తా రాలేదు కాబట్టి.. వారి అభిమానాన్ని ఓట్ల రూపంలోకి మార్చుకోలేకపోయామన్నారు. కానీ అప్పుడు, ఇప్పుడు

కూడా రాజకీయం పవిత్ర వ్యాసంగం అని తాను నమ్ముతున్నానని జేపీ స్పష్టం చేశారు. బహుశా రాజకీయ వ్యవస్థను ఇంత గౌరవించిన ఉద్యమం, పార్టీ ఇంకొకటి భారత్‌లో లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేయనంతమాత్రాన రాజకీయ కృషిని తాము ఏమీ ఆపలేదని, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఉద్యమ వేదికగా అంతకంటే లోతుగా కొనసాగిస్తున్నామన్నారు. విభజనలకు అవకాశం ఉన్నందున అప్పట్లో పరిమితంగానే ప్రస్తావించిన ఆర్థిక ఎజెండా మీద ఇప్పుడు ఎక్కువ దృష్టి కేంద్రీకరించామన్నారు. ఇందుకు భారత్‌లో ఇప్పుడు ఓ అద్భుత అవకాశం ఉండటం, విద్య, ఆరోగ్యం తదితర అంశాల్లో ప్రభుత్వం తన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించటం ద్వారా ఆర్థికాభివృద్ధిని సమ్మిళితమయ్యే అవకాశం వల్ల.. ఆర్థిక, పాలనా సంస్కరణలు, ఇందుకు తగిన మేధోవనరుల్ని యువతలో పెంపొందించటం, అలాంటివారు చట్టసభల్లో, ప్రభుత్వంలో భాగమయ్యేలా కోట్ల డబ్బు అవసరంలేకుండా ఎన్నికల సంస్కరణలతో దామాషా పద్ధతి కోసం కృషి చేస్తున్నామన్నారు. లోక్‌సత్తా ఈ 30 ఏళ్లలో వెదజల్లిన విత్తనాలు ఈవేళ మొలకలవుతున్నాయని తమిళనాడు, జెన్ జడ్ ఆందోళనల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు రుజువు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం లోక్‌సత్తా చేస్తున్న సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి వల్ల యువతకు ఆదాయాలు, విషయ పరిజ్ఞానం పెరిగి అటువంటి మార్పు బలపడి, దేశవ్యాప్తమయ్యే అవకాశం ఉందన్నారు. అయితే ఇందుకు కనీసం మరో ఇరవై ఏళ్లు పట్టవచ్చని జేపీ అంచనా వేశారు. రాజకీయాల్లో ప్రజాస్వామ్యం అత్యుత్తమ ఆచరణసాధ్య పద్ధతి కాగా.. అందులో మార్పు హింసతో, ఎన్నికల బయట సాధ్యంకాదన్నారు. అందువల్లే ప్రజాస్వామ్యం సంస్కర్తలకి అపార సహనం అవసరమని, కానీ కచ్చితంగా భారతదేశంలో మార్పు వస్తుందన్నది హేతుబద్ధ ఆశావాదమని జేపీ పేర్కొన్నారు.

### మొదటి ప్యానల్ చర్చ
### *లోక్‌సత్తా 30 ఏళ్ల జర్నీ*

మోడరేటర్ లిఖిత ప్రశ్న: వ్యక్తుల కంటే వ్యవస్థల్ని మార్చాలనే రాజకీయ లక్ష్యంతో లోక్‌సత్తాను స్థాపించాలని ఏ అవగాహనతో అనుకున్నారు?

**ఆటగాళ్లను మారిస్తే చాలదు.. ఆట నియమాల్నీ మార్చాలి**
**డీవీవీఎస్ వర్మ (లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శి)**

పరిపాలనలో వ్యక్తుల్ని చూడటం మనకు అలవాటు. కానీ మనకు కావలసిన పనులు జరగాల్సింది వ్యవస్థల ద్వారా. అది మనం గమనించకపోవటం వల్ల తరచూ దుష్పరిపాలనకు బాధితులమవుతుంటాం. అందువల్లే జేపీ గారు 'ఆటగాళ్లు మారితే చాలదు, ఆట నియమాలు మారాలి' అని నినాదం ఇచ్చారు. ఇది ఎంతో కీలకమైనది. దీనివల్ల అనేకమంది సమర్థులు రాజకీయాల్లో ప్రజల పక్షాన మేలు చేయగలుగుతారు.

### లోక్‌సత్తా బాటలో
### మా ఊరిలో విద్య, ఆరోగ్యం బాగుచేస్తున్నాం

**-పద్మారాణి (మహిళాసత్తా)**

వ్యక్తుల కంటే వ్యవస్థలు ముఖ్యం అని చెప్పటంతోపాటు జేపీ స్థాయి వ్యక్తి అందుకోసం ముందడుగు వేయటం నాకు స్ఫూర్తినిచ్చింది. ఒక్కసారి లోక్‌సత్తా భావజాలాన్ని ఎంతోకొంత అర్థం చేసుకున్నవారు, ఆ కృషిని ఏదోకరూపంలో కొనసాగించకుండా ఉండలేరు. ఇప్పుడు లోక్‌సత్తా ఎన్నికలకు విరామం ప్రకటించినా.. మా గ్రామంలో విద్య, వైద్యం కోసం ఒక ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేస్తున్నాను. ముందు ఓ ప్రయివేటు స్కూలును బాగుచేసి మంచి విద్య అందేలా చేశాను. ఎస్.సి, ఎస్.టి, బి.సి, పేద విద్యార్థులు, అమ్మాయిలు ఎక్కువగా ఉండే ప్రభుత్వ హైస్కూల్ మీద ఆ తర్వాత దృష్టి పెట్టి బాగు చేశాం. ఊరిలో పెద్దలంతా కలిసివస్తున్నారు. భోజనానికి ఒక్కో పిల్లకి రూ.6.10 పైసలు అవుతుంటే, ప్రభుత్వం రూ.6 ఇస్తోంది. అందులో కొంత వంటచేసేవారు మిగుల్చుకుంటున్నారు. దీంతో, పిల్లలకి పౌష్టికాహారం అందటం లేదు. ఈ లోపాన్ని మేం కొంత డబ్బు స్వచ్ఛందంగా ఇచ్చి సరిదిద్ది పిల్లలు చదువు మీద దృష్టి పెట్టేలా చేశాం. మహిళాసత్తా తరపున మద్యనియంత్రణ ఉద్యమం చేసిన అనుభవంతో గ్రామంలో బెల్ట్ షాపుల్ని తొలగిస్తున్నాం. మనం పౌరులుగా అవగాహనతో, ఇతరులను కలుపుకొని, ప్రజలకు నచ్చచెబుతూ పనిచేస్తుంటే.. క్రమంగా వ్యవస్థ మారుతుందని లోక్‌సత్తా నుండి నేర్చుకున్న పాఠంపై నమ్మకం మరింత పెరిగింది.

**చెడ్డ పాలకులు వచ్చినా..**
**మంచి చేసే వ్యవస్థల్ని నిర్మించాలి డాక్టర్ జేపీ**

రాజకీయాలంటే దేవతలు, రాక్షసుల మధ్య యుద్ధం కాదు. మంచివారు, చెడ్డవారి మధ్య పోరాటం కాదు. 1971లో ఇందిరాగాంధీ గొప్ప హీరో. అపర దుర్గామాత. నాలుగేళ్లలో విలన్‌గా మారింది. మా తరంలో ఎందరినో కదిలించిన ఎమర్జెన్సీ సమయంలో ఆమెను గద్దె దించినా మార్పు రాకపోవటం నన్ను లోతుగా ఆలోచింప చేసింది. ఆ క్రమంలో ఎంబీబీఎస్ తర్వాత ఐఏఎస్‌గా ప్రభుత్వంలో చేరాక ఇంకా బాగా అర్థమైంది. ఆ ఢక్కా మొక్కీలు తిన్నాను కాబట్టే.. వ్యవస్థల ప్రాధాన్యత గుర్తించాను. మంచి



జిల్లాల్లో పర్యటన తర్వాత పార్టీగా లోక్‌సత్తాను విస్తరించాలని నిర్ణయించుకున్నాం. మురికిని కడగాలంటే, మురికిలోకి దిగాల్సిందే. నాకు ఇప్పటికీ లోక్‌సత్తా భావజాలం పట్ల అదే ఆర్తి, అదే ఉత్సాహం, తపన ఉన్నాయి. వయసు పైబడుతున్నా, ఆరోగ్య సమస్యలు లేవు. జెన్ జడ్‌తో కలిసి పనిచేయాలని ఉత్సాహపడుతున్నాను. లోక్‌సత్తా 30వ ఆవిర్భావం సందర్భంగా ఎన్నారైల యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడినప్పుడు కూడా.. అందరూ రాజకీయంగా లోక్‌సత్తా అవసరం ఈవేళ భారత్‌కి ఎంతో ఉందన్నారు.

చేయకుండా ఉండటానికి ప్రభుత్వంలో బోలెడు వంకలుంటాయి. ప్రతివారూ ఏదోక కారణం చెబుతారు. ప్రభుత్వ యంత్రాంగంలో అందరూ ఉంటారు, కానీ వైఫల్యానికి ఎవరూ బాధ్యత తీసుకోరు. ప్రభుత్వోద్యోగుల్లో మిగతావారు నూటికి 5-6 చేయగలగటం వల్ల, 30 చేసే నాలాంటివాళ్లు గొప్పగా కనిపిస్తారు. అందువల్లే, ఏ ప్రభుత్వం వచ్చినా, అంతకుముందు ప్రభుత్వం మెరుగనిపిస్తుంటుంది. కాబట్టి.. మంచివారు బాగా పనిచేయగలగటమేకాదు, చెడ్డవారు వచ్చినా బాగా పనిచేసేలా వ్యవస్థల్ని నిర్మిస్తేనే ప్రజాస్వామ్యం నిజంగా పనిచేస్తుంది. లోక్‌సత్తా ప్రతిపాదించిన ప్రజాస్వామ్య సంస్కరణల లక్ష్యమైన "పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం" ఆచరణగా మారతాయి.

ప్రశ్న: భిన్నమైన నేపథ్యం ఉన్నవారందరినీ ఒక ఉమ్మడి ఎజెండాతో లోక్‌సత్తా ఎలా కలపగలిగింది?

### జెన్ జడ్‌తో కలిసి పనిచేయాలని ఉవ్విళ్లూరుతున్నా బండారు రామ్మోహనరావు (లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త)

ఎమర్జెన్సీకి ముందే బారువా అనే కాంగ్రెస్ నాయకుడు 'ఇందిరే ఇండియా' అనే నినాదమివ్వటాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకించి వ్యాసం రాస్తే, గోరా శాస్త్రిగారు ప్రచురించారు. ఆ తర్వాత సర్పంచ్‌గా పనిచేస్తూ అడ్వొకేట్‌గా స్థిరపడ్డా. లోక్‌సత్తాను జేపీ స్థాపించాక అందులో 'ఆటగాళ్లను మారిస్తే చాలదు, ఆట నియమాల్నీ మార్చాలి' నినాదం నన్నెంతో ఆకట్టుకుంది. 1999లో చేరాను. తర్వాత ఉద్యమాన్ని 2006 అక్టోబర్ 2న పార్టీగా విస్తరించాలనుకున్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 150 సమావేశాలు నిర్వహించగా నేను, సోమసుందర్ గారు పాల్గొన్న సమావేశాల్లో 68లో చాలా చోట్ల వ్యతిరేకత వ్యక్తమైంది. కానీ లోక్‌సత్తా మాటలు చెప్పటం కాదు, ఒడ్డున కూర్చుని గడ్డలు వేయటం కాదు.. అనే విమర్శ ప్రజల్లో ఎక్కువగా వినిపించేది. దీంతో 23

### ఏ అంశానికైనా లోక్‌సత్తాలో సమగ్ర, వినూత్న పరిష్కారాలు: వర్మ

ఈ ప్రశ్నకు ముందుగా నేను సమాధానం ఇవ్వాలి. నేను కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి వచ్చాను. సుమారు 30 ఏళ్లపాటు. అప్పట్లో సురవరం సుధాకరరెడ్డి తదితరులతో కలిసి వివిధ బాధ్యతలు నిర్వర్తించాను. కానీ ఒక వర్గానికే కమ్యూనిస్టులు పరిమితం కావటం, కొంత ఇరుకుగా అనిపించటం వల్ల లోక్‌సత్తా నాకు ఎంతో ఆసక్తి కలిగించింది. ముఖ్యంగా మార్పుకు చోదకశక్తులైన మధ్యతరగతి భాగస్వామ్యానికి లోక్‌సత్తా భావజాలం అనుకూలంగా ఉండటం, మూస పద్ధతులు కాకుండా కొత్త రాజకీయ పంథాను అనుసరించటం. విశాల దృక్పథంతో పనిచేసే అవకాశం ఆకట్టుకున్నాయి. రాజకీయం అంటే భావాల సంఘర్షణ తప్ప, వ్యక్తిగత పోరాటం కాదని లోక్‌సత్తా చాలా స్పష్టంగా నిర్వచించి అందుకు అనుగుణమైన బహిరంగ చర్చ ప్రమాణాల్ని, రాజకీయ సంస్కృతిని నెలకొల్పింది. ఏ అంశం మీద అడిగినా, లోక్‌సత్తా సమాధానం విధానపరంగా, వినూత్నంగా వస్తుంది. ఆ అవుటాఫ్ బాక్స్ థింకింగ్.. ఆకర్షణ కోసం కాదు, ఒక సమగ్ర అధ్యయనం ద్వారా రూపొందించిన పరిష్కారాల కోసం. అప్పటిదాకా, ఏనుగు, గుడ్డివాళ్ల తరహాలో కొనసాగుతున్న ప్రజాస్వామ్యాన్ని.. దేశానికి అవసరమైన సరైన గమ్యం దిశగా లోక్‌సత్తా నడిపించింది. లోక్‌సత్తాలాంటి రాజకీయ ఉద్యమం, పార్టీ భారతదేశంలోనే మరోటి లేదు. కమ్యూనిస్టు భావజాలం పట్ల ఇప్పటికీ అభిమానం ఉన్నా, ఈ మాట చెబుతున్నాను.

### ఐరోపా వెళ్లాకగానీ.. ఆ పరిశోధకురాలికి భారతదేశ విలక్షణత అర్థం కాలేదు : జేపీ

లోక్‌సత్తా అందరినీ కలపటానికి గొప్ప ఉదాహరణ వర్మ గారు. ఫిరాయింపుల రాజకీయం తరహాలో కాకుండా భావజాల బలం ఉన్న కమ్యూనిస్టులు, బీజేపీ, ఆర్ఎస్ఎస్

వారు కూడా లోక్‌సత్తాను వేదిక గావించుకున్నారు. ఎఫ్‌డీఆర్ పరిశోధనా విభాగంలో సుమేధ చాలా విలువైన సేవలందించారు. ఆ అమ్మాయి ప్రస్తుతం నెదర్లాండ్స్, జర్మనీ, పోలెండ్‌లలో మాస్టర్స్, పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈమధ్య వచ్చినప్పుడు సుమేధ ఎంతో విలువైన ఒక పరిశీలనను వెల్లడించారు – భారతదేశం బయటకు వెళ్తేగానీ, మన దేశం ఎంత సంక్లిష్టమైనదో అర్థం కాలేదు. ఇన్ని కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నా కలిసివుండటం, ఇందులో పదో వంతు వైవిధ్యం లేకున్నా యూరప్ దేశాల్లో చిన్న సమస్యలు పెద్దవిగా మారుతుండటం చూసి ఆశ్చర్యం కలుగుతుంది అన్నారామె. ప్రపంచంలోనే సంక్లిష్ట భిన్నత్వం ఉన్న భారత్‌ను కలపటంలో ఒక సంస్థగా కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది. 1885లో కాంగ్రెస్ స్థాపనలో బ్రిటిషర్‌తోపాటు బెంగాలీలు ప్రధాన పాత్ర పోషించారు. కానీ మొదటి సభ జరిగింది బోంబేలో. రెండవ సభ కలకత్తాలో జరగ్గా, మూడో సభకు హైదరాబాద్‌కు చెందిన బద్రుద్దీన్ త్యాబ్జీ అధ్యక్షత వహించారు. ఒకరికొకరు ముక్కూమొహం తెలియకపోయినా అన్ని ప్రాంతాలవారూ ఈ దేశం మాది అనుకునేలా కాంగ్రెస్ ప్రణాళికాబద్ధంగా కృషి చేసింది. ఒక ఛత్రంగా వ్యవహరించింది. గాంధీ ఈ కృషిని పతాకస్థాయికి తీసుకెళ్లారు.

స్వతంత్ర భారతదేశంలో మనం ఆశించిన ఫలితాల్ని సాధించాలంటే, మేధో క్రమశిక్షణ (ఇంటలెక్చువల్ డిసిప్లిన్) ఉండాలి. ఈ క్రమంలోనే, రాజ్యాంగ విలువల్ని పాటించటంతోపాటు.. ప్రజల సమ్మతితో చేయాలి. ఈ నేపథ్యంలోనే, లోక్‌సత్తా పోరాటం.. వ్యవస్థ కోసం. ప్రజల పన్నుల డబ్బు సద్వినియోగం చేయటమెలా, అధికారం–బాధ్యత కలిసివుండటం ఎలా, జీవన సాఫల్యత.. వీటన్నిటిపై అందరినీ కలిపే రీతిలో విధానాలు రూపొందించింది. ఏది ప్రభుత్వం పని, ఏది ప్రయివేటు వ్యక్తుల పని అని నిర్వచించింది. స్టీల్‌ప్లాంట్ వ్యాపారం ప్రభుత్వం చేయాలా? వంటివి. స్వతంత్ర భారతదేశం విస్మరించిన 'రాజ్యం పాత్ర ఏమిటి' అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని ప్రజలకు, రాజకీయ వ్యవస్థకు తెలియచేసింది. రాజ్యం ఏర్పాటు కృత్రిమమైనది. మనిషికి తప్ప మిగతా ఏ జీవికీ ఇలా ఒక సామాజిక ఒడంబడిక అవసరం ఉన్న ఉమ్మడి అవసరాలు లేవు. మన దేశంలో ప్రభుత్వాలు రాజ్యం చేయాల్సిన పనుల్ని విస్మరించి, చట్టబద్ధపాలన వంటివి గూండాలకు అప్పగించాయి. న్యాయస్థానాలు చేయాల్సిన పనుల్ని రౌడీమూకల సెటిల్‌మెంట్లుగా మార్చాయి. మరోవంక, వ్యక్తులు చేయగలిగిన పనుల మీద దృష్టి పెట్టాయి. అవి కూడా అధ్వాన్నంగా చేశాయి. ప్రభుత్వ వ్యాపార నిర్వాకం వల్ల పలు సంస్థలు మూతపడ్డాయి. మన మధ్య ఉన్న చిన్న విభేదాలను పెద్దవిగా, వ్యక్తుల మధ్య పోరును వ్యవస్థల మధ్య పోరాటంగా, కులాల మధ్య గొడవల్ని సైద్ధాంతిక ఘర్షణలుగా మార్చటం వల్ల ఉమ్మడి కీలక సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమయ్యాయి. కొన్ని తరాల జీవితాలతో చెలగాటమాడాయి. బుద్ధుడి కాలం నుండి మన దేశంలో ఉన్న మధ్యేమార్గాన్ని విస్మరించి అధికారమే లక్ష్యంగా మితిమీరిన పక్షపాత రాజకీయాలు చేశాయి.

ప్రశ్న: పెట్రో బంకుల్లో తూనికల అక్రమాలు బయటపెట్టటం, అభ్యర్థుల నేరచరిత్ర వివరాలు వెల్లడించటం, అవినీతి, 91, 97, 99 రాజ్యాంగ సవరణలు.. ఇలా విభిన్న లక్ష్యాలు, వేర్వేరు పద్ధతుల్లో ప్రయత్నాలు, భిన్నమైన రాజకీయ సంస్కృతిని ఎందుకు అనుసరించారు?

### ప్రజా ఉద్యమాలకు ప్రామాణికమైన రెండు పద్ధతుల్లీ

ప్రజాఉద్యమానికి రెండు రకాల పద్ధతులుంటాయి. ఒకటి, ప్రజా సమీకరణ. ఇది ఎందుకంటే, ప్రజాభిప్రాయానికి రాజకీయం తలవంచుతుంది. లోక్‌సత్తా 1 కోటీ 8 లక్షల సంతకాల సేకరణ చేయటం వల్లే.. అన్ని పార్టీలూ స్థానిక ప్రభుత్వాల సాధికారతకు అంగీకరించాయి. ప్రజల స్పందన చూసి మునిసిపల్, జడ్పీ చైర్‌పర్సన్లు కూడా స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చారు. రెండోది, హేతుబద్ధ వాదనలతో ప్రభుత్వాల్ని ఒప్పించటం, దీన్నే లాబీయింగ్ అంటుంటారు. పాలనా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కోసం లోక్‌సత్తా చేసినంత క్షేత్రస్థాయి ఉద్యమాలు, కార్యక్రమాలు మొత్తం దేశంలో ఎవరూ చేయలేదు. మీరు రికార్డులు చూస్తే అర్థమవుతుంది. కానీ పేరు మాత్రం ఎవరికో అంటగట్టారు. ప్రజల్లో ఆర్‌టీఐపై చైతన్యం తేవటంతోపాటు.. ప్రభుత్వాల్ని ఇరకాటంలోకి నెట్టే అలాంటి చట్టం చేయాలంటే లాబీ యింగ్ కూడా చేసి పాలకుల్ని ఒప్పించాలి. ఆ పని కూడా లోక్‌సత్తాయే చేసింది. ఆ చట్టం కోసం ఆందోళనలు, లాబీ యింగ్, చివరికి ఆ చట్టం మొత్తం రూపకల్పన లోక్‌సత్తా ద్వారానే జరిగాయి. అదేవిధంగా సిటిజన్స్ చార్టర్లు, లోక్‌పాల్–లోకాయుక్త కూడా లోక్‌సత్తాయే ప్రభుత్వాల్ని ఒప్పించి సాధించింది. ప్రజాస్వామ్య సంస్కరణలు సాధిం చాలంటే, ఒక మార్గం సరిపోదు. ప్రజాఉద్యమాలు, లాబీ యింగ్ అవసరాన్ని బట్టి మోతాదుకి అనుగుణంగా ఉపయోగించాలి.

అనుగుణంగా ఉపయోగించాలి.

### అజరామర భావజాలం...రామ్మోహనరావు

వ్యక్తి సుఖాన్ని, సమాజ హితాన్ని కలిపిన సంస్థ, పార్టీ

లోక్‌సత్తా. వ్యక్తిపూజకు వ్యతిరేకం కావటం వల్ల మొదట్లో జేపీ గారి బొమ్మ కూడా ఉపయోగించకూడదనుకున్నాం. కానీ మన సమాజం ఉన్న పరిస్థితుల్లో తప్పలేదు. కానీ అప్పటికి, ఇప్పటికీ భారతదేశానికి అత్యుత్తమ భావజాలం లోక్‌సత్తా మాత్రమే అని కచ్చితంగా చెప్పగలను.

ప్రశ్న: పురుషాధిక్య భావజాలం ఇంకా కొనసాగుతున్న మన దేశంలో అంతమంది మహిళలకు లోక్‌సత్తా ఉద్యమంలో ఎలా భాగస్వామ్యం కల్పించగలిగారు?

ఆఫ్రికావాళ్లను సైతం మెప్పించిన లోక్‌సత్తా భావజాలం



డాక్టర్ పర్చ అంజనీదేవి (లోక్‌సత్తా సభ్యురాలు)

చాలా ఏళ్ల క్రితం ఒంగోలులో ఐఎంఏ సమావేశంలో కలెక్టర్ అయిన డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి ప్రసంగం విన్నాను. ఈవేళ ఏం మాట్లాడుతున్నారో, ఆరోజూ అదే మాట్లాడారు. అనర్గళంగా. బహిరంగ మలవిసర్జన, ఎంఎంఆర్ వ్యాక్సిన్‌ల ఆవశ్యకత గురించి వివరించారు. ఆ తర్వాత లయన్స్ క్లబ్ సమావేశంలో ఎక్కడా తడబాటులేని స్పష్టతతో జేపీ దార్శనిక ప్రసంగం విన్నాను. కొన్నేళ్లకి 'ప్రజలే ప్రభువులు' నినాదంతో లోక్‌సత్తా ఉద్యమ్యాన్ని ప్రారంభించింది. ప్రారంభ కార్యక్రమంలో పర్చ కోదండరామారావు గారు కూడా పాల్గొన్నారు. 'లోక్‌సత్తా – ఇది మీ సత్తా' అనే నినాదం వరంగల్‌లో మూడేళ్ల పిల్లలు కూడా వినిపించేవారు. లోక్‌సత్తాకే ఓటు వేయాలి తాతా అని వాళ్లు ఇంట్లోవారికి మరీమరీ చెప్పేవారు. వరంగల్‌లో కోదండరామారావు గారు ఎంత కృషి చేశారంటే.. ఎవరిని అడిగినా లోక్‌సత్తా కోదండరామారావు అంటారు. ఇంటిపేరు పర్చను మర్చిపోయారు. ఏ అపార్ట్‌మెంట్‌కి వెళ్లినా ఆదరించారు. కానీ ఓటుకి ఏమిస్తారు అని కొందరు అడిగారు. పిల్లలపాటి నిజాయతీ కూడా లేకుండా ఓటుకు నోట్లు అడగటం ఆవేదన కలిగించింది. ఒక డాక్టర్ ఇంటికి వెళ్తే, ఆయనా అదే భాష. ఆ పార్టీలవాళ్లు లారీల్లో తీసుకొచ్చి డబ్బు పంచుతారు, మీరేమిస్తారు? అన్నారు. తర్వాత కాలం మారాక మీకు ఓటు వేయటం గురించి ఆలోచిద్దాం అన్నారు. కొందరైతే, మేం లోక్‌సత్తాకు ప్రచారం చేయటం చూసి.. జేపీ గారు బ్రాహ్మణులా? అని అడిగారు. నిజంగా నాకు తెలియదు. అదే చెప్పాను. ఆయన భావజాలం తప్ప నాకు ఆయన కులగోత్రాలు తెలియవు. ఓ సందర్భంలో ఆఫ్రికాలో జరిగిన ఓ సదస్సుకి కోదండరామారావుగారిని లోక్‌సత్తా తరపున పంపారు. నేను కూడా వెళ్లాను. ఆ సభలో మనల్ని ఎవరు పట్టించుకుంటారు? అనుకున్నాను. కానీ భారతీయ సంస్కృతి చిత్రాలతో లోక్‌సత్తా భావజాలాన్ని, ఎన్నికల సంస్కరణల్ని కోదండరామారావుగారు ఇంగ్లిష్‌లో వివరిస్తుంటే.. సభ మొత్తం నిశ్శబ్దంగా ఆలకించింది. అంత ప్రభావితం చేసే పరిష్కారాలు ఆ వెనుకబడిన, చీకటి ఖండం ప్రజలకు లోక్‌సత్తా భావజాలంలో కనిపించాయి. ప్రసంగం పూర్తయ్యాక కరతాళధ్వనులతో ప్రాంగణం మారు మోగిపోయింది. అందరూ వచ్చి మమ్మల్ని ఎంతో ఆదరంగా పలకరించారు.

ఉమ్మడి భవిష్యత్తు, సురక్షిత, గౌరవ ప్రదమైన రాజకీయ సంస్కృతి : జేపీ

కులం, అధికారం, పక్షపాతం, సామాజిక ఛాందసాల వల్ల కొంతకాలం, కొంతదూరం వెళ్లగలరు. కానీ ఉమ్మడి భవిష్యత్తు అర్థమైతే, అప్పుడు వాస్తవాలు తెలుసుకుంటారు. లోక్‌సత్తాలో మహిళలు చేరటానికి మరో కారణం, వారికి ఈ సంస్థలో లభించే సురక్షిత వాతావరణం, గౌరవం. మన కుటుంబ వ్యవస్థను దాటి మహిళల్ని సమాన పౌరులుగా గుర్తించే సామాజిక వాతావరణం పెరిగితే, చట్టబద్ధపాలన సంస్కృతి, బహిరంగ చర్చ ప్రమాణాలు అర్థమైతే.. అన్ని పార్టీల్లో మహిళలు చాలామంది పురుష నేతల కంటే గొప్ప ప్రభావం చూపగలరు.

ప్రశ్న: 30 ఏళ్ల తర్వాత సమీక్షించుకుంటే.. ఎక్కడ విజయం సాధించారు, ఎక్కడ పాక్షిక విజయం, ఎక్కడ అనుకున్న ఫలితాలను సాధించలేకపోయారు?

జేపీ: ఈ ప్రశ్నకు సమాధానం రెండు రకాలుగా చూడాలి. ఒకరకంగా చూస్తే.. లోక్‌సత్తా సాధించిన విజయాలు, అధికారంలేకుండా స్వతంత్రానంతర భారతదేశంలో ఏ సంస్థా సాధించలేదు. ఆ మాటకొస్తే, ప్రపంచంలో కూడా. ఉదాహరణకు లోక్‌సత్తా చేసిన మొదటి ప్రజాఉద్యమం 1998 అక్టోబర్ 2 నుండి. పెట్రోల్ బంకుల్లో కొలతలు సరిగా ఉన్నాయోలేదో ధ్రువీకరించటానికి సర్టిఫైడ్ లీటరు, 2 లీటర్లు, 5 లీటర్ల క్యాన్లతో వెళ్లి అందులో పోయమన్నాం. వెంటనే ఆ తరుగు తెలిసిపోయింది. లోక్‌సత్తా కార్యకర్తలు వివిధ ప్రాంతాలలో ఇలా ఎంపిక చేసిన బంకుల్లో కొలతల అక్రమాలను బయటపెట్టగానే, అధికార యంత్రాంగం మేలుకొంది. ప్రభుత్వం కదిలింది. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1500 పెట్రోల్ బంకులుండేవి. అన్నిట్లో మీటర్లు సరిచేశారు. అది చాలా చిన్న ప్రయత్నం. 'స్వరాజ్యం' పుస్తకాన్ని ప్రజాహక్కులు పత్రాన్ని, అందులో ప్రభుత్వం నుండి హక్కుగా అందాల్సిన సేవల్ని వివరాలతో ప్రచురించి, అందుకనుగుణంగా చేశాం. కానీ దేశచరిత్రలోనే పెద్ద ఫలితాలనిచ్చే కార్యక్రమాల్లో ఒకటైంది.

ఆ సాధనాన్ని (టూల్) మనం సరిగా గుర్తించాం. జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ చేసిన పోరాటాలు నాలుగంటే నాలుగే. 1) చంపారన్ (స్థానిక సమస్య) 2. బార్డోలీ 3. ఉప్పు 4. క్విట్ ఇండియా. ఇవన్నీ చాలా సాధారణ అంశాలతో తీసుకున్నారు. 1998లో లోక్‌సత్తా చేసిన చిన్న ప్రయత్నం తర్వాత ఆయిల్ కంపెనీలు కూడా పంథా మార్చుకున్నాయి. ట్యాంపర్ చేయటానికి వీల్లేని మీటర్లను ప్రవేశపెట్టారు.

మన దేశంలో ఈవేళ రోజుకు 50 కోట్ల లీటర్ల పెట్రో ఇంధనం వాడుతున్నారు. లీటరు రూ.100. ఇందులో 10 శాతం అంటే రూ.10. రోజుకి రూ.500 కోట్లు, సంవత్సరానికి రూ.1,50,000 కోట్లు ప్రజలకు, ఆర్టీసీ వంటి ప్రభుత్వ సంస్థలకు లోక్‌సత్తా వల్ల ఆదా అయింది. ఈ ముప్ఫై ఏళ్లు అలా లెక్కేసుకుంటే, ఎన్ని లక్షల కోట్లు ఆదా అయివుంటుంది? తక్కువ ఖర్చుతో, దీర్ఘకాలంలో ప్రజలకు లాభం ఉండేలా కార్యక్రమాలు చేయటమే నిజమైన ప్రజాఉద్యమం. ఈ ప్రజాస్వామిక ప్రమాణం ప్రకారం బేరీజు వేస్తే, అధికారంలో ఉన్న పార్టీలకు మించి లోక్‌సత్తా ప్రజలకు మేలుచేసింది. నిజమైన ప్రజాస్వామ్యం, విధానాలపై చర్చను సమాజంలోకి తీసుకెళ్లింది. ఇలా పలు మౌలికాంశాల మీద సుదీర్ఘ ప్రయత్నాలు చేస్తున్నా, చర్చల్ని మెచ్చుకుంటారు తప్ప ఫలితాల్ని గుర్తించింది మాత్రం పెట్రోల్ బంకుల్లోలా ప్రజలకు టూల్స్ సులభంగా అందుబాటులో ఉన్నప్పుడు. లోక్‌సత్తా తీసుకొచ్చిన విప్లవాత్మక రాజ్యాంగ సవరణల్లో 97వ సవరణ ఒకటి. ఇది ప్రజలు ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా సంఘాలు ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు చేసుకోవటం. ఇందులో లాభాల్ని అందరూ పంచుకోవటం. అమూల్ లాంటి ఈ సహకార సంఘాలతో పాడి పరిశ్రమ మన రైతులకు ఎంతో మేలు చేయటానికి లోక్‌సత్తా 'మ్యాక్స్' చట్టం, ఆ తర్వాత అదే 97వ రాజ్యాంగ సవరణగా తీసుకొచ్చింది. దేశ ద్రోహం వంటి సందర్భాల్లో తప్ప ప్రభుత్వ జోక్యం లేకుండా సంఘాల్ని ప్రజలు నడుపుకునే సహకార సంఘాలపై పెత్తనం కోసం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రయత్నం జరిగినప్పుడు.. లోక్‌సత్తాయే అసెంబ్లీలో, న్యాయస్థానాల్లో నిలువరించింది. కానీ 97వ రాజ్యాంగ సవరణ విలువ ఇప్పటికీ సమాజంలో చాలామందికి తెలియదు.

చాలామంది సదుద్దేశం ఉన్న పౌర సమాజ నేతలు ప్రతిదానికీ కోర్టులకు వెళ్లాలంటారు. న్యాయస్థానాలు ఆదేశించాలంటారు. కానీ వాటి పాత్ర పరిమితం. ప్రజలు ఎన్నుకున్న చట్టసభల బాధ్యతల్ని న్యాయస్థానాలు చేయాలనటం ప్రజాస్వామ్యాన్ని కుంటుపరుస్తుంది. న్యాయ సమీక్ష అవసరమైన కొన్ని సందర్భాల్లో మాత్రమే కోర్టుల ద్వారా మార్పుల్ని ఆశించవచ్చు. ఉదాహరణకు, 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులో అక్రమాలు జరిగినప్పుడు లోక్‌సత్తా దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సుప్రసిద్ధులైన రెబీరో, లింగ్డో, గోపాల్‌స్వామి లాంటివారిని సమీకరించి వాటి రద్దుకి, పారదర్శక కేటాయింపుకి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విజయం సాధించింది. దీనివల్ల భారీగా ప్రజాధనం ఆదా అవటంతోపాటు.. ఇక మీదట వేలం పద్ధతిలో ప్రకృతి వనరుల కేటాయింపు ఉండాలని కోర్టు ఆదేశించింది. అప్పటి నుండి ఇప్పటిదాకా స్పెక్ట్రం కేటాయింపులో అవకతవకలు లేవు. కానీ ఇది కూడా ప్రజల్లోకి పెద్దగా ప్రచారం కాలేదు. ఇక ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీలు తమకు తామే పూజారుల్లా, స్వయంభుల్లా నియామకాలు చేసుకునే కొలీజియం పద్ధతిని మార్చి, జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి, న్యాయశాఖా మంత్రి, ప్రతిపక్షంలోని అద్వానీ, మోదీ లాంటి వారందరినీ ఒప్పించటంతోపాటు.. ఎన్‌జేఏసీ బిల్లు రూపకల్పనకు జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ కృష్ణ అయ్యర్, జస్టిస్ వెంకటాచలయ్య వంటి మహామహులతో ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఆ బిల్లును పార్లమెంటు దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించి 99వ రాజ్యాంగ సవరణగా వెలువడినా, సుప్రీంకోర్టు అన్యాయంగా కొట్టివేసింది. కానీ ప్రజల్లో స్పందన లేదు. వారి దృష్టిల్లో రాజకీయ నాయకులు దుర్మార్గులు, కోర్టులు వారిని బెత్తం పట్టుకుని సరిదిద్దేవి. తామే స్వేచ్ఛగా ఓటు వేసిన వారు దుర్మార్గులు ఎలా అవుతారు? అనే సాధారణ ప్రజాస్వామిక సూత్రం అర్థమవటానికి కొన్నేళ్లు పడుతుంది. అంతవరకూ ఓపిక పట్టటం తప్ప నక్సల్స్‌లా తుపాకీ పట్టలేం గదా. సంస్కర్తకి అపార సహనం ఉండాలి. వచ్చే తరం ఈ మేరకు భారం భరించాలి.

రెండోది, చట్టంలో, రాజ్యాంగంలో మార్పులు చాలవు. పరిష్కారం స్పష్టంగా, హేతుబద్ధంగా కనిపిస్తున్నా సమాజం ఆశించినంత స్పందించకపోవటం.. బాధాకరం. కానీ ప్రజాస్వామ్యం పనిచేసే పద్ధతి చాలా సందర్భాల్లో నెమ్మదిగానే ఉంటుంది. ఇంత అవిద్య, అల్పాదాయాలు ఉన్న దేశంలో ప్రజాస్వామ్యం ఈమాత్రం నిలదొక్కుకోవటం నిజంగా అద్భుతమే అనుకోవాలి. వారికి కోసమే, పేదలు, మధ్యతరగతి కోసమే లోక్‌సత్తా కృషి మొత్తం అని వారికి అర్థమవటానికి సమయం పడుతుంది. 150 కోట్ల మందిని వినాలి, వారికి వినిపించేలా మనం నచ్చచెప్పాలి. విభిన్న ప్రయోజనాలను. ఒకరికొకరు వ్యతిరేకించుకునే ధోరణుల్ని

సమన్వయం చేయాలి. అదే ప్రజాస్వామ్యం. ఎన్‌టి రామారావు హయాం నుండి పెండింగ్‌లో ఉన్న స్థానిక న్యాయాలయాల (గ్రామ న్యాయాలయాలు) చట్టాన్ని 2009లో లోక్‌సత్తా సాధించింది. పార్లమెంటు ఆమోదించినా, కోర్టులు కొట్టివేయకపోయినా ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో ఆ చట్టం అమలు చేయలేదు. దీనివల్ల చాలా చిన్న కేసుల్ని, మహిళలపై వేధింపులు వంటి వాటిని వారం రోజుల్లో పరిష్కరించేయొచ్చు. పదివేల కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, దేశవ్యాప్తంగా 300 దాకా మాత్రమే ఏర్పాటయ్యాయి. సమస్యలు పరిష్కారం కాకపోతే, గూండాల వద్దకు వెళ్తున్నారుగానీ.. చట్టాన్ని తీసుకొచ్చినా ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయటం లేదు? అనే చైతన్యం ప్రజల్లో ఇంకా ఏర్పడలేదు. ఆర్‌టీఐ కొంత మెరుగు. అదేవిధంగా, అన్నా హజారే ఉద్యమం నేపథ్యంలో లోక్‌సత్తా 2011 ఢిల్లీలో న్యాయకోవిదులు, వివిధ రంగాల నిపుణులతో రౌండ్ టేబుల్ ఏర్పాటు చేసి 27 సూచనల్ని తీసుకుని ప్రధాని ఆమోదం తర్వాత రూపొందించిన లోక్‌పాల్ వచ్చింది, ఓ పార్టీ దిగిపోయి మరో పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ అవినీతి పోలేదు. లోక్‌పాల్ ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఉద్యమం ఆకర్షణీయంగా కనిపించిందితప్ప, పరిష్కారం కోసం చేసిన అపార ప్రయత్నమూ ప్రజల్లోకి అంతగా వెళ్లలేదు. ప్రజల్ని చైతన్యపరుస్తూనే పటిష్ఠ లోక్‌పాల్, లోకాయుక్త కోసం పోరాడినా ప్రజలు వాటిని తమ జీవితంగా అవగాహన గావించుకోవటానికి సమయం తీసుకుంటున్నారు.

ప్రశ్న: ఒక సంస్కర్తకి అపార సహనం ఉండాలని తరచూ చెబుతుంటారు, ఇప్పుడు కూడా చెప్పారు జేపీ గారూ. అలాంటి సహనాన్ని ప్రదర్శించకుండా లోక్‌సత్తా రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయటంలేదని ఎందుకు విరామం ప్రకటించారు?

**పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) ఆపటం.. ఎన్నికల్లో పోటీ చేయకుండా సాధించిన విజయమే :జేపీ**

ఎన్నికల్లో పోటీ నుండి లోక్‌సత్తా విరామం విషయంలో చాలామందికి కోపం ఉంది. నేను మళ్లీ చెబుతున్నాను– రాజకీయాన్ని ఏనాడూ నేను ద్వేషించలేదు. రాజకీయం పవిత్ర వ్యాసంగం అని గౌరవించిన ఉద్యమం లోక్‌సత్తా మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. కానీ సమాజంలో 10% ఓట్లు నిలకడగా వేసే పరిణతి కనిపించనప్పుడు, రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీచేయటం వల్ల ప్రధాన పార్టీలతో శత్రుత్వ భావం కొనసాగుతుంటుంది. వారిని ఒప్పించి, ప్రజలకు చేయాల్సిన మేలు చేసే అవకాశాన్ని కోల్పోతాం. ఆ పార్టీలకు ఎన్నికల ద్వారా అధికారం తప్ప, ప్రజాప్రయోజనాల పట్ల పెద్ద పట్టింపు ఉండదు కాబట్టి.. మనం పోటీ చేయటం లేదంటే, వారు కొన్నయినా మంచి పనులు చేయించేలా ఒప్పించగలం. దీనికోసం, ప్రభుత్వాల చేత ఎలాంటి విధానాలు అమలు చేయించాలి, ఎలాంటి సంస్కరణలు అవసరం అనే నిజమైన రాజకీయం ఇప్పుడూ చేస్తున్నాం. గతం కంటే లోతుగా, ప్రచార ఒత్తిడి లేదు కాబట్టి మరింత ఏకాగ్రతతో సంస్కరణల కృషి చేస్తున్నాం. సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్, మోదీ, జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రేవంత్‌రెడ్డి.. ఇలా అందరితో నేరుగా మాట్లాడి ఒప్పించగలుగుతున్నామంటే, కొన్నయినా అమల్లోకి వస్తున్నాయంటే ఎన్నికల్లో పోటీ చేయకపోవటం వల్లే. కానీ నష్టం నష్టమే.

లోక్‌సత్తాకు ఆరోజు 10% ఓట్లు అన్ని ప్రాంతాల్లో నిలకడగా వచ్చి ఉంటే, ఈపాటికి భారతదేశ చరిత్ర మారిపోయేది. పేరు కోసం కాదు. ఖ్యాతి ఎవరికి దక్కుతుంది అని ఆలోచించకుండా పనిచేసేవారి ద్వారా భగవంతుడు లేదా ప్రకృతి అద్భుతాలు చేయిస్తాయి అంటారు. పేరు ఘనతల్ని ప్రధాన పార్టీలే తీసుకున్నా.. లోక్‌సత్తా బరిలో పది శాతం ఓట్ల బలంతో ఉంటే, సంస్కరణలు వేగంగా వచ్చేసేవి. లోక్‌సత్తా వెదజల్లిన భావాలు ఇప్పుడు స్టార్టప్‌లుగా కొన్నిచోట్ల ఫలితాలు సాధిస్తున్నాయి. తమిళనాడులో విజయ్ పార్టీ విజయం అలాంటి ఒక మొలక. కానీ పక్వానికి రావటానికి ఇంకా కొన్నేళ్లు పడుతుంది. లోక్‌సత్తా 'ఈల' గుర్తు ద్వారానే విజయ్ అక్కడ గెలిచారు. లోక్‌సత్తా అధికారం ఆశించి పార్టీగా విస్తరించలా. అదేవిధంగా, సంస్థగా, పార్టీగా ఎన్నికల్లో పోటీ మినహా ఇప్పటికీ రాజకీయం చేస్తోంది కాబట్టే, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను ఆపటమనే అతి పెద్ద విజయాన్ని ఇటీవల సాధించింది. ప్రభుత్వోద్యోగుల విమర్శలను ఎదుర్కొని మరీ, కాంగ్రెస్, ఇతర పార్టీలను, నేతలను ఒప్పించి మరీ ఈ కఠిన విజయం సాధించింది. ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, వడ్డీలు వంటి రోజువారీ ఖర్చులకే చాలా రాష్ట్ర ప్రభుత్వాల సొంత ఆదాయం సరిపోవటం లేదంటే, కెనడా లాంటి దేశం కేవలం పెన్షన్ల బడ్జెట్ భారం వల్ల సీనియర్ సిటిజన్లు, యువత అనే రెండు వర్గాలుగా చీలిపోయిందంటే.. ఎంత భారం నుండి ఆర్థిక వ్యవస్థను, భవిష్యత్తు తరాలను లోక్‌సత్తా కాపాడిందో లెక్కలు వేసుకోవచ్చు. ఇది ఎంత విలువైన, నిజమైన రాజకీయమో ప్రజలకు ఇప్పుడే అర్థం కాకపోవచ్చు. లోక్‌సత్తా ఎన్నికల్లో పోటీ, కొన్ని సీట్లు గెలవటం అనే మోజులో వ్యవహరించివుంటే.. సమాజం తీవ్రంగా నష్టపోయేది. లోక్‌సత్తా పోరాటం అధికారం కోసం కాదు, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చే స్వతంత్ర




అమలవుతోంది. సంఘటితంగా, అవగాహనతో వీటి అమలు కోసం పనిచేస్తున్నాం. హేతుబద్ధ వాదనలతో పాలకుల్ని, పార్టీల్ని ఒప్పిస్తున్నాం. దీన్ని లాబీయింగ్ అను కోవచ్చు, మరోటిగా భావించవచ్చు. కానీ ప్రజలకు వేగంగా ప్రయోజనాలు అందించే ప్రజాస్వామిక మార్గాలివి. క్యాన్సర్ అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నవారు, దశాబ్దాలు మోసిన భావ జాలాన్ని వదులుకుని వాస్తవాల కోసం పనిచేస్తామని ముందుకు వచ్చిన

భారతదేశం, అందుకోసం వ్యవస్థల నిర్మాణం.

## రెండవ ప్యానల్ చర్చ

**ఇందులో వచ్చే ముప్ఫై ఏళ్లపాటు లోక్‌సత్తా కార్యాచరణను చర్చించారు.**

మోడరేటర్ సంతోషిణి ప్రశ్న: లోక్‌సత్తా ద్వారా 5-10 ఏళ్లలో దేశంలో మార్పు వచ్చేస్తుందని భావించారు. 30 ఏళ్లు దాటుతున్నాయి. మూడు దశాబ్దాల చరిత్ర నుండి నేర్చుకున్న అంశాలతో లోక్‌సత్తా భవిష్యత్తు కార్యాచరణ ఎలా ఉండబోతోంది?

గ్రామాల మధ్య చిన్న పట్టణాలతో సుస్థిర, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి : జేపీ

వచ్చిపోయే మిణుగురు పురుగులు, లాంతర్ల వెలుతురులో కాకుండా.. దూర నక్షత్ర కాంతులను అనుసరించి వెళ్లాలనే లోక్‌సత్తా మౌలిక సూత్రాన్ని మరింత సమగ్రంగా పాటిస్తున్నాం. రోజువారీ సంఘటనల మీద కాకుండా.. దేశానికి, ప్రజాస్వామ్యానికి మౌలికంగా, దీర్ఘకాలం, విస్తృత స్థాయిలో ఉపయోగపడే అంశాల మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించాం.

ఇప్పటికీ ఆచరణరూపం దాల్చని లోక్‌సత్తా మౌలిక ప్రాతిపదికలు- ప్రతి పౌరునికీ సమానావకాశాలనిచ్చే స్వేచ్ఛ, స్వపరిపాలన, స్థానిక సాధికారత, హక్కుగా పౌర సేవలు, స్వయం దిద్దుబాటు కోసం పనిచేస్తున్నాం.

ప్రజాస్వామ్యానికి కీలకమైన అయిదు అంశాలు - పార్టీలు కొందరు వ్యక్తుల సొంత ఆస్తి కాకుండా, సభ్యులు అభ్యర్థులను నిర్ణయించటం; ఎన్నికల్లో నీతివంతమైన డబ్బు ఖర్చు చేసి, హేతుబద్ధ విధానాలు ప్రతిపాదించేవారు చట్టసభలకు ఎన్నికై అధికారంలోకి రావటం; ప్రజాస్వామ్యం, ఓటు విలువ అర్థమై నాయకత్వం ఎదిగేందుకు కీలకమైన స్థానిక ప్రభుత్వాలలో ప్రజల భాగస్వామ్యం ఉన్న కమిటీలు, నిధులు, అధికారాలు; చట్టబద్ధపాలన; పారదర్శకత, జవాబుదారీతనం- కోసం లోక్‌సత్తా రాజకీయ కృషిని కొనసాగిస్తోంది.

ఇందులో మొదటి నాలుగూ జరగలేదు. చివరిది కొంతమేర

సీనియర్ సిటిజన్లు, తమ తండ్రిగారు పోయినా శవాన్ని అక్కడుంచి లోక్‌సత్తా సమావేశానికి హాజరైనవారు.. ఎందరో త్యాగాలతో లోక్‌సత్తా బలోపేతమైంది. వారందరికీ ఈ సందర్భంగా నివాళులర్పించుకుందాం. న్యాయంగా మనకు రావాల్సిన కీర్తిని ఇవ్వకుండా ఎవరో తీసుకున్నారని ఇందాక వర్మ గారు చెప్పిన ఆర్‌టీఐ రాకముందే.. మనం కూకట్‌పల్లిలో అమలు చేసి చూపాం. ఇళ్ల క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగినప్పుడు, జస్టిస్ లక్ష్మణ్‌రావు గారి లాంటి వారితో కలిసి.. ఎవరు ఎప్పుడు దరఖాస్తులు ఇచ్చారో వివరాలు తీసుకున్నాం. ముందు దరఖాస్తు చేసినవారిని వదిలేసి తర్వాతి వారికి ఎలా రెగ్యులరైజ్ చేశారని ప్రశ్నించటంతో అక్రమాలు సాక్ష్యాధారాలతో బయటపడ్డాయి. తీసుకున్న లంచం తిరిగి ఇవ్వటం బహుశా మొదటిసారిగా అంత భారీస్థాయిలో జరగటం అదే మొదటిసారి. ఆర్‌టీఐతోపాటు.. హక్కుగా పౌర సేవల కోసం సిటిజన్స్ చార్టర్స్‌ను 2001లో పరిమితంగా అమలు చేశారు. ఇప్పుడు నిర్దిష్ట వ్యవధిలో సేవలు అందించకపోతే పరిహారం ఎలక్ట్రానిక్ సేవలకు కూడా విస్తరిస్తూ రైట్ టూ సర్వీసెస్ చట్టాన్ని యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలన్నిటిలో ఏర్పాటుకి కృషి చేస్తున్నాం. బహుశా ఆర్‌టీఐ కంటే విప్లవాత్మక చట్టం ఇది.

అదేవిధంగా, ప్రపంచంలో మరే పెద్ద దేశమూ ఎదుర్కోని మూడు సవాళ్లను భారతదేశం ఎదుర్కొంటోంది.

1. 60-65% మంది ప్రజలు గ్రామాల్లో ఉండటం జీ 20 దేశాలు వేటిల్లో లేదు. ఒక్క భారత్‌లోనే.

2. జనాభాలో 45% మంది ఒక పరిధి దాటి ఆదాయం పెరగని వ్యవసాయం మీద ఆధారపడటం మన దేశంలోనే.

3. పనిచేసేవారిలో 85% స్థిరమైన ఆదాయం లేకుండా అసంఘటిత రంగంలో ఉండటం ఒక్క భారత్‌లోనే.

వీటిల్లో ఒక సంక్షోభానికి పరిష్కారం సాధించటమే అసాధ్యంలా కనిపిస్తుంది. అలాంటిది మూడిటినీ సాధిస్తేనే, భారత్ అభివృద్ధి చెందిన దేశం కాగలదు.



ఈ నేపథ్యంలో, గతంలోలా రాజకీయ, పాలనా సంస్కరణలకు పరిమితం కాకుండా.. ఆర్థిక సంస్కరణలను కేంద్రబిందువు చేశాం. గత దశాబ్దాల్లోనూ ఆర్థికాభివృద్ధి కోసం పనిచేశాంగానీ, ఇంత దృష్టి సారించలేదు. సమాజంలో ఎక్కువమందిని కలుపుకునేందుకు ఆర్థిక చర్చ అవరోధం కాకుండా, రాజ్యాంగ పార్టీలా మాత్రమే కృషి చేశాం. ప్రపంచ అనుభవాలు, ఇప్పుడున్న పరిస్థితుల్లో భారత్‌కి అటువంటి గొప్ప అవకాశం కూడా అందుబాటులోకి రావటం మరో కారణం. సమయం, సందర్భం, యువ జనాభా ఎక్కువగా ఉండటం వంటివన్నీ సానుకూలతలు. కానీ వీటిని దెబ్బతీసే అధ్వాన్న పాఠశాల విద్య, వైద్యమంటే ఆస్పత్రి చికిత్స మాత్రమే అనుకునే అనాలోచిత విధానం, వలసలు అంటే పొట్ట చేత పట్టుకుని మహానగరాలకు వచ్చి దుర్భర జీవితం గడపటం అనే ధోరణి వంటివి అవరోధాలుగా ఉన్నాయి. ఇందుకు పరిష్కారంగా గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేసే విధానం మీద దృష్టి సారించాం. అక్కడ ముఖ్యంగా తయారీ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించటం ద్వారా గ్రామీణులకి పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు, ఏఐ యుగంలో సమూహంలో ఒంటరితనం పెరుగుతూ మానసిక ఆందోళనలకు గురికాకుండా ఈ స్థానిక సమూహాల జీవన విధానం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ విధంగా, సుస్థిర ఆర్థికాభివృద్ధి, అందులో సమాజానికి ఉపయోగపడే వృత్తి, ఉపాధి, వ్యాపారాల ద్వారా అందరూ భాగస్వాములయ్యేలా సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయోత్పత్తుల్లో స్వేచ్ఛా మార్కెట్ మొదలైన సంస్కరణల్ని అమలు చేయటం లక్ష్యంగా ప్రస్తుతం సంస్కరణల మీద పనిచేస్తున్నాం.

అదే విధంగా లోక్‌సత్తా లక్ష్యాల్లో నిరంతరం భాగస్వాములవుతూ అందరికీ అవకాశాలనిచ్చే నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణకు గ్యారంటీనిచ్చే ఒక నూతన పౌర సమాజం నిర్మాణం కోసం కృషిని విస్తరిస్తున్నాం. సాధించిన విజయాలు అసాధారణమే అయినా, సాధించాల్సినవి అంతకంటే ఎక్కువ ఉన్నాయి కాబట్టి.. లోక్‌సత్తా విధానాలపై ప్రయత్నం మెరుగవుతోందే తప్ప తగ్గలేదు. కాకపోతే, అప్పటికి ఇప్పటికీ రాజకీయ పార్టీల్ని ఒప్పించటంలో సవాళ్లు పెరిగాయి. గతంలో మనం చెప్పే విషయాలు ప్రజలకు ఉపయోగకరం, హేతుబద్ధం, ఆచరణసాధ్యం అయితే ఒప్పుకునేవారు. ఈవేళ మనం ఏం చెప్పినా.. మీరు మా పార్టీయా, కాదా? అన్నదే ఎక్కువగా చూస్తున్నారు. ఇది కూడా అధిగమిస్తూ పనిచేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా రాజకీయాల్లో ఏర్పడిన అనారోగ్యకర కల్లోలం మన దేశంలోనూ మారిన పరిస్థితుల్లో కనిపిస్తోంది.

దీనివల్ల ప్రచారంలో అర్థవంతమైనవే అయినా సోషల్ మీడియాలో ప్రజలను విపరీతంగా ఆకట్టుకునే విమర్శల్ని పార్టీలపై చేయకుండా, కొంత బోరింగ్‌గా అనిపించినా విధానాలను తెలియచెప్పటానికే, సుస్థిర, దీర్ఘకాలిక ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాం. అంతిమంగా లోక్‌సత్తాకు కావలసింది ప్రజల ప్రయోజనాలను ఎంత వేగంగా సాధించగలం, నష్టాన్ని ఎంత పరిమితం చేయగలం.. అన్నవే.

**ప్రశ్న: గత 30 ఏళ్ల కన్నా మీడియా ఇప్పుడు లోక్‌సత్తా భావజాలానికి సహకరిస్తోందా?**

### విద్య, ఆరోగ్యం, ఉపాధి గురించి మాట్లాడుతున్నారుగానీ.. పరిష్కారాల చర్చ ఇంకా లేదు

**కటారి శ్రీనివాసరావు (జేపీ తర్వాత లోక్‌సత్తాకి ఎన్నికైన పార్టీ అధ్యక్షులు)**

లోక్‌సత్తా రాకముందు రాజకీయాల్లో విద్య, ఆరోగ్యంపై చర్చే లేదు. వీటి గురించి ప్రజలకే కాదు, మీడియాకు కూడా అవగాహన కలిగించింది లోక్‌సత్తా. రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్‌కి లోక్‌సత్తా భావజాలం మూలం. వీటికి ఓట్లు ఉన్నాయని ఆయన నిరూపించారు. లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు సోషల్ మీడియా లేదు. ఒక ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే, చాలా కష్టపడాల్సి ఉండేది. ఇప్పుడు మీడియాలో విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు మొదలైన కీలకాంశాల మీద చర్చ జరుగుతోందిగానీ.. ఇంకా పరిష్కారాల చర్చ లేదు. మొక్కుబడిగానే, మూస పద్ధతిలోనే సాగుతోంది. లోక్‌సత్తా విద్యాప్రమాణాలపై ‘అసర్’ సర్వేలను ప్రోత్సహించటం 2005లో ప్రారంభిస్తే, ఇప్పుడు కొద్దిగా వాటి పేర్లు

ఉటంకిస్తున్నారు. ప్రభుత్వమూ పిల్లలు ఏం నేర్చుకున్నారు అనే అంశంపై అధికారిక సర్వేలు చేయిస్తోంది. కానీ పేపర్ లీకేజీలు, రిజర్వేషన్లు వంటి అంశాలతో సంచలనం తప్ప.. విద్యలో నిజమైన పునాది పాఠశాల చదువులో ఉంది, అక్కడ రిజర్వేషన్లు వంటి సమస్యలు లేకున్నా ఎందుకు ఫలితాలు రావటం లేదు? అనే చర్చ లోతుగా జరగటం లేదు. కానీ లోక్‌సత్తా భావజాలంపై అప్పటికంటే ఇప్పుడు మీడియా ఎక్కువ మొగ్గుచూపుతోంది.

ప్రశ్న: రాజకీయ పార్టీగా లోక్‌సత్తాకు ఇప్పుడు సమాజంలో ఎంత ఆదరణ వుంది?

**మీడియా, యువత కూడా లోక్‌సత్తా భాష మాట్లాడుతున్నారు.. జెన్ జడ్‌కి జేపీ మార్గదర్శకత్వం అవసరం**

**భీశెట్టి బాబ్జీ (లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు)**

జేపీ గారు చెప్పిన, వర్మ గారు వివిధ పుస్తకాల రూపంలో ప్రచారం చేసిన మాటలు ఇప్పుడు పత్రికల్లో, పార్టీల్లో, చివరికి జెన్ జడ్ సోషల్ మీడియాలోనూ ప్రచారం అవుతున్నాయి. మా తాతగారు స్వాతంత్ర్య సమరయోధులు. నాకు రాజకీయాలంటే చాలా ఇష్టం. కానీ ఇంకో పార్టీకి మారాలంటే మనసొప్పటం లేదు. సరిగ్గా ప్రజలకు లోక్‌సత్తా భావజాలం అర్థమవుతున్న సమయంలో మనం ఎన్నికల్లో పోటీకి విరామం ఇచ్చామేమో అనిపిస్తుంది. మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు చూస్తే ఉసూరు మనిపించింది. వాళ్లు లోక్‌సత్తా భాష–విద్య, ఉపాధి వంటి అంశాలు మాట్లాడుతున్నారుగానీ, స్పష్టత లేదు. జేపీ గారు వారికి నాయకత్వం వహిస్తే ఎంత బాగుంటుంది? దేశానికి ఎంత మేలు జరిగేది? అనిపిస్తుంది. తెలుగువారు గర్వించదగ్గ, దేశమంతటికీ అవసరమైన లోక్‌సత్తా భావజాలంపై జేపీ గారు జాతీయస్థాయిలో పనిచేయాలని, మనం తెలంగాణ, ఏపీల్లో కృషి చేయాలని సహచర నేతలను కోరుతున్నాను.

**మద్యనియంత్రణ అధికారం స్థానిక మహిళా కమిటీలకు ఇవ్వాలి..డి. లక్ష్మి (మహిళాసత్తా అధ్యక్షురాలిగా పనిచేశారు)**

మహిళాసత్తా ఆధ్వర్యంలో చేసిన మద్యనియంత్రణ ఉద్యమం వైఎస్ రాజశేఖరరెడ్డి లాంటి నాయకుడ్ని కూడా కదిలించింది. ఈవేళ రాష్ట్ర విభజన జరిగాక, రెండు తెలుగు రాష్ట్రాలూ మద్యాన్నే ఆదాయ మార్గం చేసుకుని పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. అధికార వికేంద్రీ కరణతో స్థానిక ప్రభుత్వాల్లో మహిళా కమిటీలకు మద్యం వంటి అంశాలపై నిర్ణయాధికారం, అమలు బాధ్యత అప్పగించాలి.

**సీసీ కెమెరాల తరహా ఉద్యమానికి సిద్ధంగా ఉన్నాం**

**దోసపాటి రాము (యువసత్తా, జీహెచ్ఎంసీకి ఎన్నికైన పార్టీ అధ్యక్షులు)**

హైదరాబాద్‌లో దిల్‌షుక్‌నగర్ బాంబు పేలుళ్లు, ట్రాఫిక్ ఉల్లంఘనల వల్ల యాక్సిడెంట్లు, స్కూలు పిల్లలూ ఇబ్బంది పడటం నేపథ్యంలో పోలీసులు, చట్టసభ ప్రతినిధుల్ని కలిసి, ప్రజల్ని చైతన్యపరుస్తూ నిరంతరాయంగా ఉద్యమం సాగించాం. దేశంలోనే అత్యధిక సీసీటీవీ కెమెరాలున్న నగరంగా హైదరాబాద్‌ను సురక్షితం చేశాం. ఇక్కడ ప్రతి 1000 మందికి 79 సీసీ కెమెరాలున్నాయి. ఇంటి నుండి బయల్దేరి తిరిగి వెళ్లేలోపు ప్రతి 150 మంది 16 కెమెరాల్లో రికార్డవుతారు. ప్రజలకు అధికారం ఇవ్వటానికి లోక్‌సత్తా ఒక ఉద్యమానికి కూడా కార్యాచరణ రూపొందించాలి. ప్రజల్ని సమీకరించి అమలు చేయటానికి మేం సిద్ధం.

**33% రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకునేలా మహిళలకు నాయకత్వ శిక్షణ ఇవ్వాలి**

**తుమ్మనపల్లి శ్రీనివాస్ (లోక్‌సత్తా తెలంగాణ అధ్యక్షులు)**

జెన్ జడ్ రాజకీయాల్లో ఆసక్తి చూపిస్తున్న సమయంలో లోక్‌సత్తా ఎన్నికల్లో పాల్గొనకపోవటం కొంత నిరాశ కలిగిస్తోంది. వారిలో చాలామందికి అవగాహన లేదు. స్థానిక ప్రభుత్వాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులకు లోక్‌సత్తా ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడింది. ఇప్పుడు అసెంబ్లీ, పార్లమెంటులో 33% మహిళా రిజర్వేషన్లు అవకాశం వచ్చింది కాబట్టి.. మహిళల్ని నాయకులుగా, సుపరిపాలన అందించేవారుగా తీర్చిదిద్దే శిక్షణను జేపీ గారు అందించాలి.

**వచ్చే 30 ఏళ్లలో పాతతరం మార్గదర్శకత్వం.. కొత్తతరం నాయకత్వంలో లోక్‌సత్తా కార్యాచరణ : జేపీ**

తమిళనాడులో విజయ్ పార్టీ గెలవటానికి అక్కడ అభివృద్ధికి పర్యాయపదమైన పట్టణీకరణ 65% ఉంది. అవినీతి ఉన్నా కూడా.. ఆటోమొబైల్స్, వస్త్ర వంటి ఎక్కువ ఉపాధినిచ్చే రంగాలున్నాయి. బహుశా దేశంలో చిట్టచివరిగా మార్పు వచ్చేది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనేమో. మన తెలుగు రాష్ట్రాల్లో అలాంటి పరిస్థితులుండటం దురదృష్టకరం. మనం వాస్తవాల్ని విశ్లేషించకుండా ప్రచారం కోసం పార్టీని నడుపుతూ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే.. బ్యాంకు అకౌంట్లు, లెటర్‌హెడ్‌లు, 100 కోట్ల ఖర్చు తప్ప ప్రజలకు ఫలితాలనందించలేం. అందుకు కాదుగదా, లోక్‌సత్తా ఏర్పడింది. సమయం అనుకూలిస్తే కచ్చితంగా పోటీ చేద్దాం. ఏమాత్రం వెనుకడుగు లేదు. ఈలోగా సంస్కరణలకు ఎన్నికల్లో పోటీ మినహా మిగతా రాజకీయం ఉధృతంగా కొనసాగించాలి. ముఖ్యంగా జెన్ జడ్ నాయకత్వాన్ని పెంచాలి. ఎందుకంటే, భవిష్యత్తులో 90 శాతం వారిదే. మంచీచెడు వారి మీదే ఎక్కువ ప్రభావం చూపుతాయి. కాబట్టి, మనం క్రమంగా మార్గదర్శకత్వ పాత్రకు పరిమితమవుతూ, నాయకత్వ బాధ్యతల్ని యువతరానికి అందించాలి. వచ్చే 30 ఏళ్ల లోక్‌సత్తా కార్యాచరణ ఈ పరిధిలోనే కొనసాగుతుంది. ★

# 30+ లోకి లోక్‌సత్తా: నేతల ప్రశ్నలకు జేపీ జవాబులు

***లోక్‌సత్తా మూడు దశాబ్దాల చరిత్రను సమీక్షించుకుని, వచ్చే 30 ఏళ్లకు ప్రధానంగా జెన్ జడ్ నాయకత్వంలో కార్యాచరణపై సమాలోచనకు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో వేదిక మీద మాట్లాడినవారే కాకుండా.. ఈ భావజాలం కోసం నిస్వార్థ సేవలందిస్తూ చరిత్రకు సరైనవైపున నిలిచిన అనేకమంది నేతలు ప్రేక్షకులుగా సభలో కూర్చున్నారు. రెండు ప్యానల్ చర్చల తర్వాత సభికులు అడిగిన కొన్ని ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు. మిగిలిన అనేక ప్రశ్నలకు ఆన్‌లైన్ ద్వారా సమాధానమిస్తామన్నారు.***






(?) మతోన్మాదం, క్రోనీ క్యాపిటలిజం, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచటం, క్రిమినల్స్‌కి టికెట్లివ్వటం చేస్తోందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతివ్వటం, ఆర్ఎస్ఎస్‌ను చాలా గొప్ప సంస్థగా పేర్కొనటం సరైన విధానమేనా

జేపీ: నాకు బహిరంగంగా, ప్రయివేటుగా లభించే ప్రతి అవకాశాన్నీ లోక్‌సత్తా ఎజెండాను త్వరగా సాధించేందుకే, అంటే, ప్రజల తక్షణావసరాలను, దీర్ఘకాలిక ప్రయోజనాలతో సమన్వయం చేసేందుకే ఉపయోగిస్తాను. ఎప్పుడు, ఎక్కడ, ఎలా యుద్ధం చేయాలో మన లక్ష్యాన్ని బట్టి నిర్దేశించుకుంటాను తప్ప, ఆర్.ఎస్.ఎస్, ఏబీవీపీ వగైరాలను బట్టి కాదు. ఇంతకంటే ఈ విషయంలో చెప్పాల్సింది ఏమీ లేదు.

(?) మన దేశంలో ట్రాఫిక్‌లో, ఇతరత్రా బహిరంగ ప్రదేశాల్లో క్రమశిక్షణ బొత్తిగా పాటించటకపోవటం కొనసాగుతోంది. సమాజంలో సివిక్ సెన్స్, పౌరసత్వ భావన పెంపొందించటం లోక్‌సత్తా వచ్చే 30 ఏళ్ల కార్యాచరణలో భాగమని తెలిపారు. దీని గురించి కొంచెం వివరించండి

జేపీ: మన సమాజంలో మొదట్నుంచి ఉన్న అంతర్గత బలాలే స్వతంత్రం వచ్చాక బహిరంగ కార్యక్రమాల్లో కూడా ఎక్కువ మార్గదర్శకాలుగా కొనసాగుతున్నాయి. రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధపాలన అంతంత మాత్రంగానే అమలవుతోంది. కానీ పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో, ఎవరో తెలిసిన చూస్తే ఏమనుకుంటారోనని మొహమాటం కోసం క్రమశిక్షణ పాటించటం తగ్గిపోతుంది. ముక్కు మొహం తెలియనివారితో కలిసి తరచూ వ్యవహరించాల్సి వస్తుంది. కాబట్టి, గడప దాటాక కూడా చట్టబద్ధ క్రమశిక్షణతో వ్యవహరించే సంస్కృతి పెరగాలంటే.. ఉమ్మడి భవిష్యత్తు (కామన్ ఫేట్) ప్రభావం మన వ్యక్తిగత జీవితాల మీద కూడా ఎంత ఉంటుందో అవగాహన ఏర్పరచుకోవాలి. రాజ్యాంగానికి, సమాజానికి అంతరాన్ని తగ్గించే విధానాలను అనుసరిస్తూ ప్రభుత్వాలు మంచిని ప్రోత్సహించటం, చెడును నిరుత్సాహపరచటం ఎంత సమర్థంగా చేస్తే అంత త్వరగా సివిక్ సెన్స్ పరిణతి ఏర్పడుతుంది. ఇందులో సమాజంలో కొన్ని తప్పులున్నా, అంతకంటే రాజకీయం ఎక్కువ తప్పులు చేస్తోంది. ప్రభుత్వోద్యోగాలే పరిష్కారం లాంటి పచ్చి అబద్ధాలతో యువతను మోసం చేస్తోంది. ఉపాధి, ఆదాయాలు పెరగటం మార్కెట్‌లో ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులను అందించే నైపుణ్యాల ద్వారానే సాధ్యమవుతుందని చెప్పటం, అందుకు పెట్టుబడుల్ని ప్రోత్సహించటం, గ్రామీణ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం వంటివి చేస్తే సంపద సృష్టిలో ఎక్కువమంది భాగస్వాములవుతూ మార్పు వేగంగా వస్తుంది.

(?) జెన్ జడ్ ఉద్యమం కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో పాలకుల్ని, ప్రతిపక్షాల్ని కూడా వణికించింది. ఆ యువత లోక్‌సత్తా భాష మాట్లాడుతున్నా.. విధానపరమైన స్పష్టత, మార్పు సాధించేంతవరకూ కృషిని కొనసాగించే సహనం వారిలో కనిపించటం లేదు. ఈవేళ్టి యువత రాజకీయాల్లోకి రావటంపై ఏమంటారు

జేపీ: నేను ఆశావాదిని. యువతను రాజకీయాల్లోకి రావాలని ప్రేరేపించింది, అందుకోసం వారికి నిజమైన ప్రజాస్వామిక వేదికను అందుబాటులోకి తెచ్చింది నేనే. కానీ ఈవేళ మహాత్మాగాంధీ పోటీ చేసినా గెలవగలరా? అన్ని కోట్లు నిజాయతీగా ఖర్చు పెట్టటం సాధ్యమా? ఖర్చు పెట్టి గెలిచాక, అవినీతికి పాల్పడకుండా ఉంటారని ఆశించగలమా? ఒకసారి అమెరికాలో రెవరెండ్ కార్టర్ అనే ప్రముఖుడితో సమావేశమయ్యా. వారి దేశం గురించి ఆయన మాట్లాడారు, మన దేశంలోని సమస్యల్ని నేను వివరించాను. అంతా విన్నాక ఆయన ఒక ఆణిముత్యంలాంటి రాజకీయ సత్యం చెప్పారు–







"మా దేశంలో (అమెరికా) నల్లజాతీయుల పట్ల వివక్ష వంటివి ఎన్నికల్లో గొంతు వినిపించటం ద్వారా పరిష్కరించుకోగలం. మా సమస్యలకి రాజకీయం పరిష్కారం చూపగలదు. కానీ మీ దేశంలో (భారత్) రాజకీయమే సమస్య". కాబట్టి, ఏదైతే పరిష్కారాల్ని అందించాలో ఆ రాజకీయమే మనకు సమస్యగా మారినప్పుడు, యువతను దూకండి అని చెప్పటం ఆ క్షణంలో గొప్పగా కనిపిస్తుందిగానీ.. వారి జీవితాల్ని పణంగా పెట్టటం తప్ప చివరకు సాధించేదేమీ ఉండదు. కాబట్టి, నిజాయతీపరులు, సమర్థులు ఎన్నికల్లో పోటీ చేయగలిగేలా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం, ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థ స్థానంలో దామాషా పద్ధతి, స్థానిక ప్రభుత్వాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎన్నుకున్న కమిటీలకు అధికారాలు, నిధులు ఇవ్వటం వంటి సంస్కరణల్ని ముందు అమలు చేయాలి. అలాగని అవన్నీ జరిగేంతవరకూ యువత చేతులు ముడుచుకుని మౌన ప్రేక్షకులుగా ఉండనక్కర్లేదు. స్థానికంగా సమస్యలపై అవగాహనతో పనిచేస్తూ పరిష్కారాలను అందించవచ్చు, ఎన్నికల్లో ఓటు ద్వారా మార్పుకి దోహదం చేయవచ్చు. అంతేగానీ, త్యాగాలు వద్దు, అనవసర ఆవేశంతో అలసిపోవద్దు. అన్నీ సవ్యంగానే ఉన్నాయనే ఆశావాదం ఎంత ప్రమాదమో, అన్నీ నాశనమయ్యాయనే నిరాశావాదమూ అంతే ప్రమాదం. శూన్యం నుండి మనం మొదలవటం లేదు. చాలా మంచి కూడా జరిగింది, జరుగుతోంది. మంచి జరగాలనుకునేవారు అన్ని పార్టీల్లో ఉన్నారు. పాఠశాల విద్య అధ్వాన్నంగా ఉందని లోక్‌సత్తా ఎప్పటి నుంచి పోరుతోంది? ఇరవై, పాతికేళ్ల తర్వాత ప్రభుత్వం మొట్టమొదటిసారిగా అదో పెద్ద సమస్యని గుర్తించింది. టాయిలెట్లు, భవనాలు కాదు.. పిల్లల చదువు ముఖ్యమని ఇప్పుడు కొంత మాట్లాడుతున్నారు. అదేవిధంగా, లోక్‌సత్తా కూడా తోడ్పాటుని అందించిన నూతన విద్యావిధానం 2020లో సబ్జెక్ట్‌ల ఎలక్టివ్ పద్ధతి ఉంది. ఒక ప్రధాన సబ్జెక్ట్‌కే పరిమితం కాకుండా, ఆసక్తిగల మరో సబ్జెక్ట్‌ని ఎంపిక గావించుకోవచ్చు. అందుకు క్రెడిట్లు సంపాదించుకోవచ్చు. 1869 నుండి 1909 వరకు హార్వర్డ్ అధ్యక్షుడిగా ఉన్న ఛార్లెస్ ఇలియట్ ఎలక్టివ్‌లను ప్రవేశపెడితే, 160 ఏళ్ల తర్వాత మనం అమలు చేస్తున్నాం. అదేవిధంగా, చైనాలో ఇరవై ఏళ్ల క్రితమే పాఠశాల విద్య ఆధునిక మార్కెట్ అవసరాలకు తగ్గట్లు అద్భుతంగా ఉంది. విద్యార్థి కేంద్రంగా బోధన, వనరుల కేటాయింపు ఉండటం అనే మౌలిక మార్పు మనకు ముఖ్యం. డబ్బులైతే ఇస్తున్నారుగానీ, ఆ పనిచేసే దమ్ము ప్రభుత్వాలకు లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి నాకు స్వయంగా చెప్పారు. స్కూల్‌లో పిల్లలు లేరని టీచర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తే, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనకు దిగాయి. టీచర్లలో 15-20% మంది అద్భుతమైనవారున్నారు. సొంత ఖర్చుతో విద్యార్థులను, స్కూళ్లను బాగుచేస్తున్నవారున్నారు. కానీ రాజకీయ సంకల్పం కొరవడుతోంది. ఒత్తిడిలేని పరీక్షలు వంటి పద్ధతుల్ని సులభంగా అమలు చేయగలిగిన సాంకేతికతల కాలంలో ఉన్నా.. వ్యవస్థీకృతం చేయటాన్ని ప్రాధాన్యాంశంగా భావించటం లేదు. అలాంటి పనుల్లో యువత చొరవ తీసుకోవచ్చు. బీహార్‌లో ప్రశాంత్ కిషోర్ బీజేపీ అధ్యక్షుడి కంచుకోటలో గెలవటం అంత వెనుకబడిన రాష్ట్రంలోని ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నారనటానికి సంకేతం. కానీ ఆ మార్పు పక్వానికి వచ్చి దేశవ్యాప్తమయ్యేదాకా.. యువత కెరీర్‌ను, సమాజహితాన్ని సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి అవగాహనతో, సంఘటితంగా, సాంకేతిక వనరులను ఉపయోగించుకుంటూ పనిచేసేందుకు రోజూ కొంత సమయం కేటాయిస్తూ క్రమంగా ఎదగటం మంచిది.

(?) జేపీ గారిని తెలుగు ప్రజలు గాంధీలాగా భావిస్తారు. గాంధీ లాగా మీరు కూడా ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం లేదా

జేపీ: నిజమైన సక్సెస్ పదవులు, పబ్లిసిటీ వల్ల రాదు. మంచి ప్రయత్నాలకు, దీర్ఘకాల లక్ష్యాలకు అవరోధాలు తప్పవు. రాముడికాలంలోనూ రావణుడున్నాడు, కృష్ణుడి కాలంలోనూ కంసుడున్నాడు. గొప్పకాలం అని మనం అనుకుంటున్న కాలంలో దేవతామూర్తులుగా మనం నిత్యం పూజించేవారు కూడా కష్టాలు అనుభవించారు. చట్టాన్ని తుంగలో తొక్కి డబ్బుతో గెలిచినవారు సమర్థులా? అంత అసమర్థంగా గెలిచినవారు కూడా అందులో అతి తక్కువ డబ్బుతో మనం సాధించిన విజయాల్లో సగం కూడా సాధించలేదు. వాస్తవాల ఆధారంగా, హేతుబద్ధ ఆలోచనతో సరైన ప్రశ్నలు అడగకపోతే, ఏఐ యుగంలో ఇంకా ప్రమాదం.

(?) జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించటం వల్ల 1200 వార్డు కమిటీల్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అంటే, 24,000 మంది సభ్యులు. మనం హైదరాబాద్‌లో స్థానిక సాధికారతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇదో అవకాశంగా ఉపయోగించుకోవచ్చా

జేపీ: స్థానిక ప్రభుత్వాల సాధికారతకు ఈ దేశంలో మనం చేసిన కృషి ఎవరూ చేయలేదు. 73, 74 రాజ్యాంగ సవరణలు



విఫలమయ్యాయి, మరో రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు నిధులు, అధికారాలు విధిగా కేటాయించాలని సోనియాగాంధీ, వాజపేయి ఒకే వేదికపై ప్రకటించారు. ఇందుకు లోక్‌సత్తా ప్రయత్నమే కారణం. కానీ పెత్తనం వదులుకోవటానికి పాలకుల నుండి అధికార యంత్రాంగం వరకూ ఎవరికీ ఇష్టం ఉండదు కాబట్టి, ఆశించిన ఫలితాలు వెంటనే రాకపోయినా మనం నిరాశపడనక్కర్లేదు. ట్యాక్సులు కడుతున్నారు కాబట్టి.. పట్టణాలలో ప్రజానీకం ఆశాకిరణంగా కనిపిస్తోంది. పన్నులకు తగ్గ సేవలు అందించేందుకు స్థానిక సాధికారత వార్డు, డివిజన్ స్థాయి వరకూ కల్పించటాన్ని ఓటుతో సంధానం చేయగలిగితే మార్పు ఇక్కడ వేగంగా రావొచ్చు. అందువల్ల, వార్డు కమిటీల్లో సభ్యులుగా ప్రజల్లో అవగాహన పెంచటానికి జీహెచ్ఎంసీ ఎన్నికలను లోక్‌సత్తా నేతలు ఉపయోగించుకోవటం మంచిదే. ఇదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లోనూ జరుగుతున్న మునిసిపల్ ఎన్నికల్లో అవకాశాల్ని ఉపయోగించుకోవాలి. ప్రస్తుతం ఇంటి నుంచి బయల్దేరి తిరిగొచ్చేవరకూ లాస్ట్ మైల్ కనెక్టివిటీ ఉండేలా ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటుకి, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుకి, ట్రాఫిక్ రద్దీని నియంత్రించటానికి, నిబంధనల్ని కచ్చితంగా అమలు చేయటానికి 'మూవ్ హైదరాబాద్' కార్యక్రమం చేస్తున్నాం. మంచి స్పందన వస్తోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మూవ్ హైదరాబాద్‌ని ఎజెండాగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఇలా అన్నిచోట్లా తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఫలితాల్ని సాధించే ప్రజాఉద్యమాల్ని పెట్రోల్ బంకుల్లో అక్రమాలపై చేసిన రీతిలో నిర్వహించటం, ఓటుతో అనుసంధానించి ఫలితాలు సాధించటం ద్వారా ఎన్నికల్లో పోటీతో సంబంధంలేకుండా మంచి ఫలితాల్ని సాధించవచ్చు.

# 22 ఏ బాధితులు కబ్జాదారులు కాదు





ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడుతుందంటే పూర్తిగా మద్దతిస్తానని డాక్టర్ జేపీ అన్నారు. 22ఏ జాబితాలో కాలనీల స్థలాల్ని చేర్చటం, హౌసింగ్ బోర్డ్ స్థలాల అమ్మకాలపై హైదరాబాద్ కేపీహెచ్‌బీ ఎన్ఆర్ఎస్ఏ కాలనీలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేపీ, మాజీ మంత్రి హరీష్‌రావు తదితరులు పాల్గొన్నారు. జేపీ మాట్లాడుతూ, 'విధానాలు అమలు చేసేటప్పుడు నిజాయతీపరుల ఆస్తులను కాపాడటం ప్రభుత్వాల ప్రథమ బాధ్యత. ఈ విషయంలో సర్కారు విఫలమైంది. 22ఏ బాధితులు కబ్జాదారులు కాదని ముఖ్యమంత్రికి సవినయంగా తెలియచేస్తున్నాను. వసంత్‌నగర్ పరిధిలోని కాలనీల్లో సుమారు 2 వేలకుపైగా ఇళ్ల స్థలాలున్నాయి. ప్రజలు దశాబ్దాల కిందట నిజాయతీగా చట్టబద్ధంగా అన్ని పద్ధతులూ పాటించి కొనుక్కున్న స్థలాలివి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాదమనే ఉద్దేశంతో గంపగుత్తగా భూములను 22ఏలో కలిపేశారు. దీనిపై నేను ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి, రెవెన్యూ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశా. ప్రతి కాలనీ, లే అవుట్‌ను పరిశీలించి సరైన విధంగా ఉన్నట్లయితే, 22ఏ జాబితా నుండి ఆ భూములను తొలగించాలి' అని విజ్ఞప్తి చేశారు.

# 30 ఏళ్ల లోక్‌సత్తా సాధించిన విజయాలు

⏭ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా అందించాల్సిన సేవలపై 'స్వరాజ్యం' పేరుతో ప్రజాహక్కుల పత్రం విడుదల




⏭ పెట్రోల్ బంకుల్లో తూనికల అక్రమాలను బయటపెట్టటం. తద్వారా దేశవ్యాప్తంగా అన్ని బంకుల్లో మీటర్లను సరిచేశారు. వినియోగదారులకు దాదాపు 10% ఇంధనం ఆదా అయింది. ఈ విధంగా ప్రస్తుత ధరల ప్రకారం వినియోగదారులకి ఏడాదికి రూ.1,50,000 కోట్లు ఆదా అవుతున్నది.

⏭ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేరచరిత్ర వివరాలు బయటపెట్టటం. ఫలితంగా, అభ్యర్థులు తమ ఆస్తులు సహా అన్ని వివరాలూ ప్రజల ముందుంచాలనే చట్టం ఏర్పడింది.


⏭ ఎక్సయిజ్, కస్టమ్స్ తదితర పరోక్ష పన్నుల విధానాన్ని సరళీకరించటం – విజిలెన్స్ కమిషన్, రెవెన్యూ శాఖ, నిపుణులతో జాతీయస్థాయి రౌండ్‌టేబుల్ ద్వారా ఏకాభిప్రాయ సాధన – సంస్కరణల అమలు.



⏭ బహుళ జాతి కంపెనీలు వ్యవసాయ విత్తనాలపై గుత్తాధిపత్యం చెలాయించకుండా సుప్రీంకోర్టు ద్వారా నియంత్రణ చర్యలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లోక్‌సత్తా పిటిషన్‌కు మద్దతుగా వాదించటం, చివరికి రైతులకు భారీగా విత్తన ధరలు తగ్గటానికి దారితీశాయి.

⏭ భారతదేశంలో ఓటరు జాబితాల ప్రక్షాళనకు నాంది పలికింది లోక్‌సత్తా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కరాటక, పశ్చిమ బెంగాల్ తదితర చోట్ల ఓటరు జాబితాలను ర్యాండమ్ సర్వే చేసి గ్రామాల కంటే పట్టణాల్లో ఎక్కువ శాతం లోపాలున్నాయని తెలియచేసింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో మొత్తం నియోజకవర్గమంతా ఇంటింటికీ తిరిగి సర్వే చేసి క్షుణ్ణంగా అధ్యయనం చేసి లోపాల్ని ఎలా సరిదిద్దాలో కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ)కి తెలియచేసింది. ఈ నమూనాను అనుసరించి ఈసీ చర్యలు తీసుకోవటం వల్ల.. పట్టణాల్లో లోపాలు 30–40% నుండి 10 శాతం లోపుకి తగ్గాయి. గ్రామాల్లో 10% నుండి 1–2%కి తగ్గాయి. లోక్‌సత్తా సిఫార్సు మేరకే దేశమంతా ఓటరు గుర్తింపు కార్డుల బట్వాడా, ప్రతి సంవత్సరం రెండు సార్లు ఓటరు జాబితాల ప్రక్షాళన చేయటం, తేలిగ్గా ఓటర్లు తమ పేర్లు చేర్చటం, మార్చుకోవటం వంటివి చేసే ఏర్పాటు చేశారు. ప్రజలు తేలిగ్గా నమోదుకు వీలుగా ఓటరు జాబితాలను 365 రోజులూ పోస్టాఫీసుల ద్వారా నిర్వహించాలన్న లోక్‌సత్తా సూచనకు ఈసీ కొంత స్పందించినా, బ్యూరోక్రసీ తీరు వల్ల పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. ఆ తర్వాత అమెరికాలాంటి దేశంలో సైతం లేనిరీతిలో ఓటరుకు ఫొటో గుర్తింపు కార్డులు, ఓటరు జాబితాల్లో ఫొటోలు, ఆన్‌లైన్ ద్వారా ఎప్పుడైనా నమోదు గావించుకునే ఏర్పాటు చేశారు. సకాలంలో చేరికలు, తీసివేతలు వంటివి జరగకపోవటం వల్ల ఇంకా కొన్ని లోపాలున్నాయిగానీ, మొత్తంగా ఓటరు జాబితాలు భారతదేశంలో చాలావరకూ ఒక ప్రామాణిక స్థాయికి చేరాయి.

⏭ ఆర్‌టీఐ కంటే ముందే ప్రభుత్వ కార్యాలయాల నుండి సమాచారం సేకరించి హైదరాబాద్ కూకట్‌పల్లిలో భవనాల క్రమబద్ధీకరణలో అవినీతిని అడ్డుకోవటం, లంచం తీసుకున్న డబ్బు ప్రజలకు తిరిగిచ్చేలా చేయటం, అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం చేయటం.



⏭ తెలంగాణ సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో, హైదరాబాద్ జిల్లా చంచల్‌గూడ, యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో విద్యుత్ సబ్ స్టేషన్లను, ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా కాళ్లచెర్వు గ్రామంలో ఫీడర్‌ను దత్తత తీసుకొని సరఫరా నష్టాల్ని 30 నుండి 16 శాతానికి తగ్గించటం, నాణ్యమైన విద్యుత్‌ను రైతుల భాగస్వామ్యంతో ఎలా అందించవచ్చో రుజువు చేయటం, రైతుల పేరుతో విద్యుత్ చోరీని బహిరంగపరచటం. తద్వారా వ్యవసాయ విద్యుత్, ఇళ్ల విద్యుత్‌ను వేర్వేరు ఫీడర్లతో నిర్వహించాలనే భారీ సంస్కరణకు నాంది పలకటం, విద్యుత్ వ్యయాన్ని తగ్గించటంతోపాటు ప్రతి గ్రామంలో యువతకు ఉపాధి అవకాశాన్ని సృష్టించటం.

⏭ 2005లో జాతీయ ఆరోగ్య మిషన్ రూపకల్పన. తొలుత గ్రామాల్లో అమలు, ఆ తర్వాత పట్టణాలకు విస్తరణ.




⏭ పాలనా సమాచార హక్కు కోసం పోరాటాలు, చివరికి పార్టీల్ని ఒప్పించి సాధించటం, ఆర్‌టీఐ చట్టాన్ని పూర్తిగా లోక్‌సత్తా నేతృత్వంలో రూపొందించటం.

⏭ 84వ రాజ్యాంగ సవరణ ద్వారా

నియోజకవర్గాల డీలిమిటేషన్ రాజకీయ వివాదంగా మారి దేశ ఆర్థికాభివృద్ధికి అవరోధం కాకుండా ఫ్రీజింగ్‌ను 2026 వరకు కొనసాగించటం.

⏭ పార్టీల ఫిరాయింపుల చట్టాన్ని మరింత పటిష్ఠం చేసే 91వ రాజ్యాంగ సవరణ

⏭ మంత్రివర్గ సంఖ్య పరిమితి మించకుండా రాజ్యాంగ నిబంధన

⏭ పార్టీలు నల్లడబ్బు విరాళం తీసుకోవాల్సిన అవసరం లేకుండా, ఎన్నికల వ్యయానికి పార్టీలకిచ్చే విరాళాలకు పన్ను రాయితీ




⏭ ఆంధ్రప్రదేశ్‌లో సొసైటీలపై కఠిన నియంత్రణని ప్రతిపాదించిన బిల్లుని ఆపి, ఉత్తమ ప్రమాణాలతో పౌరుల స్వేచ్ఛని కాపాడే చట్టాన్ని తేవటం

+ ఆంధ్రప్రదేశ్‌లో 'మాక్స్' చట్టం కింద నమోదయిన పాల సహకార సంఘాల పాలకవర్గాలని ప్రభుత్వం తొలగించినప్పుడు లోక్‌సత్తా ప్రజాపోరాటం, న్యాయపోరాటం - ఆ విధంగా సుప్రీంకోర్టు దాకా ఉన్న కోర్టులలో విజయం సాధించి సహకార సంఘాల స్వయంప్రతిపత్తిని కాపాడటం.

⏭ ప్రజలు తమలో తాము ఏర్పాటు చేసుకునే సహకార సంఘాలను ప్రభుత్వాలు కబ్జా చేయకుండా 97వ రాజ్యాంగ సవరణ

⏭ పరిమిత పరిధి గల కేసుల్ని వేగంగా పరిష్కరించగల స్థానిక కోర్టుల ఏర్పాటుకు వీలుకల్పించే గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009లో సాధించటం

⏭ చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ చట్టంలోని రొటేషన్ పద్ధతి వంటి లోపాల్ని వెల్లడిస్తూ ప్రత్యామ్నాయ బిల్లు రూపకల్పన. పార్టీలే సీట్లు కేటాయించటం అంతిమంగా మెరుగైన పద్ధతి అని స్పష్టీకరణ. బిజూ జనతాదళ్, టీఎంసీ అమలుతో ఈ వాదనకు మద్దతు. మహిళా రిజర్వేషన్లు వచ్చే ఎన్నికల్లో అమలుకాకుంటే, పార్టీ తరపునే 33% ఇస్తామని కొన్ని పార్టీల ప్రకటన.




⏭ రిజర్వేషన్లపై స్పష్టమైన విధానం ఉన్న ఏకైక రాజకీయ ఉద్యమం, పార్టీ లోక్‌సత్తా. ఈడబ్ల్యూఎస్ వంటి పద్ధతులకన్నా పేద, గ్రామీణ నేపథ్యం ఉన్న తల్లిదండ్రుల కుటుంబాల్లో పిల్లలకు పోటీ పరీక్షల్లో కొన్ని మార్కులు కలపటం వంటి పద్ధతుల్ని అమలు చేయాలని, అన్నిటికంటే ముఖ్యంగా ఏ రిజర్వేషన్లూ లేని పాఠశాల విద్యను బాగు చేయాలని సూచించింది. కులగణను వ్యతిరేకించటంతో పాటు.. అంబేద్కర్ మార్గంలో రిజర్వేషన్లు ఒక మినహాయింపుగా 50 శాతం మించకూడదని, రాజ్యాంగ సమానత్వాన్ని దెబ్బతీయకూడదని లోక్‌సత్తా బహిరంగంగా ప్రజల్లో స్పష్టత పెంచింది. అదేవిధంగా కులాలులేని హిందూయేతర ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి మారినవారికి ఎస్.సి రిజర్వేషన్లు వర్తించకూడదని, వెనుకబడిన తరగతుల (బీసీ) జాబితాలో ఇవ్వొచ్చని పేర్కొంది.



⏭ సుప్రీంకోర్టు, హైకోర్టులలో న్యాయమూర్తుల నియామకంలో పక్షపాతానికి ఆస్కారం లేకుండా, పార్లమెంటు ద్వారా ప్రజలకు జవాబుదారీ అయ్యేలా జాతీయ జ్యుడీషియల్ కమిటీ బిల్లును ముగ్గురు సుప్రసిద్ధ న్యాయకోవిదులతో తయారు చేసి, కాంగ్రెస్, బీజేపీ సహా అన్ని ప్రధాన జాతీయ పార్టీలనూ ఒప్పించటం, పార్లమెంటులో 99వ రాజ్యాంగ సవరణగా సాధించటం. ఆరు నెలల రికార్డు సమయంలో సుమారు 16 రాష్ట్రాలు ధ్రువీకరించిన ఈ రాజ్యాంగ సవరణను రాష్ట్రపతి ఆమోదం తర్వాత సుప్రీంకోర్టు అహేతుకంగా కొట్టివేసింది.

⏭ ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామికవాడల స్వయంప్రతిపత్తి కోసం పోరాడి ఐలా (ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ)ల స్వేచ్ఛని, స్వయంపాలనని కాపాడటం.

⏭ స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం రికార్డు స్థాయిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1 కోటీ 8 లక్షల సంతకాల సేకరణ. అన్ని పార్టీల మద్దతు సమీకరణ.

⏭ పంచాయతీలు, మునిసిపల్ ప్రభుత్వాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాల్ని నిర్వహించటం, మొత్తాన్నీ క్రోడీకరించి ఒక కరదీపికలా అందించటం.

⏭ లోక్‌పాల్ కోసం ఉద్యమస్థాయి ప్రచారం చేయటంతో పాటు.. అన్నా హజారే బృందం డిమాండ్‌లోని లోపాలను సరిదిద్దేందుకు ఢిల్లీలో ఆయా రంగాల నిపుణులతో కీలక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహణ, లోక్‌సత్తా రూపొందించిన లోక్‌పాల్‌నే అంతిమంగా పార్లమెంటు ఆమోదించటం.

⏭ అమెరికాతో పౌర అణు ఒప్పందానికి వ్యతిరేకంగా ఉప్పు, నిప్పులాంటి బీజేపీ, కమ్యూనిస్టులు ఏకమైనా.. దానివల్ల భారత్‌కి దీర్ఘకాలంలో లాభం జరుగుతుందని దేశ వ్యాప్తంగా ప్రచారం చేసి అప్పటి ప్రభుత్వానికి విధాన పరమైన హేతుబద్ధ వాదనల మద్దతును లోక్‌సత్తా అందచేసింది. పోఖ్రాన్ అణుప్రయోగం తర్వాత దెబ్బతిన్న భారత్, అమెరికా సంబంధాల పునరుద్ధరణ జరిగి భారత్ పెద్ద ఆర్థిక శక్తిగా ఎదగటానికి ఈ పరిణామం ఎంతగానో దోహదం

చేసింది.

⏭ వ్యవసాయోత్పత్తులకు పక్కరాష్ట్రాల్లో రేటు ఎక్కువ ఉన్నా అమ్మకూడదన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తూ కర్నూలు నుండి కర్ణాటకకు, నిజామాబాద్ నుండి మహారాష్ట్రకు రైతు సంఘాలతో కలిసి లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాదయాత్ర. దీంతో తెలుగు రాష్ట్రాల రైతులకు ధాన్యం రేటు క్వింటాలు బస్తాకి రూ.750 నుండి 1200 రేటు లభించింది. సుమారు ఆ ఒక్క సీజన్‌లోనే ఒక్క బీపీటీ రైతులకే రూ.3600 కోట్ల దాకా లాభం చేకూరింది. ఆ తర్వాత రాష్ట్రాల మధ్య ఆంక్షలు తొలిగి దేశమంతా ఒకే మార్కెట్ అయింది.

⏭ బియ్యం ఎగుమతులపై ఆంక్షల్ని ప్రధానమంత్రిని ఒప్పించి తొలగించటం. కొన్ని అంతరాయాలున్నా అప్పటి నుండి ఇప్పటి వరకూ ఎగుమతులు కొనసాగుతూ బియ్యం సరఫరాలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండటం, రైతులకు రేట్లు పెరగటం


⏭ పండ్లు, కూరగాయల సాగు, ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుతోపాటు పర్యావరణహిత పునరుత్పాదక ఇంధన పంటల సాగు సహా రైతుకు ఆదాయాన్నిచ్చే స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలతో సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రభుత్వాలకు అందచేయటం, కొన్ని మార్పులు అమలు ప్రారంభమవటం.

⏭ 2 జీ స్పెక్ట్రం కేటాయింపుల్ని బహుళ జాతి కంపెనీలకు ఏకపక్షంగా చేయటంపై పోస్టుకార్డుల ఉద్యమం. దేశంలోని సుప్రసిద్ధులతో కలిసి లైసెన్స్‌ల రద్దుకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విజయం సాధించటం, ప్రకృతి వనరుల కేటాయింపుల్లో అవకతవకలు లేకుండా వేలం పాటల పద్ధతికి చట్టబద్ధత సాధించటం.



⏭ దేశ ఆర్థికాభివృద్ధిని అణగదొక్కటంతోపాటు.. భవిష్యత్తు తరాలపై అన్యాయంగా మోయలేని భారం మోపే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణకు వ్యతిరేకంగా పోరాటం. ఎన్నికల్లో ఆ హామీ ఇచ్చి గెలిచిన పార్టీలు కూడా ఓపీఎస్ అమలు చేయకుండా నిలువరించటం. ప్రభుత్వోద్యోగులకు వ్యతిరేకంగా ఈ పోరాటానికి ఏ పార్టీ, ప్రజాసంఘం, పౌర సమాజ సంస్థ, చివరికి మీడియా కూడా సాహసం చేయలేదు.

⏭ భారత్‌కి లభించిన ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని, యువ జనాభా సానుకూలతను సద్వినియోగం చేయటానికి ఆర్థిక క్రమశిక్షణపై నిరంతర ప్రచారంతోపాటు.. అందుకు రాజ్యాంగంలో 293వ అధికరణాన్ని వినియోగించేందుకు




యూనియన్ ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నాలు. సంక్షేమం-అభివృద్ధి సమతూకంతో ఉండేలా దేశమంతటికీ ఒక సందేశం ఇచ్చేందుకు 2024లో తటస్థ వైఖరిని వీడి ఎన్‌డీయే కూటమికి మద్దతిచ్చి ప్రచారం చేయటం, ఘనవిజయంలో తన వంతు పాత్ర పోషించటం. పౌర సమాజం బాధ్యతలకు నిర్వచనాన్ని విస్తరించటం.

⏭ మద్య నిషేధం వల్ల మాఫియా, కల్తీ సారా పెరుగుతాయని, కానీ మద్యం విచ్చలవిడి అందుబాటు వల్ల పేద కుటుంబాలు నష్టపోతాయని.. అందువల్ల కఠిన మద్య నియంత్రణ అమలు చేయటం, బెల్ట్‌షాపుల్ని తొలగించటం కోసం ఉద్యమించి సిటిజన్ అరెస్టులతో గణనీయ ఫలితాల్ని సాధించింది.

⏭ ఆన్‌లైన్ సేవలు సహా అన్ని రకాల పౌర సేవల్నీ హక్కుగా ప్రజలకు అందించేందుకు సిటిజన్స్ చార్టర్లు ప్రతి కార్యాలయంలో ప్రదర్శించటం, ఆలస్యమైతే ఎంత పరిహారం చెల్లిస్తారో అందులో పేర్కొనటం తదితర అంశాలతో రైట్ టూ సర్వీసెస్ చట్టం రూపకల్పన, పాక్షిక అమలును సాధించటం.

⏭ ఒక్క ఓటు ఎక్కువతో గెలవటం, మిగతావారికి ఎన్ని ఓట్లు వచ్చినా నిరుపయోగం అనే ప్రస్తుత ఎఫ్‌పీటీపీ పద్ధతి మన దేశం ఉన్న పరిస్థితుల్లో ఓట్ల కొనుగోలుకు, రాజకీయ అవినీతికి దారి తీస్తున్నందున (2024 ఎన్నికల్లో రూ.1 లక్షా 30 వేల కోట్లు ఖర్చయినట్లు అంచనా) ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా పద్ధతి తేవాలని జాతీయ సదస్సులు నిర్వహణ. ఎన్నికల సంస్కరణలు, ఏసీబీకి స్వతంత్ర ప్రతిపత్తితో పటిష్ఠ లోకాయుక్త పరిధిలోకి తెచ్చి అవినీతిని కట్టడి చేయటం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, హక్కుగా పౌర సేవలకు ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తుదారులకు పరిహారంతో కూడిన రైట్ టూ సర్వీసెస్, చట్టబద్ధపాలన అమలు మొదలైన అంశాలపై అన్ని పార్టీలూ



ఏకాభిప్రాయంతో పనిచేసేలా మూడు రోజుల పాటు జేపీ 'సురాజ్య' నిరాహార దీక్ష.

⏭ ఆరు సుపరిపాలన అంశాల ఎజెండాతో ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల్లో సురాజ్య యాత్ర. పాఠశాల విద్యా ప్రమాణాలు పెంచటానికి, అందరికీ ఆరోగ్యం అందించేం దుకు పెద్ద ఖర్చులేని మార్పులు, స్థానిక కోర్టుల ఏర్పాటుకు గ్రామా న్యాయాలయాల చట్టం అమలు, రైతుకు ఆదాయాన్నిచ్చేం దుకు భూకమతాల విస్తీర్ణం పెంపు, ఆహారశుద్ధి కర్మాగారాల ఏర్పాటు, చిన్న పట్టణాల అభివృద్ధి మొదలైన సిఫార్సులతో రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేత.

⏭ తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో తీర్పు ద్వారా రాజ్యాంగబద్ధంగా కోరుకుంటున్నారు కాబట్టి, రాష్ట్రం ఏర్పాటు సమంజసమని, అయితే విభజన సామరస్య పూర్వకంగా అవతలివారిని ఒప్పించి చేయాలని లోక్‌సత్తా పేర్కొంది. రాష్ట్రం ఏర్పాటు వల్ల తెలంగాణలో అద్భుతాలు జరగవు, ఆంధ్రప్రదేశ్‌లో ఉపద్రవమూ రాదు అని అన్ని ప్రాంతాల్లో పేర్కొన్న ఏకైక పార్టీ లోక్‌సత్తా. దీంతోపాటు.. విడిపోతే హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే ఏపీకి ప్రత్యేక హోదా సహా వనరులపరంగా యూనియన్ ప్రభుత్వం చేయాల్సిన సహాయాలతో రోడ్‌మ్యాప్‌ని అందించిన పార్టీ లోక్‌సత్తా మాత్రమే. అదేవిధంగా తెలంగాణలో జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుతో వికేంద్రీకరణను జేపీ ప్రతిపాదించారు.

⏭ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కి రెవెన్యూ లోటు వివాదం, ఇతరత్రా జాప్యాల కారణంగా ఏ హామీని యూనియన్ ప్రభుత్వం ఎలా అమలు చేయాలో మార్గ సూచీని ఇచ్చేందుకు రెండు తెలుగు రాష్ట్రాల, తెలుగేతర జాతీయస్థాయి నిపుణులతో ఒక స్వతంత్ర కమిటీని జేపీ ఏర్పాటు చేశారు. వీరు ప్రధానంగా ఏపీకి, అదేవిధంగా తెలంగాణ మౌలిక వసతులకు సంబంధించి పెండింగ్ హామీలపై నిర్దిష్ట వివరాలతో యూనియన్ ప్రభుత్వానికి సిఫార్సులు చేశారు. లోక్‌సత్తా కమిటీ చెప్పిన మేరే రూ.10,461 కోట్లు ఏపీకి నిధులు విడుదల చేయటంతో పాటు, పోలవరం సహా పలు ఇతర హామీల్ని వేగంగా అమలు చేస్తున్నారు.

⏭ భారతదేశంలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించిన తొలి రాజకీయ పార్టీగా లోక్‌సత్తా ఆదాయవ్యయాలను ఆడిట్ చేసి ఎన్నికల సంఘానికి సమర్పించటం, వివిధ పదవులకు రహస్య బ్యాలెట్ ద్వారా నాయకులను ఎన్నుకోవటం, బలహీన వర్గాలు గెలవకపోతే విధిగా వారికి, మహిళలకు జనాభా దామాషా పద్ధతిలో పదవులు కోటాష్టన్ పద్ధతిలో కేటాయించటం, ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచక పోవటం, తాత్కాలిక తాయిలాల్ని ప్రకటించకపోవటం, కులం, మతం, భాష, ప్రాంత ఉద్రేకాలు రెచ్చగొట్టకపోవటం, స్థానిక ఎన్నికల్లో కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతి నిధులతో పాటు ఎన్నికైన ప్రజల భాగస్వామ్యంతో పనిచేసే వార్డు కమిటీల ఏర్పాటు ఎజెండాతో పోటీచేయటం. ఎన్ని కల్లో అభ్యర్థుల నిర్ణయానికి కీలక స్థానిక ప్రభుత్వ ఎన్ని కలతో పాటు పటాన్‌చెర్వు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రయోగాత్మ కంగా ఓపెన్ ప్రైమరీని లోక్‌సత్తా నిర్వహించింది.



⏭ పామెలిన్ ఆయిల్ దిగుమతులపైన సుంకాలు విధించటం కోసం లోక్‌సత్తా కొన్ని సంవత్సరాలుగా పోరాడి 2017లో విజయం సాధించింది. ఆరకంగా దేశంలో ఆయిల్ పామ్ పంటలు వేసిన రైతులకి లాభసాటి ధరలు అందే ఏర్పాటు జరిగింది.

⏭ పాఠశాల విద్యను బాగుచేసే క్రమంలో కస్తూరి రంగన్ కమిటీకి కీలక సూచనలు, జాతీయ విద్యావిధానం 2020లో లోక్‌సత్తా సిఫార్సులకు చోటు.

⏭ స్కూలు విద్యను బాగు చేసే క్రమంలో పిల్లల అభ్యసన ప్రమాణాలు, భవిష్యత్తులో 'స్టెమ్' సబ్జెక్టుల్లో అమ్మాయిల సంఖ్య పెరగటం, ఛాందస సెంటిమెంట్లు లేకుండా శాస్త్రీయ జీవన విధానం లక్ష్యంగా 'విజ్ఞాన్ సేతు సైన్స్ ల్యాబొరేటరీలకు' హైదరాబాద్ అల్వాల్ జెడ్పీ బాలికల పాఠశాల నుండి శ్రీకారం.



⏭ నూతన పౌర సమాజ నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించటం.

.. ఇవికాక చట్టసభలో జేపీ రాజ్యాంగ ప్రమాణాలతో వివిధ చర్చలు, ప్రసంగాలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత పట్ల నిబద్ధతతో జీహెచ్ఎంసీ పాలకవర్గ సమావేశాలలో ఎమ్మెల్యేగా పాల్గొనకపోవటం-ఓటు హక్కును వినియోగించు కోకపోవటం, ప్రాణహిత-చేవెళ్ల (ఆ తర్వాత కాళేశ్వరం) వంటి ప్రాజెక్టుల వల్ల నష్టంపై హెచ్చరిస్తూ ప్రత్యామ్నాయాలు చూపటం, రాష్ట్ర విభజన వంటి అంశాల్లో నిర్వర్తించిన చరిత్రాత్మక పాత్ర, కూకట్‌పల్లిని 500 సార్లు సందర్శించి రూ.1600 కోట్లతో విద్య, ఆరోగ్యం వంటి అంశాలవారీగా ప్రజాకమిటీలతో అభివృద్ధి చేయటం, నూతన రాజకీయ సంస్కృతి, బహిరంగ చర్చ ప్రమాణాలు, ముఖ్యంగా పార్టీపరంగా పలు ఇతర కార్యక్రమాలను ఇందులో ప్రస్తావించలేదు. ◈

# అప్రజాస్వామిక పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కాపాడలేవు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



మహారాష్ట్రలోని శివసేన చీలిక వర్గాల వివాదం విచారణలో సుప్రీంకోర్టు బెంచ్ ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేసింది. 'ఎన్నికైన ప్రజాప్రతినిధులు వర్సెస్ వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసిన పార్టీలు'.. ఎవరిది నిర్ణయాధికారం అనే అంశానికి సంబంధించిన పిటిషన్ అది. మీడియా సమాచారం ప్రకారం.. ఎన్నికైన సభ్యుల్లో తమకు మెజారిటీ ఉందన్న కారణంగా, మాతృ రాజకీయ పార్టీ అధికారిక ఆదేశాలను ఒక వర్గం చట్టసభసభ్యులు ఉల్లంఘించలేరు అని బెంచ్ వ్యాఖ్యానించింది. ఒక ప్రజాస్వామ్య పరిణతిని రాజకీయ పార్టీలు, వాటి సభ్యులు తమ భావజాలానికి కట్టుబడి ఉండటాన్ని బట్టి అంచనా వేస్తారని కూడా కోర్టు అభిప్రాయపడింది.

గత కొన్ని ఎన్నికలుగా పార్టీ ఫిరాయింపులు మన రాజకీయాల్లో ఆనవాయితీగా మారాయి. ఒక పార్టీ తరపున పోటీ చేసి గెలిచాక, మరో పార్టీలోకి మారిపోవటం అనైతికం కాదా? అనే ప్రశ్న సహజం. న్యాయమైన ఆ ప్రశ్నకు సమాధానం కోసం ఇంగితజ్ఞానాన్ని దాటి మనం కొంత లోతుగా పరిశీలించాలి. గత 75 ఏళ్లుగా మన దేశంలో రాజకీయ పార్టీల ఏర్పాటు, ప్రజాస్వామ్య పనితీరును పరిగణలోకి తీసుకోవాలి.

ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో ఎక్కువమంది ప్రవర్తన, పనితీరు ప్రజలుగా మనం ఆశిస్తున్న ప్రమాణాలకు చాలా తక్కువ స్థాయిలో ఉంటున్నాయన్నది నిర్వివాదాంశం. మన పాలన, రాజకీయాల నుండి మంచి ఫలితాలను మనం అందుకోవటం లేదు. ప్రజాస్వామ్యం కొద్దిమంది అధికారం కోసం అర్రులు జాచేవారి కోసం కాకుండా.. మన ప్రజల కోసం పనిచేయటానికి పలు దీర్ఘకాల, సుస్థిర రాజకీయ, పాలన సంస్కరణల కోసం నేను నిరంతరం వాదిస్తున్నాను. ఎన్నికల వ్యవస్థ, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలు, స్వయందిద్దుబాటు వ్యవస్థలు, చట్టసభల పనితీరు – వీటన్నిటిలో సమూల ప్రక్షాళనలు అవసరం. ఎన్నికవని కొద్దిమంది సంపన్నులు, వారి అనుయాయుల ముఠా (కోటరీ) ఇప్పటికే చాలా పార్టీలను నియంత్రిస్తున్నారు. వారి నిరంకుశత్వాన్ని బలోపేతం చేయటం ప్రజాస్వామ్యాన్ని బాగుచేస్తుందనే న్యాయస్థానం అభిప్రాయం ఒక ప్రమాదకరమైన భ్రమ. ఎన్నికల ప్రక్రియ, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల మనలో ఉన్న వ్యతిరేకతను న్యాయస్థానం వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయి.

సుప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ తత్వవేత్త, ఎన్నికల సంస్కరణలపై సాధికారత నిపుణులు మైఖేల్ డమ్మెట్ (1925–2011).. రాజకీయ పార్టీలు సమస్యలో ఎలా భాగమవుతున్నాయో చాలా స్పష్టంగా, సంక్షిప్తంగా క్రోడీకరించారు. ప్రజాస్వామికంగా, సభ్యుల నిర్ణయాలకనుగుణంగా వ్యవహరిస్తూ ఆచరణలో ఆదర్శప్రాయంగా కనిపించే పార్టీల వ్యవస్థ పాశ్చాత్య దేశాలలో ఉంది. అలాంటి ప్రజాస్వామ్య పార్టీల నేపథ్యంలో కూడా డమ్మెట్ ఈ వ్యాఖ్యలు చేయటం మనం గమనించాలి.

“ప్రజాస్వామ్య వ్యవస్థ పనిచేయటానికి రాజకీయ పార్టీలు అనివార్యమనిపించేంతగా మనం పార్టీల వ్యవస్థకు

అలవాటుపడ్డాం. కొంతమంది సభ్యులు వాటిని ఓ మతంగా ఆరాధిస్తారు. కానీ ఆ పార్టీల ఉనికే ప్రజాస్వామ్య ఆదర్శాన్ని ఉల్లంఘించేలా ఉంటుందన్నది చేదు నిజం. ఎన్నికైన చట్టసభ సభ్యులు తమ అభిప్రాయాలకు వ్యతిరేకంగా, పార్టీ అధినాయకత్వ ఆదేశానికి అనుగుణంగా సభలో ఓటు వేయటమంటే.. పార్టీలు కుట్రలకు వేదికలుగా పని చేస్తున్నట్లు. అటువంటి లాలూచీ (ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకమైనా) అందులో భాగస్వాములైన చట్టసభసభ్యులకు లాభసాటి కావచ్చు. రాజకీయ పార్టీల లక్ష్యసాధన కూడా అధికభాగం ఈ దిశగానే ఉంటోంది...

"అయినా కూడా, బహుశా రాజకీయ పార్టీలు తప్పనిసరి. ఓ తప్పించుకోలేని బాధ. ఒక రాజకీయ పార్టీ ఎంత కేంద్రీకృతమైతే.. పార్లమెంటు (అసెంబ్లీ)కి అభ్యర్థుల ఎంపికను శాసించటం, ప్రభావితం చేయటం, లేదా ఆ ప్రక్రియలో జోక్యం చేసుకోవటం ప్రజాస్వామ్యానికి అంత హానికరంగా మారుతుంది...."

పాశ్చాత్య దేశాలలోనే పార్టీల తీరు ప్రజల సంక్షేమం, జనహితం కోసం కాకుండా సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఉంటే, ఇక పార్టీ కొందరి స్వంత ఆస్తులుగా మారిపోయిన మనదేశంలో పరిస్థితిని మనం అర్థంచేసుకోవచ్చు.

ఒక సుప్రసిద్ధ అంతర్జాతీయ పత్రిక చెప్పినట్లు, మన పార్టీలలో "కిరీటం ధరించినవాడే కింగ్'. రాజ్యం వీరభోజ్యం అన్నట్లు తనకు తాను కిరీటధారణ గావించుకుంటారు. సభ్యుల ఆమోదంతో పనిలేదు. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్య నిబంధనలు లేనప్పుడు.. ఒక వ్యక్తి లేదా ఓ కుటుంబం, కొందరు సంపన్నులు లేదా ఓ అనుచరుల ముఠా (కోటరీ) పార్టీలను నియంత్రిస్తుంటాయి. నిజమైన ఎన్నిక ఉండదు. ఒక వ్యక్తి లేదా కుటుంబం ఎప్పుడైతే పార్టీని నియంత్రిస్తుంటాయో.. ఇక వారికి నచ్చిన, వారు అంగీకరించిన వారు మాత్రమే అభ్యర్థులుగా ఎన్నికల్లో నామినేషన్ వేయగలుగుతారు. తమ "నాయకత్వానికి" సవాలుగా మారే అవకాశముందనుకున్న నాయకులను ఏకపక్షంగా బహిష్కరిస్తారు. లెక్కలు చూపని నిధుల్ని పూర్తిగా తమ కనుసన్నల్లో మళ్లిస్తుంటారు. ఒక్క ఓటుతో ఫలితాలు తారుమారయ్యే మన ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ ఎన్నికల పద్ధతిలో.. ఎక్కువ ఓట్ల శాతం పొందగల ప్రధాన రాజకీయ పార్టీలు చట్టసభ అభ్యర్థిత్వానికి ఎంపిక చేయకుండా, స్వతంత్రంగా ఎన్నికవటం దాదాపు అసాధ్యం. కాబట్టి పార్టీ సభ్యులు, ఎన్నికయిన చట్టసభ సభ్యులు నాయకత్వం ఎలాంటిదయినా విధిలేక దాసోహమనవలసి వస్తోంది. అధికారం కోసం పోటీపడే పార్టీలు ప్రజల ఆకాంక్షలకు



"ఒక్క ఓటుతో ఫలితాలు తారుమారయ్యే మన ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ ఎన్నికల పద్ధతిలో.. ఎక్కువ ఓట్ల శాతం పొందగల ప్రధాన రాజకీయ పార్టీలు చట్టసభ అభ్యర్థిత్వానికి ఎంపిక చేయకుండా, స్వతంత్రంగా ఎన్నికవటం దాదాపు అసాధ్యం. కాబట్టి పార్టీ సభ్యులు, ఎన్నికయిన చట్టసభ సభ్యులు నాయకత్వం ఎలాంటిదయినా విధిలేక దాసోహమనవలసి వస్తోంది. అధికారం కోసం పోటీపడే పార్టీలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎదగాలంటే సంస్కరణలు అనివార్యం.

అనుగుణంగా ఎదగాలంటే సంస్కరణలు అనివార్యం.

మన ఎన్నికల వ్యవస్థ, అలా నిరంకుశంగా ప్రవర్తించే పార్టీలకి పోటీగా కొత్తపార్టీలని ఎదగనివ్వదు. కాబట్టి, సభ్యులకి ఉన్న పెద్ద పార్టీలని ఆశ్రయించటం తప్ప వేరే గత్యంతరం లేదు. కొత్త ఆలోచనలను, విధానాలను పార్టీలు స్వీకరించవు. చట్టసభల్లో నిజమైన, హేతుబద్ధమైన బహిరంగ చర్చను అనుమతించవు. సమాజం ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏకాభిప్రాయ సాధనకు అవకాశం ఇవ్వవు. తద్వారా చట్టసభల్ని నిర్వీర్యం గావిస్తాయి. చట్టసభ మాత్రమే మన వ్యవస్థలో ప్రజామోదం, రాజ్యాంగబద్ధత ఉన్న ప్రజాస్వామ్య సంస్థ. చట్టసభలను నిష్క్రియం చేసే నిరంకుశ రాజకీయ పార్టీలకు మరింతగా అధికారాలనిస్తే అది ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తుంది. దీనివల్ల ప్రజాస్వామ్యం మరింతగా పలచబడి ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తుంది.

పార్టీని సొంత ఎస్టేట్‌గా మార్చుకున్న కొద్దిమంది ఆధిపత్య

వర్గాలు సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసమో లేదా వ్యక్తిగత అవసరం కోసమో ప్రజాప్రయోజనాల్ని పణంగా పెట్టిన సందర్భాలు మన దేశంలో కోకొల్లలు. ఆర్థిక సంస్కరణల్ని బలంగా సమర్థించే బీజేపీ, ఆర్థిక స్వేచ్ఛను వ్యతిరేకించే వామపక్షవాదులు ఉప్పు, నిప్పు అయినప్పటికీ.. సంస్కరణల్ని అమలుచేస్తున్న పి.వి నరసింహారావు ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు పార్లమెంటులో ఏకమయ్యాయి. అదేవిధంగా, అమెరికాతో వ్యూహాత్మక సత్సం బంధాలను సమర్థించే బీజేపీ, అందుకు బద్ధవ్యతిరేకమైన కమ్యూనిస్టులు.. భారత్-అమెరికా పౌర అణుఒప్పందం విషయంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు చేతులు కలిపాయి. షాబానొ కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ముస్లిం మహిళా బిల్లు తిరోగమనమైనదని పలువురు పార్టీ ఎంపీలు వ్యతిరేకించినా రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ బల వంతంగా వారి చేత అనుకూల ఓటు వేయించింది. ఆ బిల్లుకు మద్దతిచ్చి అపఖ్యాతిని మూటగట్టుకోలేమని బలంగా వ్యతిరేకించిన ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ లాంటి వారు ప్రభుత్వాన్ని, పార్టీని వీడి శంకరగిరి మాన్యాలు పట్టాల్సి వచ్చింది.

ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలోని శివసేన కేసులో వంశపారంపర్య 'నాయకత్వ' ఏకపక్ష వ్యవహారశైలి వల్ల సమస్య తలెత్తింది. ఎటువంటి జవాబుదారీతనం లేకుండా, నిరంకుశంగా, పార్టీ కిరీటం తమ జన్మహక్కన్నట్లు ఆ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంది.

2014 నుండి 2019 వరకు మహారాష్ట్రంలో బీజేపీ, శివసేన సంకీర్ణ ప్రభుత్వంగా అధికారంలో ఉన్నాయి. ఒకే కూటమి భాగస్వాములుగానే 2019 ఎన్నికలకు ప్రజల ముందుకెళ్లాయి. తమ పనితీరును, ఎజెండాను ఓటర్ల ముందుంచి సంకీర్ణంగా మరోసారి ప్రభుత్వ ఏర్పాటుకి తీర్పును కోరాయి. కూటమిగా ఫలితాల్ని అందుకున్నాక, శివసేన నాయకత్వం ఎన్నికల ఒప్పందాన్ని, ప్రజల తీర్పుని కాలరాచింది. ఏ పార్టీల మీదైతే తాము ఎన్నికల్లో పోరాడారో ఆ కాంగ్రెస్, ఎన్‌సీపీలతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ సంకీర్ణ ఫిరాయింపుపై విభేదాలతో చివరికి శివసేన శాసనసభా పక్షం చీలిపోయింది. పార్టీని చీల్చిన షిండే వర్గం 2024 ఎన్నికల్లో ప్రజామోదం పొందింది.

పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం; ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ గొంతును వినిపించేందుకు, తమ అత్యుత్తమ వివేచనకు అనుగుణంగా సభలో ఓటు వేసేందుకు మరింత స్వేచ్ఛ.. మనకు అత్యవసరమని పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధుల నిర్ణయాలు, అభిప్రాయాలతో సంబంధం లేకుండా, 'నాయకత్వ'

> **పౌరులు, పార్టీల సభ్యులు, నాయకులు లేదా చట్టసభ సభ్యులు ఒకరు చెప్పేది ఇంకొకరు వినటాన్ని తిరస్కరించినప్పుడు, ఇతరులను ఒప్పించటం లేదా ఇంకొకరి అభిప్రాయాలకు ఒప్పుకోవటానికి సుముఖంగా లేనప్పుడు.. ప్రజాస్వామ్యం క్రమంగా అంతరిస్తుంది. పరస్పర విరుద్ధ ఆలోచనలను, అభిప్రాయాలను, ప్రయోజనాలను శాంతియుతంగా, సామరస్యంగా సమన్వయం చేయటమే ప్రజాస్వామ్య మౌలిక సారాంశం.**

ఆదేశాలు, విప్‌ల ప్రకారమే నిరంతరం నడుచుకోవాల్సి వచ్చినప్పుడు చట్టసభలకు అర్థం ఉండదు. కుహనా ఎన్నికల్లో నామమాత్రంగా ఎన్నికయి, పార్టీ నాయకత్వం జన్మహక్కు అన్నట్లు తమకు తాముగా కిరీటం ధరించిన నిరంకుశ పార్టీ నాయకత్వం ఉన్నప్పుడు.. ప్రజల గొంతును వినిపించాల్సిన వేదికలు నిర్వీర్యమవుతాయి. ఆ పార్లమెంటు ఆఫ్ఘనిస్థాన్‌లోని లొయా జిర్గా తరహా ఆటవిక సమాఖ్యలా తయారవుతుంది. చట్టసభలు నిర్వీర్యమయితే, తమ అశాంతిని తెలియచేయటానికి ప్రజలు, కాక్రోచ్ జనతా పార్టీ తరహాలో యువత రోడ్లెక్కి ఆందోళనలు చేస్తారు. పౌరులు, పార్టీల సభ్యులు, నాయకులు లేదా చట్టసభ సభ్యులు ఒకరు చెప్పేది ఇంకొకరు వినటాన్ని తిరస్కరించినప్పుడు, ఇతరులను ఒప్పించటం లేదా ఇంకొకరి అభిప్రాయాలకు ఒప్పుకోవటానికి సుముఖంగా లేనప్పుడు.. ప్రజాస్వామ్యం క్రమంగా అంతరిస్తుంది. పరస్పర విరుద్ధ ఆలోచనలను, అభిప్రాయాలను, ప్రయోజనాలను శాంతియుతంగా, సామరస్యంగా సమన్వయం చేయటమే ప్రజాస్వామ్య మౌలిక సారాంశం.

ప్రజాప్రయోజనాల కన్నా పార్టీయే మిన్న అని భావించే, ప్రజలతో సంబంధంలేని, నిరంకుశ నాయకత్వం రాజకీయ, చట్టసభ నిర్ణయాలను శాసిస్తుంటే.. అది ప్రజాస్వామ్యానికి మృత్యుఘంటిక అవుతుంది. చివరకు ఆ పార్టీలకూ నష్టం చేస్తుంది. భారతదేశానికి ఈవేళ కావలసింది దీర్ఘకాలం పనికొచ్చే లోతైన ప్రజాస్వామిక సంస్కరణలు తప్ప.. గుడ్డెద్దు చేలో పడ్డట్లు ధోరణులు, అపరిపక్వ ఆలోచనలు పరిష్కారం కాలేవు.

# ప్రభుత్వ బాధ్యత
# ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందించటం.. స్కూళ్లు నడపటం కాదు

టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషన్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో అధికారికంగా పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులతో తెలంగాణ ముఖ్యమంత్రి, విద్యామంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమావేశమయ్యారు. ఇందులో ఆ బోధనా సిబ్బంది ఏం చెప్పారో మీడియాలోనూ రాలేదు. 'మీ పర్యటనల్లో ఏం నేర్చుకున్నారో విద్యార్థులకు చెప్పండి' అని మాత్రమే ముఖ్యమంత్రి చెప్పినట్లు రిపోర్టులు వచ్చాయి. కాబట్టి.. ఆ రకమైన చర్చ అక్కడ జరగలేదని భావించాలి. మొత్తం 500 మంది టీచర్లను అలా విదేశాలకు పంపిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. దీంతోపాటు.. ఐఏఎస్, ఐపీఎస్‌లతో సమానంగా ఏటా 10-15 మంది టీచర్లను ఏడాదిపాటు చదువుకునేందుకు విదేశాలకు పంపిస్తామన్నారు. ఇప్పటివరకూ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో వివిధ శాఖలకు శిక్షణ ఇచ్చినట్లుగానే టీచర్లకు కూడా వారం పది రోజులపాటు రెసిడెన్షియల్ విధానంలో ఫౌండేషనల్ కోర్సులను అందిస్తామన్నారు. తాను ఎంతో ఇష్టంతో విద్యాశాఖను తీసుకున్నానని, అంతకుముందు ముఖ్యమంత్రిలా సాగునీటిపారుదల తీసుకోలేదని కేసీఆర్‌ను విమర్శించారు. పీజీఐ 2.0లో అట్టడుగున ఉన్న తెలంగాణ ర్యాంకును 18కి చేర్చామన్నారు. అదేవిధంగా, ఇప్పటికే హార్వర్డ్ వర్సిటీకి వెళ్లి శిక్షణా తరగతులకు కూడా హాజరైన ముఖ్యమంత్రి.. ఆగస్టులో విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్‌లోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలను, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను సందర్శించారు. ఉన్నత విద్యను మెరుగుపరిచే అంశాలను పరిశీలించటంతోపాటు, ఆయా వర్సిటీలు తెలంగాణలోనూ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

.. ఈ మొత్తంలో పైకి ఏమీ పెద్దగా తప్పుపట్టాల్సిన అంశాలు కనిపించవు. ప్రత్యక్షంగా వింటే.. రేవంత్ ప్రసంగ నైపుణ్యం వల్ల ఉద్వేగభరితంగా కూడా అనిపిస్తాయి. కానీ విద్య విలువను ఎంతోకొంత అవగాహన గావించుకున్న కోణంలో పరిశీలిస్తే.. మౌలికంగా పెద్ద లోపాలు కనిపిస్తాయి.

ఒకటి) ప్రజల దబ్బుతో ఫిన్లాండ్, జర్మనీ వెళ్లి వచ్చిన టీచర్లు తెలంగాణ అనుసరించాల్సిన విధానపరమైన మార్పులను ఏమి గమనించారో చెప్పలేదు. కేవలం పిల్లలకు బోధించటానికే అయితే, పర్యటనలకు వెళ్లనక్కర్లేదు. ఇక్కడా అవి నేర్పించగలవారున్నారు. ఇంకా కొత్త విషయాలు ఉన్నాయనుకుంటే.. జూమ్ సమావేశంలో అక్కడి టీచర్లతో నిరంతరం సంభాషిస్తుండవచ్చు. వైద్యులు ఆన్‌లైన్‌లో సంక్లిష్ట ఆపరేషన్లను చేస్తున్నకాలంలో, టీచర్లు నేర్చుకోలేరా?

రెండు) పీజీఐ 2.0లో తెలంగాణ ర్యాంకు 18కి పెరగటానికి విద్యాప్రమాణాల్లో మెరుగుదల కారణం కాదు. భవనాలు వంటి అంశాలకు సంబంధించినది. రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎవరైనా చేయగలరు. కాబట్టి, ఆ ర్యాంకు మన స్కూళ్ల పాస్‌లలాగే నకిలీ ప్రమాణం. కేవలం ముఖ్యమంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులూ చేస్తున్న మభ్యపెట్టే ప్రచారం

మూడు) ముఖ్యమంత్రే విద్యాశాఖ తీసుకోవటం ఆ రంగానికి తీవ్ర నష్టం చేస్తోంది తప్ప లాభం చేస్తున్న దాఖలాలు లేవు. విద్యలో కీలకమైన పాఠశాల చదువులో ప్రభుత్వం ప్రతి బిడ్డ మీదా ఏటా రూ.1,08,000 ఖర్చు చేస్తున్నా నాణ్యమైన చదువు అందటం లేదని ముఖ్యమంత్రి ఎప్పటి నుండి ప్రకటిస్తున్నారు, ఇప్పటికి ఏం సాధించారు? అని పరిశీలిస్తే ఆ వైఫల్యం అర్థమవుతుంది. నిజంగా విద్య పట్ల అంత ఆర్తి ఉంటే, తానే ఆ మంత్రిత్వ శాఖ తీసుకోనక్కర్లేదు. విద్యా మంత్రిని అడిగి తరచూ తెలుసుకునే, మార్గదర్శకాలు జారీ చేసే అధికారం ముఖ్యమంత్రికి ఉంది. ఉన్నతాధికారులతో నేరుగా కూడా ఆయన మాట్లాడవచ్చు. కాబట్టి.. తెలంగాణ యువత జీవితాల్ని బాగుచేసే ఒక మౌలిక రంగంలో వ్యవహరించాల్సిన తీరు ఇది కాదు.

పెట్టుబడులు, క్యాంపస్‌లను ఆకర్షించటానికైతే సముచితంగానీ.. అంతకుముందు హార్వర్డ్‌లో తీసుకున్న శిక్షణతో ఏం చేశారని మళ్లీ విదేశాల్లో వర్సిటీలను ముఖ్యమంత్రి సందర్శిస్తున్నారు వంటి సందేహాలతో ఇంకా కొన్ని ప్రశ్నల్ని లేవనెత్తవచ్చు. కానీ ప్రస్తుతానికి పాఠశాల

విద్య వరకూ పరిమితమవుదాం.

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మీద చేసే ఖర్చులో సగం మాత్రమే ఫీజులు తీసుకుంటున్న ప్రయివేటు స్కూళ్లను తల్లిదండ్రులు ఎందుకు ఎంచుకుంటున్నారో ఆలోచించమని ముఖ్యమంత్రి ఎంసీహెచ్ఆర్డీ సమావేశంలో ఉపాధ్యాయులను కోరారు. ప్రయివేటు స్కూళ్లలోని ఉపాధ్యాయులతో పోలిస్తే, ప్రభుత్వ బడులలోని టీచర్లకు శిక్షణ, జీవన భద్రత ఎంతో ఎక్కువ. పైగా, ఇప్పటికే ఆకునూరి మురళి అనే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వేసిన విద్యాకమిషన్ వివిధ దేశాలలో పర్యటించి మెరుగైన నివేదికను అందించింది. అందులో మన ఉపాధ్యాయుల శిక్షణ, బోధనలోని లోపాల్ని స్పష్టంగా పేర్కొంది. వారు జీతాలకు తగిన సేవలు అందించటంలేదని నిర్మొహమాటంగా తెలిపింది. మళ్లీ టీచర్లను విదేశాలకు పంపటం, ఏదో కొత్తగా తెలుసుకోవటం ఎందుకు?

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశం నుండి మన దేశానికి వచ్చి అధికారులు, దౌత్యవేత్తలు శిక్షణ పొందటం అరుదు. ఆఫ్రికా వంటి ఖండాల నుండే వస్తారు. ఈ నేపథ్యంలో, ఎప్పుడో పూర్వకాలంలోలా ఐఏఎస్, ఐపీఎస్‌లను విదేశాల్లో శిక్షణకు పంపించాలా అని ఆ అంశంపైనా సమీక్షించాల్సిన తరుణంలో.. వారి తరహాలో ఏటా ఉపాధ్యాయులను పంపించాల్సిన అవసరమేంటి? వారి నుండి విధానపరంగా ప్రభుత్వం తెలుసుకోవాల్సింది ఏమీ లేనప్పుడు, అసలు అక్కర్లేదు. ఏం చేస్తే తెలంగాణ పాఠశాల విద్యలో ప్రతి బిడ్డకూ మంచి చదువు వస్తుందో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్యం పీఠం (ఎఫ్‌డీఆర్) బృందం ఇప్పటికే సవివర నివేదికను సంక్షిప్తంగా అందచేసింది. ఈ పద్ధతుల్లో ఏఐ సాంకేతికత ద్వారా ప్రతి విద్యార్థికీ సామర్థ్యానికనుగుణంగా మంచి విద్యను అందించవచ్చు. కాబట్టి హేతుబద్ధ విధానాలు, తగినన్ని నిధుల కేటాయింపు ఉన్నప్పుడు కూడా.. కార్యాచరణ వదిలేసి ప్రణాళికలు, పర్యటనలు, సమావేశాలతో కాలం గడపటం ఏ రకంగానూ సమర్థనీయం కాదు.

కేవలం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమవ్వాలనుకోవటం క్రిమినల్ వేస్ట్

అయితే ముఖ్యమంత్రి చిత్తశుద్ధిని శంకించలేం. అవగాహనలోనే మౌలిక సమస్య కనిపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్ని ఉద్ధరించటమే నాణ్యమైన విద్య అందించే పరిష్కారం.. అని కంకణం కట్టుకున్నట్లు రేవంత్ పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించాలని ఏ పాలనా నియమం చెప్పదు. విద్య, ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యతలు అన్నంత వరకే రాజ్యాంగ ప్రజాస్వామ్యం చెబుతుంది. నాణ్యమైన విద్యని ప్రభుత్వ పాఠశాలల్లో అందించగలిగితే మంచిదే. కానీ మన దేశంలో ఆ సమయం మించిపోయింది. ప్రభుత్వ స్కూళ్లలోనే వాటిని అందించటం కాలయాపన, అనవసర భారం అవుతున్నప్పుడు.. వాటి చుట్టూనే ప్రభుత్వం ఆలోచించటం ఆచరణసాధ్యంకాకపోగా, కొన్ని తరాలు వెనుకబడే ప్రమాదం ఉంది. రైజింగ్ తెలంగాణ లక్ష్యం తరుణంలో ఇది నేర సమాన సెల్ఫ్‌గోల్ అవుతుంది. రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్య క్రిమినల్ వేస్ట్ అనగలిగిన ముఖ్యమంత్రి ఈ లోపాన్ని కూడా గుర్తించాలి గదా? కొందరు అనుమానిస్తున్నట్లు, ప్రభుత్వ ఆలోచనాధోరణికి ఇతర కారణాలున్నాయని భావించాలా?

పాఠశాల విద్యాసంస్థల సంఖ్యను నాలుగువేలకు కుదించి ప్రపంచస్థాయి ప్రమాణాలతో చదువు, నైపుణ్యాలు అందించేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)ను ప్రారంభించారు. ఆ మిగిలిన స్కూళ్లలో అంగన్‌వాడీ, ప్రీస్కూల్ వంటి వాటికి వినియోగించే కొన్నింటిని మినహాయించి.. మిగిలినవి హైడ్రా కాపాడిన భూముల తరహాలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలా అమ్మి ఆదాయమార్గంగా మలచుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. మితిమీరిన, అనుత్పాదక తాత్కాలిక తాయిలాల్నిచ్చి, కనీసం గెలిచాకైనా పాఠాలు నేర్చుకుని హేతుబద్ధీకరించి ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేయకుండా, భూములు అమ్మి వాటి అమలుకి నిధులు సేకరించటం సమర్థ పాలన అనిపించుకోదు. అదేవిధంగా, ఎన్నికల్లో పెట్టిన ఖర్చును వసూలు చేసుకోవటానికి అనేకమంది ఎమ్మెల్యేలు ఎంత బాహాటంగా అవినీతికి పాల్పడుతున్నారో మీడియాలో కథనాలు వస్తున్నా, ముఖ్యమంత్రి మాట్లాడలేకపోతున్నారు. ప్రపంచంలోని మిగతా దేశాల నుండి ముందు రాజకీయ, పాలన, ఎన్నికల సంస్కరణల్ని ప్రభుత్వం నేర్చుకుంటే, విద్యావ్యవస్థను అద్భుతంగా బాగుచేయటమెలాగో కాలయాపన లేకుండా బోధపడుతుంది. అంతగా మంచి చదువు గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవాలనుకుంటే.. హైదరాబాద్‌లోనే కొన్ని అంతర్జాతీయ స్థాయి పాఠశాలలున్నాయి. వాటిని సందర్శించవచ్చు. కాబట్టి.. తెలంగాణలో ప్రతి బిడ్డకీ నాణ్యమైన విద్యను అందించటం అనే ప్రభుత్వ బాధ్యత నెరవేర్చటానికి ప్రధాన అవరోధం అందుకు ప్రభుత్వ పాఠశాలలే మార్గం అనుకునే దృక్పథంలోనే ఉందేమో ముఖ్యమంత్రి యోచించాలి.

ప్రభుత్వమైనా, ప్రయివేటైనా విద్యాప్రమాణాలే కీలకం అనే


రీతిలో పాలకులు ఆలోచించటం అవసరం. అందుకనుగుణంగానే జీతభత్యాలు చెల్లించండి. బడ్జెట్ ప్రయివేటు స్కూళ్లలో పిల్లల్ని చదివించాలనుకునే పేదలకు విద్యారంగ నిధులలో కొంత మొత్తం ఫీజుల చెల్లింపు రూపంలో అందించండి.

అప్పుడు.. భవనాలు తప్ప సిబ్బందిలేని బీఈడీ కళాశాలల్లో (విద్యాకమిషన్ నివేదికలో సాక్ష్యాధారాలతో ఈ అంశంపై హెచ్చరించారు) దొంగ శిక్షణ సర్టిఫికెట్లు సంపాదించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు భవిష్యత్ తరాలతో చెలగాట మాడరు. ప్రతి ఉపాధ్యాయుడూ తాను తరగతిగదిలో ఓ గొప్ప దేశ నిర్మాణాన్ని చేస్తున్నట్లు పనిచేస్తారు. ఏఐ ఆర్థిక వ్యవస్థలో ఈవేళ్టి పాఠం రేపటికి కాలం చెల్లిన అంశంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా తగిన పునాదుల్ని, మార్పుల్ని బోధనలో భాగం గావించుకుంటారు. అదేవిధంగా, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు బదిలీ చేసి, విద్య, ఆరోగ్యాలను వాటికి జవాబుదారీ చేయండి. నిర్దిష్ట కాలవ్యవధిలో తనిఖీలు చేసే వ్యవస్థను ఏర్పాటు చేయటంతోపాటు.. ఒత్తిడిలేకుండా అభ్యసన ప్రమాణాలను బేరీజు వేయమనండి. ప్రమాణాలు లేని పిల్లలకు ఏఐ సాయంతో వారి సామర్థ్యానికి తగినరీతిలో బోధిస్తూ మిగతావారితో సమానం చేయమని నిర్దేశించండి. ఈ మొత్తాన్నీ రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించండి. అప్పుడు విద్య లక్ష్యం నెరవేరి, ఎంత ఎక్కువ, నిరంతర అధ్యయనం ఉంటే అంత ఎక్కువ ఆదాయావకాశాలు అందుబాటులోకి వస్తాయి. జాతీయ విద్యావిధానం ఇందుకు సరైన రోడ్‌మ్యాప్‌ను అందించింది. కాబట్టి, రాష్ట్రంలో వేగంగా అమలు చేసే చర్యల్ని పౌర సమాజం సహకారంతో అమలు చేయాలి. అప్పుడు రైజింగ్ తెలంగాణ ఆచరణరూపం దాలుస్తుంది.

◈

# చిట్టచివరి పౌరునికీ సాధికారతే లోక్‌సత్తా లక్ష్యం





ప్రజాస్వామ్యంలో ప్రజల సాధికారతను చిట్టచివరి పౌరుని వరకూ తీసుకెళ్లేందుకు భారత్‌లో 'ఆటగాళ్లని మారిస్తే చాలదు.. ఆట నియమాల్ని మార్చాలి' అనే నినాదంతో తెలుగు రాష్ట్రాలు వేదికగా కృషిని ప్రారంభించిన జాతీయ రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా అని ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. లోక్‌సత్తా ఎజెండా, రాజకీయ సంస్కృతి సమాజంలో జనరాజకీయం పట్ల చైతన్యం కలిగించటంతోపాటు.. కాక్రోచ్ జనతా పార్టీ వరకు పలు రాజకీయ పార్టీలు, ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ప్రవాస భారతీయులను ప్రభావితం చేస్తూ లోక్‌సత్తా భావజాలం భారత్ ఎల్లల్ని దాటి పలు దేశాలకు విస్తరించిందన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత శాంతియుత కాలంలో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్‌లా ప్రభావం చూపిన పౌర సమాజ సంస్థలు ప్రపంచంలోనే అరుదన్నారు. లోక్‌సత్తా 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కార్యాలయంలో వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌ని సత్కరించి ప్రస్తుతం కృషి చేస్తున్న విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన తదితర రాజకీయ సంస్కరణల్ని బాబ్జీ చర్చించారు. ఇప్పటివరకూ ఒక్క ఎంపీ కూడా లేకుండా లోక్‌సత్తా నాలుగు కీలక రాజ్యాంగ సవరణల్ని, పది చట్టాలను, పలు విధానపరమైన మార్పుల్ని సాధించిందని, ఎన్నికల్లో పోటీ చేయటం మినహా మిగతా రాజకీయ సంస్కరణల పోరాటాన్ని అధికారంలో ఉన్నవారి కంటే ఎక్కువగా ఇప్పటికీ చేస్తోందని, జేపీ లాంటివారిని పార్లమెంటుకు పంపి ఇంకా ఎక్కువ ఫలితాల్ని ప్రజలు అందుకునే విధంగా ఎన్నికల సంస్కరణలు రావాల్సి ఉందన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శ్వేతపత్రం–కొన్ని సవాళ్లు

రాష్ట్ర ఆర్థిక స్థితిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల శ్వేతపత్రం విడుదల చేశారు.

**2024–26 కూటమి ప్రభుత్వ నివేదికగా చంద్రబాబు విడుదల చేసిన ఆర్థిక శ్వేతపత్రంలోని కొన్ని కీలకాంశాలు:**

☞ 2024 నాటికి ఏపీ అప్పు రూ.9.74 లక్షల కోట్లు. రాష్ట్రం అప్పులను భరించలేని పరిస్థితికి చేరిందని 2023–24 నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. ఏపీ దివాళా తీసిందని వడ్డీలు పెంచేశారు. రాష్ట్రాన్ని బయటకు తీసుకొచ్చేందుకు నాలుగు మార్గాల్ని ప్రభుత్వం ఎంచుకుంది. పెండింగ్ బిల్లుల చెల్లింపు; ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి సంక్షేమం అమలు చేయటం; అభివృద్ధి, పెట్టుబడులపై దృష్టి సారింపు; మంచి పాలన.

☞ వడ్డీని చర్చల ద్వారా 9.9% నుండి 9.1 శాతానికి తగ్గించగలిగారు.

☞ ఆర్థిక సంఘం గ్రాంట్లు పెండింగ్‌లో లేకుండా విడుదల చేయించేందుకు రూ.3,142 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.

☞ 2019–24 మధ్య ఖర్చు చేసిన దాంతో పోలిస్తే గత రెండేళ్లలో మూలధన వ్యయాన్ని ఒకటిన్నర రెట్లు పెంచారు. ఏపీలో 2019–20 మధ్య రూ.17,598 కోట్లు, 2023–24లో రూ.24,061 కోట్లు, 2024–25లో రూ.21,173 కోట్లు మూలధనంగా ఖర్చు చేయగా.. ఇప్పుడు రూ.32,005 కోట్లు వెచ్చిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో ఇది అతితక్కువ ప్రభుత్వ క్యాపెక్స్ వ్యయం. ఈ మొత్తాన్ని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

☞ గ్రామీణ మహిళా స్వయంసహాయక సంఘాల్లో అత్యధిక రుణాలు వినియోగించుకోవటంలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. వీటిల్లోని మహిళలు ఆదా చేస్తున్న మొత్తం రూ.30 వేల కోట్లు.

☞ రాష్ట్రంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవో యూలు కుదుర్చుకున్నాం. 20 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం 11.37 లక్షల కోట్ల పెట్టుబడులు పట్టాలెక్కాయి. వీటితో 10 లక్షల ఉద్యోగాలొస్తాయి. దీనివల్ల ఒకటి రెండేళ్లలో రూ.3.75 లక్షల కోట్ల అదనపు స్థూల విలువ రాష్ట్రానికి లభిస్తుంది. ఆరేళ్లలో ఇది రూ.39.78 లక్షల కోట్లుగా ఉంటుంది. ఏడాదికి రూ.50 వేల కోట్లు పెరుగుతుంది. రూ.29,400 కోట్ల రెవెన్యూ రాబడి పెరిగి, రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగవుతుంది.

**అప్పుల వాటా**

☞ ఆంధ్రప్రదేశ్‌లో అప్పుల వాటా జీఎస్‌డీపీలో 36.20%గా ఉంది. 2014–19 కాలంలో సగటున 28.37% ఉంది. 2019–24లో సగటున 5.46% పెరుగుతూ వచ్చింది.

☞ రాష్ట్ర సొంత రాబడిలో జీతాలు, పెన్షన్ల వ్యయం



2023–24 నాటికి 109% ఉంది. ఈ వ్యయాన్ని 95%కి తీసుకొచ్చాం. కర్ణాటకలో 28%, కేరళంలో 68%, తమిళనాడులో 49%; తెలంగాణలో 44% మాత్రమే ఉంది. రెవెన్యూ లోటు గ్రాంటు (లోక్‌సత్తా స్వతంత్ర నిపుణుల కమిటీ ఆధారంగా దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న రూ.10,461 కోట్లు విడుదలయ్యాయి) కూడా గత ప్రభుత్వం ముందే వాడేసింది. అందువల్ల ఇప్పుడు ఆ గ్రాంట్లు రావటం లేదు. కొత్త ఆర్థిక సంఘమూ సిఫార్సు చేయలేదు.

**మూడు ఆర్థిక రీజియన్లు**

☞ **అమరావతి ఎకనామిక్ రీజియన్:** ఈ ఆర్థిక రీజియన్‌ను టెక్నాలజీ, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఇంధనం, నవకల్పనలు, విభిన్న ఆర్థిక వ్యవస్థలకు కేంద్రంగా తీర్చిదిద్దుతాం. ఇక్కడ మొత్తం రూ. 6–8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రాథమిక అంచనా. 2032 నాటికి 10 లక్షల ఉద్యోగాలొస్తాయి. ఈ ప్రాంత జీడీపీ వృద్ధి రూ.5.5 లక్షల కోట్లకు పెరుగుతుంది. ఈ రీజియన్‌లో రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులు వస్తాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్ కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతాం.

☞ **విశాఖ ఎకనామిక్ రీజియన్:** ఈ ఆర్థిక రీజియన్‌లో 49 భారీ ప్రాజెక్టుల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 24 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. 2032 నాటికే 10 లక్షల ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతి పెద్ద పోర్టు ఆధారిత తయారీరంగ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. పటిష్ఠమైన ఏఐ, డేటా సెంటర్ ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తాం.

☞ **తిరుపతి ఎకనామిక్ రీజియన్:** ఈ ఆర్థిక రీజియన్‌లో రూ. 11–12 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించటం, 2032 నాటికి 10 లక్షల ఉద్యోగాలు సృష్టించటం లక్ష్యం. ఆ ప్రాంత జీడీపీని రూ.12 లక్షల కోట్లకు పెంచుతాం. రాష్ట్ర ఆదాయంలో 40% ఈ ప్రాంతం నుండే వచ్చేలా, రూ.75 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. స్టీల్‌ప్లాంట్లు, ఉద్యానవన పంటల

కేంద్రంగా, పునరుత్పాదక ఇంధన పవర్‌హౌస్‌గా రాయలసీమ రూపుదిద్దుకుంటుంది.

☞ సీమలో ఇకపై 40-50 రకాల ఉద్యాన పంటలు పండుతాయి. ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో సాగవుతున్నాయి. ఈ పంటల సాగు 14.41 లక్షల హెకార్టలకు పెరుగుతుంది. అదేవిధంగా, ఆక్వారంగ సంక్షోభాన్ని నివారించేందుకు సమగ్ర చర్యలు. చేపలు, రొయ్యల ఉత్పత్తి 2.02 టన్నులు పెరుగుతుంది.

☞ పోలవరంతో 7.22 లక్షల ఎకరాలకు కొత్తగా నీరందుతుంది. 23.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. 23.44 టీఎంసీల జలాల్ని పారిశ్రామిక, 28.5 లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలకు అందించగలుగుతాం. పోలవరం పూర్తి చేసి.. గోదావరి, కృష్ణా, పెన్నాలను అనుసంధానిస్తే రాయలసీమకు 200 టీఎంసీల నీరివ్వగలం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా 63 టీఎంసీల నీళ్లు అందిస్తారు.

☞ ఏపీ జీఎస్‌డీపీ పెరుగుతున్నా రాబడి రాకపోవటానికి వ్యవసాయంపై అధికంగా ఆధారపడటమే కారణం. జీఎస్‌డీపీ అంతా పన్నుల్లోకి రాలేదు. మొదటిసారి 22 నుండి 23% జీఎస్‌టీ వస్తోంది.

☞ ఆంధ్రప్రదేశ్ ఇంకా టేకాఫ్ అవ్వలేదు. రాష్ట్ర ఇమేజ్‌ను పెంచాం. ఇకపై ప్రతి సంవత్సరం ప్రోగ్రెస్ రిపోర్టు ప్రజల ముందుంచుతాం.

ముఖ్యమంత్రి ప్రకటించిన ఈ వివరాల్లో గణాంకాలు సవ్యంగానే ఉన్నట్లు కనిపించినా, ఆర్థిక నమూనా ఇంకా మారాల్సి ఉంది. కేవలం కొందరి సంపదసృష్టి, వాటి ఫలితాల్ని పెట్టుబడిగా కంటే మిగిలినవారికి సంక్షేమం పేరుతో పంచటం అనే తీరు దీర్ఘకాలంలో ఆర్థిక సుస్థిరతను దెబ్బతీస్తుంది. సంక్షేమం తాత్కాలిక ఉపశమనంగా, స్వావలంబనకు దోహదం చేసేలా అర్హులకు మాత్రమే అందించాలి తప్ప.. అభివృద్ధితో సమతూకం లేకుండా పోటాపోటీగా అందించటం పరిష్కారం కాదు. జనాభాలో అధికంగా ఉన్న యువత కూడా అది కోరుకోవటం లేదు.

**ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌కి నిర్వచనం మార్చాలి**

అదేవిధంగా, పంచాయతీలకు బదిలీ చేయాల్సిన 29 అధికారాల్లో కేవలం 54.43% మార్కులు సాధించి ఏపీ అమలు చేసి 11వ స్థానంలో ఉందని యూనియన్ ప్రభుత్వం పార్లమెంటులో తెలిపింది. మూడు ప్రాంతాల సమగ్ర, సమాన అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్.. ట్రిపుల్ ఇంజిన్ గ్రోత్' అనే స్ట్రాటజీని అమలు చేస్తున్నామని శ్వేతపత్రం విడుదల సందర్భంగా చంద్రబాబు తెలిపారు. ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఒకే పార్టీ జాతీయ, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల్లో అధికారంలో ఉండటం, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధిగా కాకుండా.. ఫెడరలిజాన్ని మూడో అంచెకు తీసుకెళ్లి- జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలతో మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలకూ సాధికారత ఉండేలా చూడటంగా చంద్రబాబు ప్రభుత్వం గుర్తించాలి. పాలనాపరంగా అది సరైన నిర్వచనం. ప్రస్తుతం రాష్ట్రాల స్థాయిలో ఖర్చు చేస్తున్న 60% నిధుల్లో కనీసం సగం స్థానికంగా ఖర్చు చేసేలా పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లకు వార్డు స్థాయి వరకు అధికారాలు జవాబుదారీతనంతో ఇవ్వాలి. మహానగరాలను అభివృద్ధి చేస్తూనే, గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఎన్‌టీఆర్ చొరవతో రాష్ట్రాల వరకూ వచ్చి ఆగిన ఫెడరలిజాన్ని మూడో అంచెలోకి తీసుకెళ్లాలి. దీనివల్ల ప్రజల శక్తిసామర్థ్యాలు పూర్తిస్థాయిలో సద్వినియోగమై మొత్తం దేశానికి ఒక ఒరవడి అవుతుంది. ◈

## వెలిగొండ తొలిదశ ప్రారంభం



వెలిగొండ టన్నెల్‌ను పరిశీలిస్తున్న జయప్రకాశ్ నారాయణ



వెలుగొండ సొరంగం పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న లోక్‌సత్తా వ్యవస్థాపకులు జేపీ

శ్రీశైలం రిజర్వాయర్ నుండి నల్లమలసాగర్ జలాశయం ద్వారా లక్షల మందికి తాగునీరు, లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని వెలిగొండ ప్రాజెక్టులో కీలక పనులు పూర్తికాగా.. 2026 ఆగస్టు 31న తొలిదశను ముఖ్యమంత్రి జాతికి అంకితం చేశారు. 1985లో ప్రకాశం జిల్లాలో ఈ ఆలోచన అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు చేయగా, 1996లో శంకుస్థాపన జరిగింది. దీనివల్ల ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలకు లబ్ధి జరగనుంది. రెండు దశలూ కలిపి ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోని 24 లక్షల మందికి తాగునీరు అందించనుంది. ప్రజల చేతికి అధికారాన్ని ఇవ్వటం ద్వారా ఓ సాధారణ ప్రభుత్వ పథకాన్ని ఉపయోగించి ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఎకరాకు రూ.2,000తో 2 లక్షల ఎకరాలకు సాగునీరును ఇచ్చి స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ ఐఏఎస్ అధికారుల్లో రికార్డును కొనసాగిస్తున్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ 2017లో నిర్వహించిన సురాజ్య యాత్ర సందర్భంగా ఆ జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు పనులను సమీక్షిస్తున్న చిత్రాలివి. అప్పటికే ఎన్నో ఏళ్లు ఆలస్యమైన ప్రాజెక్టు పనుల్ని ఇకనైనా సక్రమంగా పనులు నిర్వహిస్తే 2021 కల్లా పూర్తి చేయవచ్చని జేపీ ఆనాడు చెప్పగా, అయిదేళ్లు ఆలస్యంగా తొలిదశ ప్రారంభమవుతోంది.

# అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం – భారత్ సవాళ్లు




అంతర్ పార్లమెంటరీ సమాఖ్య ప్రజాస్వామ్యాన్ని సార్వజనీన వ్యవస్థగా గుర్తిస్తూ ప్రకటన చేసి 30 ఏళ్లు అవుతుండగా, ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామ్యాన్ని సార్వజనీన విలువగా గుర్తించి సెప్టెంబర్ 15ను 'అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం'గా ప్రకటించి 20 ఏళ్లు అవుతోంది. ఇరవయ్యొకటవ శతాబ్దం ప్రారంభం నాటికి ఉచ్ఛస్థితికి చేరుకున్న ప్రజాస్వామ్యం, 2026 వచ్చేసరికి నిరంకుశ పోకడల నుండి తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోందని విశ్లేషణలనే కాదు.. రోజువారీ వార్తల్ని చూసినా అర్థమవుతుంది. సుమారు 92 దేశాల్లో ప్రజాస్వామ్య రాజకీయంలో నిరంకుశత్వం పెరుగుతోందని, 74% ప్రజలు ఈ రకమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అంచనా.

భారతదేశం మీదా ఆ ప్రభావం ఉన్నప్పటికీ.. తొలి నుండీ అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగవిధానం, ప్రపంచంలో మరే దేశంలోలేని అపార, సంక్లిష్ట వైవిధ్యం మన దేశంలో ఒడిదుడుకులను సహజ రక్షణలుగా నియంత్రిస్తున్నాయి. అయితే, అవకాశాలు–అవరోధాల మధ్య ఊగిసలాటలో 2026లో మన దేశ ప్రజాస్వామ్యమూ బలమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. చుట్టుపక్కల దేశాల్లోని జెన్ జడ్ యువత ఆందోళనలు అత్యధిక యువ జనాభా ఉన్న మన దేశం మీద ఎలాంటి ప్రభావం చూపుతాయోనన్న ఉత్కంఠ మధ్య కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) యువత ఢిల్లీ జంతర్‌మంతర్ ఆందోళన నిర్వహించి, యూనియన్ విద్యాశాఖ మంత్రి చేత రాజీనామా చేయించింది. నీట్ పరీక్షా పత్రం లీక్ నేపథ్యంలో ఈ ఆందోళన జరిగినా, దేశవ్యాప్తంగా వచ్చిన మద్దతును చూస్తే.. నిరుద్యోగం, అల్పాదాయాలు యువతలో అశాంతికి మూలాలుగా కనిపిస్తాయి.

ప్రపంచంలో జరుగుతున్న అభివృద్ధిని సోషల్ మీడియాలో రోజూ చూస్తున్న యువత ఆకాంక్షల్ని మాటలతో పరిమితం చేయటం సాధ్యమా? లక్షలాది గ్రామాల్లో ఉపాధి అవకాశాల్లేని యువతను ఏడెనిమిది మహానగరాలకు వలస వచ్చి బతకమనటం సరైన పాలనా? ఆ మహానగరాల ఆదాయాల్ని మిగతా గ్రామీణ ప్రాంతాలవారికి, బస్తీవాసులకు తాత్కాలిక తాయిలాలుగా పంచటం ఎంత కాలం చేయగలరు? అంత ఆదాయాన్నిచ్చే నగరాల్లో కూడా చాలా ప్రాంతాలు మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, మంచినీరు వంటి కనీస వసతులకు కూడా కటకటలాడుతూ, ట్రాఫిక్ రద్దీతో కిటకిటలాడటం.. వలస వచ్చినవారి జీవితాల్ని దుర్భరం గావించవా? ఇక ఏడాదికి కోటి మందికి పైగా కొత్తగా ఉపాధి మార్కెట్‌లోకి వస్తుంటే, స్వాతంత్ర్య దినోత్సవం రోజున వెలువరించిన సప్తధార ప్రణాళిక ఎంత మందికి ఆదాయాలను ఇవ్వగలదు? ఒక వ్యవస్థీకృత సంక్షోభాన్ని ప్రధాని వ్యక్తిగతంగా తీసుకోనక్కర్లేదు. స్వీయ సానుభూతితో మనుషుల పట్ల విముఖతతో మూగజీవాల మధ్య గడపనక్కర్లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సమస్యలు వేరు, భారత్‌లో సమస్యలు వేరు. వారి నుండి మంచిని నేర్చుకోవటం, మన మంచిని కాపాడుకోవటం, భారతీయ పరిస్థితుల కనుగుణంగా వినూత్న పరిష్కారాలను అమలు చేయటం అవసరం. ఇందులో భాగంగా.. ముందు యువతకు నైపుణ్యాల శిక్షణనిచ్చి మహానగరాలకు వలసలు అక్కర్లేకుండా వ్యవసాయేతర ఉపాధి, వ్యాపార అవకాశాలను అందించాలి. సామాజిక పెన్షన్లు వంటివి తగ్గించి, పనిచేసేవారందరికీ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఏర్పాటు చేయాలి. నూరుశాతం మందినీ సంఘటిత రంగంలోకి తీసుకురావాలి. ఇందుకోసం గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఒక మహానగరంలో ఉండే విద్య, ఆరోగ్యం, పర్యావరణహిత సాంకేతికతలు వంటి సదుపాయాలన్నీ ఆ చిన్న పట్టణాల్లో ప్రణాళికాబద్ధంగా కల్పించాలి. మౌలిక వసతుల్ని నిర్మించి ప్రయివేటు పెట్టుబడుల్ని ప్రోత్సహించాలి. ఎక్కువ కార్మిక సాంద్రత గల తయారీ రంగంలోనూ చైనా ఉత్పత్తి చేయలేని, ప్రపంచ మార్కెట్‌లో

ఎన్నికల నిర్వహణపైనా ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తుండటం, తటస్థుల్లోనూ అనుమానాలు రేకెత్తించే వాతావరణంలోనే ఎన్నికల సంఘం (ఈసీ) ఎస్.ఐ.ఆర్ (సర్) కార్యక్రమం నిర్వహించటం, ఇతర రాజ్యాంగ వ్యవస్థలైన న్యాయస్థానాలు, చట్టసభల విశ్వసనీయత పైనా సందేహాలు, ఆధునిక ప్రజాస్వామ్యంలో చట్టబద్ధపాలనను నిష్పాక్షికంగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలు పోలీసు, సీబీఐ, ఏసీబీ, ఈడీ వంటి దర్యాప్తు యంత్రాంగాల్ని ప్రతిపక్షాలపై కక్షసాధింపుకి వినియోగిస్తుండటంలో బరితెగించటం, పార్టీలు మతాల్లా మారి సమాజంలో తీవ్ర విభజనలు ఏర్పడుతుండటం.. ఈ ఏడాది భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలకి, ప్రజలకి మధ్య వారధిగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పౌర సమాజం, మీడియాలను పాలకులు ప్రజాస్వామ్య భాగస్వాములుగా కాకుండా, తమ కనుసన్నల్లో వ్యవహరించే కీలుబొమ్మలుగా మార్చేందుకు ప్రయత్నిస్తూ అణచివేయటం వల్ల సవాళ్ల తీవ్రత పెరిగింది.

గిరాకీ గల వస్తువుల్నే తయారుచేయాలి. తయారీరంగంలో మూసపద్ధతి అనుకరణ ప్రస్తుత తరుణంలో చాలా నష్టదాయకం. కాబట్టి ఆవిష్కరణల సామర్థ్యం ప్రదర్శించాలి. ఇందుకోసం పరిశోధనల్ని ప్రోత్సహించాలి.

ఇదే సమయంలో మహానగరాల్లో సైతం విద్య, ఆరోగ్యం అధ్వాన్నంగా ఉన్నాయి. పెద్ద భవనాలు, అధునాతన ఆస్పత్రులలో మంచి చదువు, ఆరోగ్యం లభించవు. కాబట్టి నాణ్యమైన పాఠశాల విద్యను 12వ తరగతి వరకూ ఇంటిభాష, ఇంగ్లిష్‌తోపాటు ఒకట్రెండు దేశీ, విదేశీ భాషలతో అందించాలి. ఏఐ సాంకేతికతల్ని విద్యలో ఉపయోగించినట్లే, ప్రాథమిక, నివారణ వైద్యంలోనూ ఫ్యామిలీ డాక్టర్ పర్యవేక్షణలో వినియోగించాలి. తద్వారా ఎదిగేందుకు సమానావకాశాలను ప్రతి బిడ్డకూ అందించాలి. స్థానికంగా పరిష్కారం సాధ్యంకాని సమస్యల్ని మాత్రమే రాష్ట్ర, జాతీయ స్థాయికి వచ్చేలా వికేంద్రీకరించాలి. మహానగరాల్లో ఉండే నిపుణుల సమయం వృధాకాకుండా.. మౌలిక వసతుల్ని, గ్రీన్‌ఫీల్డ్, పునరుత్పాదక ఇంధన సాంకేతికతల్ని మెరుగుపరచాలి. ట్రాఫిక్, కాలుష్యం వంటి సమస్యల్ని పరిష్కరించాలి. ఎన్నికల మధ్యకాలంలో ప్రజలు భాగస్వాములు కాగలిగేలా ప్రజలు ఎన్నుకున్న కమిటీలను తగిన నిర్ణయాధికారంతో వార్డు స్థాయి వరకూ ఏర్పాటు చేయాలి. సమాజంలోని నిపుణుల సేవల్ని మంత్రి వర్గంలో, చట్టసభల్లో, అధికార యంత్రాంగంలో వినియోగించుకోవాలి. పౌర సేవలను హక్కుగా, నాణ్యతతో అందించాలి. రాష్ట్రాలు పరిపాలనకు ప్రధాన కేంద్రాలు కాబట్టి, అప్పులు చేసి ప్రజలను మభ్యపెట్టే పథకాలు అమలు చేయకుండా, పార్టీలు కొందరి వ్యక్తిగత ఆస్తులు కాకుండా రాజ్యాంగం ఇచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని చట్టబద్ధ ఏర్పాట్లు చేయాలి. అధికారాల విభజనతో రాజ్యాంగ సంస్థల, మీడియా స్వతంత్ర ప్రతిపత్తికి అంతిమంగా ప్రజలకు జవాబుదారీతనంతో, స్వయందిద్దుబాటుకు అవకాశమిచ్చేరీతిలో ఏర్పాట్లను పటిష్ఠం చేయాలి. పౌర సమాజాన్ని ప్రోత్సహిస్తూ ఆ సంస్థల హేతుబద్ధ దార్శనికతని, విధానపరమైన ఆలోచనల్ని పాలనలో భాగం చేయాలి. అవినీతికి మూలమైన ఓట్ల కొనుగోలును నియంత్రించేందుకు దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్ని, స్థానిక ప్రభుత్వాల్లో రీకాల్ వంటి పద్ధతుల్ని అమలు చేయాలి. సోషల్ మీడియా, ఏఐ ఆర్థిక వ్యవస్థ సానుకూల ఫలితాలకు మాత్రమే వినియోగించేలా, సమాచారంలో నాణ్యత ఉండేలా, ప్రజలు వాస్తవాల ఆధారంగా మాత్రమే స్పందించేలా నియంత్రణా వ్యవస్థల్ని దీర్ఘకాలిక దృష్టితో, ఇతర దేశాలతో సమన్వయంతో ఏర్పాటు చేయాలి. ఏఐ యుగం కొత్త తరానికి, మానవ మేధస్సు, మనస్తత్వానికి, పరిపాలనా వినియోగంలోనూ సమస్యగా మారకుండా స్థానిక ప్రభుత్వ స్థాయి వరకూ జాగ్రత్తలు వహించాలి. ఇలా యువతకు స్థానికంగానే గౌరవప్రదమైన ఆదాయంతో సంఘటిత ఉపాధి అవకాశాలను కల్పించటం; ప్రజల చేతికి వీలైనంత అధికారం ఇచ్చి, నాణ్యమైన పౌర సేవలతో ప్రభుత్వానికి, వారి జీవితాలకి మధ్య సంబంధం అర్థమయ్యే విధంగా వ్యవస్థీకృత సంస్కరణల్ని పారదర్శకంగా తేవటం వల్ల వారికి కూడా సంక్లిష్టతలు, సహనం ఆవశ్యకత, 'పుట్టుకతో ప్రతి మనిషీ సమానమే' అనే ప్రజాస్వామ్య సంస్కృతి ఆధ్యాత్మికం సహా అన్ని రంగాలలో తమ జీవన సాఫల్యతకు ఎంత కీలకమో అర్థమై పరిష్కారంలో భాగమవుతారు. ప్రజాస్వామ్యం సార్వజనీన విలువ అవుతుంది. ఈ నేపథ్యంలో, ప్రస్తుత సవాళ్లు భారతదేశ ప్రజాస్వామ్య పరిణతిని పెంచే అవకాశాలుగానే భావించాలి. ◈

# డాక్టర్ కొండయ్యకు జేపీ ఘననివాళి



రాజకీయ ఉద్యమంలో, ఆ తర్వాత పార్టీలో ఎంతో నిబద్ధతతో సేవలందించిన డాక్టర్ కె.కొండయ్య గారి అకాల మరణం పట్ల వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏ పేరుతో ఉన్నా లోక్‌సత్తా ఎజెండా అంశాల్లో మార్పు లేదనే స్పష్టతతో అనంతపురం జిల్లాలో ప్రతి బాధ్యతనూ చిత్తశుద్ధితో అమలు చేశారన్నారు. లోక్‌సత్తా భావజాలాన్ని విస్తృత స్థాయికి తీసుకెళ్లారన్నారు. తన సహచర మిత్రుడు డాక్టర్ శ్రీనాథ్‌తో కలిసి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఐఎంఏ, అప్నా జిల్లా అధ్యక్షుడిగా, లోక్‌సత్తా వేదికగా, నర్సింగ్ హోం ద్వారా ప్రజలకు ఎన్నో సేవలందించారని, కానీ కొందరు రోగులకు మాత్రమే కాకుండా ప్రజలందరికీ నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలను జేబు ఖర్చులేకుండా అందించే లోక్‌సత్తా ఆరోగ్య విధానం అమలవ్వాలని తపించారన్నారు. సుమారు రెండు దశాబ్దాలపాటు ప్రజాజీవితంలో డాక్టర్ కొండయ్య కృషి ఎందరికో స్ఫూర్తిదాయకమని, వారి లోటు సమాజానికి పూడ్చలేనిదని జేపీ ఘననివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. లోక్‌సత్తా ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు వేర్వేరు ప్రకటనల్లో డాక్టర్ కొండయ్యకు అంజలి ఘటించారు.

# నీలేకన్ కమిటీ – పరీక్షల్లో సంస్కరణలు

నీట్ లీక్ తక్షణ కారణంగా రాజకీయంగా నష్టం కూడా రావటంతో.. ప్రధాని మోదీ కొంత అసాధారణంగా స్పందించి నందన్ నీలకేని సారథ్యంలో హైపవర్ కమిటీ వేశారు. కమిటీలో ఇస్రో మాజీ చైర్మన్ ఎస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ దేకా, మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి, విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనిత కార్వల్, లాజిస్టిక్స్ నిపుణులు అమృత్‌లాల్ మినా సభ్యులుగా ఉన్నారు. మొత్తం పరీక్ష నిర్వహణ ప్రక్రియలో ఏఐ సహా అధునాతన సాంకేతికతల వినియోగం, ప్రశ్నాపత్రం రూపకల్పనలో, ఎన్‌క్రిప్షన్ పద్ధతిలో డిజిటల్ భద్రతలో, అభ్యర్థుల ధృవీకరణకు బయోమెట్రిక్‌ను పటిష్ఠం చేయటంలో, పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ) పట్ల ప్రజల్లో నమ్మకాని పునరుద్ధరించేలా ఆ సంస్థ నిర్వహణ, పాలనా పద్ధతుల్ని సంస్కరించేలా సిఫార్సుల్ని కమిటీ చేయాలని ప్రభుత్వం కోరింది. అంతకుముందు 2024లో ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ చైర్మన్‌గా ఒక కమిటీ 101 సిఫార్సులతో నివేదిక ఇచ్చింది. 2025లో పార్లమెంటరీ కమిటీ కూడా ఎన్‌టీయే పనితీరు మెరుగుపరచాలని స్పష్టం చేస్తూ నివేదిక అందించింది. ఎన్‌టీయే నిర్వహిస్తున్న జేఈఈ, క్యూయెట్ పరీక్షలు కూడా ప్రతిష్ఠాత్మకమైనవే అయినా.. మెడికల్ యూజీ అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్‌కు సంఖ్యాపరమైన సవాలు కూడా ఉంది. ఏడుగురు సభ్యులతో ఏర్పాటైన ఉన్నతస్థాయి రాధాకృష్ణన్ కమిటీ 23 పూర్తిస్థాయి సమావేశాల్ని నిర్వహించింది, 37,000 స్పందనల్ని పరిశీలించింది. ప్రశ్నాపత్రం కూర్పు, డేటా భద్రత, రవాణా, పరీక్షా కేంద్రాలు, ఎన్‌టీయే అంతర్గత పాలనా యంత్రాంగం, సాంకేతికత మొదలైన అంశాల మీద తన సిఫార్సుల్ని అందించింది. వాటి అమలు పర్యవేక్షణకు అదే ఏడాది నవంబర్‌లో మరో ఉన్నతస్థాయి కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ప్రశ్నాపత్రం రూపకల్పన చేసేవారుగా ఎవరిని ఎంపిక చేయాలి, వారు నివసించే చోటుకి దూరంగా ఉంటూ తమ బాధ్యతల నిర్వహణ, పెద్దసంఖ్యలో ప్రశ్నల నుండి ర్యాండమ్‌గా ఎంపిక చేసి పరీక్షాపత్రాన్ని రూపొందించటం.. మొదలైనవన్నీ రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల్లో ఉన్నాయి. బయటివారెవరూ ప్రశ్నాపత్రాల్ని చూడలేదని ధృవీకరించటానికి భాషానిపుణుల ఏర్పాటును కూడా కమిటీ సూచించింది. ఏ కారణంగా అయితే 2026 నీట్ పేపర్ లీకైందో, ఆ అంశం పట్ల ఎలా జాగ్రత్త వహించాలో కమిటీ సమగ్రంగా సూచించింది. వీటి ప్రకారం, కంప్యూటర్ ఆధారిత పెన్ను, కాగితం పద్ధతిలో పరీక్ష జరుగుతుంది. ఎన్‌క్రిప్టెడ్‌గా వచ్చిన ప్రశ్నాపత్రం.. పరీక్షకు కొద్దిసమయం ముందు మాత్రమే ప్రచురితమవుతుంది. కమిటీ ఇచ్చిన 101 సిఫార్సులన్నిటినీ ఆమోదించిన ప్రభుత్వం.. 57ను మాత్రమే పూర్తిగా అమలు చేసింది. పది సిఫార్సుల్ని పాక్షికంగా అమల్లోకి తెచ్చింది. నాలు గింటి అమలును ప్రకటించింది. 27 సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజలకు బహిరంగంగా కనిపించే, ప్రచారమయ్యే ఆధార్ ధృవీకరణ, బయోమెట్రిక్ రీ వెరిఫికేషన్, ప్రభుత్వ సొంత కేంద్రాలు, ఏఐతో కూడిన సీసీటీవీ వంటివి మాత్రం వేగంగా అమలు చేశారు.

పార్లమెంటు కూడా ప్రవేశ పరీక్షల విషయంలో ఆందోళన వ్యక్తం చేయటంతో విద్యపై దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలో ఒక స్థాయీ సంఘాన్ని సైతం ఏర్పాటు చేశారు. తన 371వ రిపోర్టును ఆ కమిటీ 2025 డిసెంబర్‌లో అందచేసింది. ఎన్‌టీయే అంతకు ముందు సంవత్సరం నిర్వహించిన 14 ప్రవేశ పరీక్షల్లో కనీసం అయిదు సమస్యలను ఎదుర్కొన్నాయని పార్లమెం టరీ సంఘం తెలిపింది. ఎన్‌టీయే నివేదికను పార్లమెంటులో ఏటా ప్రవేశ పెట్టాలని, పేపర్ కూర్పు, పరీక్ష నిర్వహణ లేదా మార్కుల కేటాయింపు వంటి అంశాల్లో ప్రయివేటు వర్గాలు విఫలమైతే, అలాంటి సంస్థల్ని దేశవ్యాప్తంగా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సూచించింది. కానీ ఇంతవరకూ ఏ ఒక్క సంస్థపై అలాంటి చర్య తీసు కోలేదని ఆర్‌టీఐ సమాచారంలో వెల్లడైంది.

2023–24లో ఎన్టీయే వద్ద రూ.520 కోట్ల మిగులు నిధులు న్నాయని రాజ్యసభలో మంత్రిత్వశాఖ సమాధాన మిచ్చింది. సంస్థ పనితీరులో లోపాల్ని సరిదిద్దుకునేందుకు ఆ నిధుల్ని వినియోగించలేదని మరో ఆర్‌టీఐ సమాధానంలో వెల్లడైంది. ఒకే రోజు, ఒకే పేపర్ కాకుండా.. తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్ అడ్మిషన్లకు నిర్వహించే పరీక్షల తరహాలో కొన్ని రోజులపాటు షెడ్యూల్ ఉంటే, నిర్వహణ మరింత సమర్థంగా ఉండొచ్చని కొందరు నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల, ఒకవేళ ప్రశ్నాపత్రం లీకైనా.. నష్టం ఆ ఒక్క సెషన్‌కే పరిమితమవుతుంది. ఒక్క ప్రవేశ పరీక్ష మార్కుల్ని మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అంతకుముందు ఏడాదిల్లో అభ్యర్థుల అకడమిక్ అభ్యసన ఫలితాలకు కూడా కొంత వెయిటేజీ ఇవ్వొచ్చు. దీనివల్ల, ఒత్తిడి తగ్గి, పరీక్ష మరింత హేతు బద్ధంగా మారే అవకాశం ఉంది.

ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు, రాష్ట్రాల్లోని ప్రమాణాలు, పరీక్షల పట్ల విశ్వసనీయత లేదు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఒక ప్రామాణికతతో పరీక్ష సాధ్యంకాకపోవచ్చు. అందువల్ల జాతీయ స్థాయి పరీక్ష ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన పద్ధతి. కానీ, ఆ పరీక్షల్లో ర్యాంకులు వచ్చిన వారిలో కూడా పాఠశాల విద్య బలహీనంగా ఉండటంతో.. తమ వృత్తి నైపుణ్యాల్లో ఆశించిన ఫలితాల్ని ప్రదర్శించలేక పోతున్నారు. సామాన్య ప్రజలకు వ్యక్తిగత ఆర్థికభారం, అప్పుల భయం లేకుండా అందుబాటులో నాణ్యమైన వైద్య ఆరోగ్య విధానం, వైద్య విద్య ప్రమాణాలు వంటి అంశాలపై చర్చించాల్సిన తరుణంలో.. పోలీసు బందోబస్తులు, ఇప్పటికే అందుబాటులో ఉన్న సాంకేతికత, పరీక్షల నిర్వహణ నమూనాలపై దృష్టి కేంద్రీకరించాల్సిరావటం దుందృష్టకరం. కాబట్టి, ఇంతకుముందు కమిటీల సిఫార్సుల్ని, ప్రజల సూచనల్ని క్షుణ్ణంగా పరిశీలించటంతోపాటు.. జేపీ ప్రతి పాదించినట్లు పాఠశాల విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాల్ని బేరీజు వేసే పరీక్షా పద్ధతుల నుండి అధ్యయనం చేసి నీలేకన్ కమిటీ నీట్ తదితర పరీక్షలపై సిఫార్సులు ఇస్తే ప్రజాధనానికి విలువ జోడించటంతోపాటు, యువత అంచనాలకు న్యాయం చేయగలుగుతుంది. ◈






# అసంఘటిత రంగంలోని కష్టజీవులు నిజమైన హీరోలు, వారికి జీవన భద్రత కల్పించటం అభివృద్ధి భారత్‌కి కీలకం

సమాజానికి చేసే మంచి మనకూ మంచి అవుతుందని, చెడు మనకూ చెడు అవుతుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అందువల్ల సమాజానికి ఉపయోగపడే పనుల ద్వారా ఉపాధిని పొందటం, అందుకోసం సాంకేతికతల్ని ఉపయోగించుకోవటం దీర్ఘకాలంలో మనకు ప్రయోజనకరమవుతుందన్నారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా హైదరాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో 'ఐ ఫోకస్ మిషన్' ఆధ్వర్యంలో జరిగిన మైత్రి వారధి 2026 కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. దేశంలో పనిచేసేవారు 54 కోట్ల మంది ఉంటే.. వారిలో నెలవారీ జీతం పొందే సంఘటితరంగంలో ఉన్నవారు 8 నుండి 9 కోట్ల మందేనన్నారు. మిగతా 45 కోట్ల మంది సమాజానికి ఉపయోగపడే వివిధ వృత్తుల ద్వారా ఆదాయం పొందుతున్నారన్నారు. అసంఘటితరంగంలో అభద్రతాభావంలో పనిచేస్తున్నా.. ఆత్మగౌరవం వల్ల వారు నిజమైన హీరోలుగా బతుకుతున్నారన్నారు. అల్గారిథమ్స్ ద్వారా విద్వేషాల్ని, బలహీనతల్ని రెచ్చగొట్టి లబ్ధిపొందేందుకు సాంకేతికతను వినియోగించి అడ్డదారుల్లో ఆదాయాలు పొందాలనుకునే యువత ఇటీవల పెరుగుతుండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలోని హీరోలకు జీవనభద్రతను కల్పిస్తేనే భారత్ అభివృద్ధి చెందిన దేశం కాగలదన్నారు. ఇందుకోసం నాణ్యమైన విద్య, చిన్న పట్టణాల్లో తయారీరంగాన్ని ప్రోత్సహించటం, చట్టబద్ధపాలన వంటి మౌలిక సంస్కరణలతోపాటు దుష్పరిణామాలులేని చౌక ఇంధనం అవసరమన్నారు. పెట్రోల్, డీజిల్ నుండి మనం 100% విద్యుత్ వాహనాలకు మళ్లాలన్నారు. అభివృద్ధి రేటులో కీలకపాత్ర పోషించే రవాణా వ్యయాన్ని, కాలాన్ని తగ్గించేలా ప్రజారవాణా వ్యవస్థల్ని అభివృద్ధి చేయాలన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించటంతోపాటు.. ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, నిబంధనలను పాటించే చర్యలు తీసుకోవాలన్నారు. మన దేశం ఈ దిశగా చెయ్యాల్సింది చాలా ఉందన్నారు. విధానపరంగా ప్రభుత్వం సరిగా వ్యవహరించేలా చేయటంతోపాటు.. అమలులో మన బాధ్యతను కూడా సవ్యంగా నెరవేర్చాలన్నారు. చైనాలో 12 కోట్ల విద్యుత్ కార్లు, 7 కోట్ల ఈ-బైక్‌లు అమ్ముడుకాగా, మన దేశంలో 3 లక్షల విద్యుత్ కార్లు, 15 లక్షల బైక్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. సంస్థ లక్ష్యాలైన సమగ్రత, బాధ్యత, భారతీయతను నిబద్ధతతో పాటిస్తున్నారని ఐ-ఫోకస్ ప్రతినిధులను జేపీ అభినందించారు. ప్రముఖ శిక్షకుడు ఆకెళ్ల రాఘవేంద్ర, పల్లవి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ జేబీవీ సుబ్రహ్మణ్యం, బోధనా శిక్షకుడు డాక్టర్ డీవీ రమణమూర్తి, మ్యాక్స్ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ జేఎన్ రెడ్డి, ఐఫోకస్ కో ఆర్డినేటర్ వాసుదేవశర్మ, డైరెక్టర్లు రామరాజు, కనకదుర్గ, శ్రీధర్, సత్యవాణి ప్రాజెక్ట్ సీఎండీ సత్యప్రకాష్ మాట్లాడారు. ఐఫోకస్ ప్రతినిధులు సంఘటిత బలానికి సంకేతంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.






**విజయవాడ లోని స్కూల్ అఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కి టెక్చర్ యూనివర్సిటీలో జరిగిన యూత్ లీడర్ షిప్ 2047 కార్యక్రమంలో యువత నుద్దేశించి లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్, యూనివర్సిటి డైరెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి అయ్యార్ తదితరులు పాల్గొన్నారు.**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th Sep 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001

# Can జెన్ జడ్

## Game-Change Indian Politics?

Townhall with JP

Watch @

https://www.youtube.com/@JPLoksattaOfficial













తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ స్కూల్‌లో ప్రగతి 'విజ్ఞాన్‌సేతు సైన్స్ సెంటర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తదితరులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**